www.manatelangana.news
Mana Telangana

మన తెలంగాణ

హైదరాబాద్ | సంపుటి 6 | సంచిక: 53 | శనివారం | 12 ఆగస్టు, 2017

...అక్షరం సాక్షిగా ఇది ప్రజల పక్షం

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

పేజీలు: 12 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00

సోమ, మంగళవారాల్లో భారీ వర్ష సూచన

మన తెలంగాణ/ హైదరాబాద్: రాష్ట్రంలోని పలు చోట్ల సోమ, మంగళవారాల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఉపరితల ఆవర్తనం ఉత్తరం నుంచి దక్షిణం వైపుగా రాయలసీమ నుంచి కోస్తాంధ్ర వైపు పయనిస్తోందని వాతావరణ కేంద్రం డైరెక్టర్ వైకె రెడ్డి తెలిపారు. ఇది సముద్రమట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో తరువాయి 6లో



ఉప రాష్ట్రపతిగా వెంకయ్య పదవీ స్వీకారం

- ప్రతి ఒక్కరికి అవకాశం కల్పిస్తానని రాజ్యసభ చైర్మన్‌గా హామీ

న్యూఢిల్లీ : భారతదేశ 15వ ఉపరాష్ట్రపతిగా వెంకయ్య నాయుడు (68) శుక్రవారం ప్రమాణం చేశారు. ఇక్కడ రాష్ట్రపతిభవన్‌లోని దర్బార్ హాలులో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదుగా జరిగిన ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి వెంకయ్య సతీమణి ఉష సహా పార్టీలకతీతంగా తరువాయి 6లో

గోరఖ్‌పూర్‌లో ఘోరం

ఆసుపత్రిలో ఆక్సిజన్ లేక 30 మంది బాలల దుర్మరణం



గోరఖ్‌పూర్: ఉత్తరప్రదేశ్‌లో పసికందులు ప్రభుత్వాసుపత్రిలో అసువులు బాశారు. కనీసం 30 మంది పిల్లలు గోరఖ్‌పూర్‌లో ప్రభుత్వ ఆధ్వర్యంలోని బాబా రాఘవ్‌దాస్ వైద్యకళాశాల ఆసుపత్రిలో చనిపోయారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ రాజీవ్ రౌటేలా తెలిపారు. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యానాథ్ ప్రాతినిధ్యం వహించే లోక్‌సభ నియోజకవర్గంలోనే బాలలు మృత్యువాత పడ్డారు. గత రెండు రోజుల వ్యవధిలో అప్పుడే పుట్టిన శిశువులు మొదలుకొని నెలలు, సంవత్సరాల బాలలు చనిపోవడం తల్లిదండ్రులకు పుట్టెడు శోకాన్ని తరువాయి 6లో

దశవర్ష దిశ



హైదరాబాద్ అభివృద్ధికి పదేళ్ల ప్రణాళిక రూపొందించాలి


30 ఏళ్ల అవసరాలకు అనువుగా పథక రచన : సిఎం



మన తెలంగాణ/ హైదరాబాద్: హైదరాబాద్ అభివృద్ధికి పదేళ్ల ప్రణాళిక రూపొందించాలని, అందుకు అనుగుణంగా ఇప్పటి నుంచి ప్రతి పని చేసుకుపోవాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు అధికారులను ఆదేశించారు. రాబోయే 30 ఏళ్లకు ఏర్పడే అవసరాలకు తగ్గట్లుగా ప్రణాళిక సిద్ధం చేయాలని, పదేళ్ల యాక్షన్ ప్లాన్ తయారు చేయాలన్నారు. నగరం కోసం రెండు మంచినీటి రిజర్వాయర్లు నిర్మించడంతో పాటు రహదారులు, మురికి కాలువలు, వరద కాలువలు, విద్యుత్ సరఫరా, పారిశుద్ధ్యం, రవాణా సదుపాయాలు, మార్కెట్లు, టాయిలెట్లు, పచ్చదనం తదితర అంశాల్లో నగరం ఎలా ఉండాలో ప్రణాళిక రూపొందించాలని చెప్పారు. హైదరాబాద్ నగర అభివృద్ధిపై ప్రగతిభవన్లో శుక్రవారం ముఖ్యమంత్రి కెసిఆర్ సమీక్ష నిర్వహించారు. మంత్రులు కెటి రామారావు, టి.హరీశ్‌రావు, ప్రభుత్వ ప్రధాన సలహాదారు రాజీవ్ శర్మ, మేయర్ బొంతు రామ్మోహన్, డిప్యూటీ మేయర్ తరువాయి 6లో

లెక్క తప్పింది

- 7.5% వృద్ధిరేటు అసాధ్యమని ఆర్థికసర్వే వెల్లడి
- దేశ ప్రగతిబాటలో తీవ్ర సవాళ్లు పొంచి ఉన్నట్లు స్పష్టీకరణ
- వడ్డీ రేట్లు మరింత తగ్గాలని సూచన



న్యూఢిల్లీ : దేశ ఆర్థిక పరిస్థితిలో అనిశ్చితి నెలకొని ఉంది. ఇంతకు ముందు అనుకున్న 7.5 శాతం వృద్ధి రేటును సాధించడం కష్టమని ఆర్థిక సర్వేలో వెల్లడైంది. ఆర్థిక వ్యవస్థకు పలు సవాళ్లు పొంచి ఉన్నాయని ఈ కీలక ఆర్థిక సమీక్షలో స్పష్టం చేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రూపొందించిన ఆర్థిక సర్వే రెండవ (తుది) భాగాన్ని శుక్రవారం ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ పార్లమెంట్ ముందుంచారు. ఈ ఆర్థిక సర్వేలోని అంశాలలో దేశ ప్రగతి క్లిష్టతరంగానే ఉందని వెల్లడైంది. ప్రభుత్వం అంచనా వేసుకుంటూ వస్తున్న అత్యున్నత స్థాయి జిడిపి తరువాయి 6లో



ఉమ్మడి పోరు 10

- బిజెపితో పోరాట వ్యూహ రచనకు సోనియా అధ్యక్షతన 16 పార్టీల భేటీ

స్ఫూర్తి యాత్ర భగ్నం

- కోదండరామ్ అరెస్టు
- హైదరాబాద్‌కు తరలింపు
- కామారెడ్డి జిల్లా బిక్కనూర్ పోలీస్ స్టేషన్ వద్ద ఉద్రిక్తత
- జెఎసికి, పోలీసులకు మధ్య తోపులాట
- యాత్రను అడ్డుకొని కామారెడ్డి సభా వేదికను కూల్చివేసిన టిఆర్‌ఎస్ కార్యకర్తలు
- దాడిలో జెఎసి విద్యార్థి నాయకులకు గాయాలు, ఒకరిని గాంధీకి తరలింపు



బిక్కనూర్ పోలీస్‌స్టేషన్‌లో కోదండరామ్

మన తెలంగాణ/ కామారెడ్డి: జెఎసి ఆధ్వర్యంలో తలపెట్టిన 4వ విడత అమరుల స్ఫూర్తి యాత్రకు కామారెడ్డి జిల్లాలో అడుగడుగునా ఆటంకాలు ఏర్పడ్డాయి. కామారెడ్డిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభా వేదికను టిఆర్‌ఎస్ కార్యకర్తలు కూల్చివేశారు. యాత్రను బిక్కనూర్‌లో టిఆర్‌ఎస్ కార్యకర్తలు అడ్డుకోవడంతో పోలీసులు జెఎసి చైర్మన్ ప్రొఫెసర్ కోదండరామ్‌తో సహా యాత్రలో పాల్గొన్న తరువాయి 6లో

డ్రగ్స్ కేసులో త్వరలో చార్జ్‌షీట్ : అకున్ 3

3 నేరెళ్లపై జాతీయ మానవ హక్కుల కమిషన్ నోటీసులు

'ముత్తూట్' కేసులో ప్రధాన నిందితుడు ఖాదర్ హైద్రీ అరెస్టు

- రెండు పిస్తోళ్లు, బుల్లెట్లు స్వాధీనం 11

సీట్లు నిండని ఇంజినీరింగ్ కాలేజీల మూసివేతకు రంగం సిద్ధం

- ఎఐసిటిఇ చైర్మన్ వెల్లడి
- దేశ వ్యాప్తంగా భర్తీ కాని సీట్లు 27 లక్షలు
- 30% కన్నా తక్కువ అడ్మిషన్లు 10



చైనా సరిహద్దుల్లో భారీగా భారత సైన్యం మొహరింపు 6

కుంచెపోటు



మద్య నిషేధంలో కూడా మాట తప్పుతారని ఆశతో కూర్చున్నా..!

ప్రజా సేవల కోసం ఐసిటి మరింత వినియోగం

మన తెలంగాణ/హైదరాబాద్ : ప్రజా సేవలను మరింత సమర్థంగా సమాజానికి అందించేందుకు ప్రభుత్వ ఉద్యోగులు ఇన్‌ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీని (ఐసిటి) విస్తృతంగా వినియోగించుకోవాలని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు ఎస్.నిరంజన్ రెడ్డి కోరారు. నగరంలోని డా.మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో భారత ప్రభుత్వం అందిస్తున్న ఇ లెర్నింగ్ విధానం కార్యక్రమంలో నిరంజన్ రెడ్డి మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాలలో ఉద్యోగులు ప్రభుత్వ సేవలను సమాజానికి మెరుగ్గా అందించేందుకు ఐసిటిని విస్తృతంగా ఉపోయించుకుంటున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ప్రజా సేవలు అందించే ప్రక్రియలో ఉద్యోగులకు ఇ శిక్షణ అనేది ఆవశ్యకంగా మారిందని అన్నారు. ఉద్యోగులు తమకు కేటాయించిన విధులను నిర్వర్తించడమే కాకుండా రాష్ట్ర వృద్ధి ప్రక్రియలో సర్కార్ ఉద్యోగులకు కీలక భూమిక ఉందని సిఎం చెబుతుంటారని ఆయన వివరించారు. ప్రజా అవసరాలకు అనుగుణంగా మెరుగైన సేవలు అందించేందుకు ఉద్యోగులు ముందుకు సాగాలన్నారు. కేంద్ర ప్రభుత్వ డిఒపిటి సంయుక్త కార్యదర్శి డా.దేవేశ్ చతుర్వేది మాట్లాడుతూ గతంలో తాము గ్రూపు ఎ, బి అధికారుల శిక్షణపై మాత్రమే దృష్టి సారించేవారమని అన్నారు.



టిఆర్ఎస్‌లోనే ఉంటా : డిఎస్

మనతెలంగాణ/హైదరాబాద్: తాను టిఆర్ఎస్ పార్టీని వదిలే ప్రసక్తే లేదని టిఆర్ఎస్ రాజ్యసభ సభ్యులు డి.శ్రీనివాస్ పునరుద్ఘాటించారు. టిఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు మరోసారి వచ్చిన వార్తలను ఆయన తీవ్రంగా ఖండించారు. తెలంగాణ భవన్‌లో శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్‌ను వీడాల్సిన పరిస్థితి అందరికీ తెలిసిందేనని, ఇప్పుడు టిఆర్ఎస్ వీడుతానంటూ తానంటే గిట్టని వారే ప్రచారం చేస్తున్నారని తెలిపారు.

15 తరువాత 'క్విట్ టిఆర్ఎస్'

మనతెలంగాణ/హైదరాబాద్: గిరిజనులకు తొమ్మిది శాతం రిజర్వేషన్, తండాలను గ్రామ పంచాయతీలు చేస్తామన్న హామీని స్వాతంత్ర్య దినోత్సవం వరకు నెరవేర్చకపోతే, ఆగస్టు 15 తరువాత 'క్విట్ టిఆర్ఎస్' ఉద్యమాన్ని చేపడతామని మాజీ ఎంపి, కాంగ్రెస్ అధికార ప్రతినిధి రవీంద్ర నాయక్ అన్నారు. సిఎల్‌పి కార్యాలయం వద్ద శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల్లో గిరిజనులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కెసిఆర్ నెరవేర్చలేదని విమర్శించారు.

నేడు కుంతియా రాక

మన తెలంగాణ/ హైదరాబాద్ : ఇటీవల రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంఛార్జ్‌గా నియమితులైన డాక్టర్ రామచంద్ర కుంతియా, ఇంఛార్జ్ సెక్రెటరీ జె.సతీశ్‌లు తొలిసారిగా శనివారం హైదరాబాద్‌కు రానున్నారు. భువనేశ్వర్ నుండి మధ్యాహ్నం 1:30 గంటలకు కుంతియా హైదరాబాద్‌కు చేరుకుంటారు. రాయచూరు నుండి సాయంత్రం ఐదు గంటలకు సతీశ్ నగరానికి చేరకుంటారు. వీరిరువురితో పాటు కాంగ్రెస్ ముఖ్య నేతలకు టిపిసిసి అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సాయంత్రం విందు ఇవ్వనున్నారు. కాగా, ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు గాంధీభవన్‌లో జరిగే టిపిసిసి కార్యవర్గ విస్తృతస్థాయి సమావేశానికి కుంతియా, రమేశ్‌లు ప్రసంగిస్తారు. సోమవారం ఉదయం నుండి టిపిసిసి అనుబంధ సంఘాలు, విభాగాలతో సమావేశమవుతారు.

ఎస్‌పిపై చర్య తీసుకోకపోతే దీక్ష

మన తెలంగాణ/ హైదరాబాద్ : ఈ నెల 30వ తేదీ లోపు నేరెళ్ల ఘటనకు బాధ్యుడైన సిరిసిల్ల జిల్లా ఎస్‌పిపై చర్య తీసుకోవాలని లేకపోతే తాను దీక్ష చేస్తానని ఎఐసిసి కార్యదర్శి, మాజీ ఎంపి వి.హనుమంతరావు అన్నారు. ఈ ఘటనలో పులి లాంటి ఎస్‌పిని వదిలేసి, జింక పిల్లలాంటి ఎస్‌ఐపై వేటు వేయడం సిగ్గు చేటు అని విమర్శించారు. గాంధీభవన్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సిఎం కెసిఆర్ అహంకార పూరిత మాటలు మానకపోతే ఆయన చరిత్రను తీయాల్సి వస్తుందని హెచ్చరించారు. కాంగ్రెస్ నేతలు టూరిస్టులు కాదని అమెరికా నుండి వచ్చిన మంత్రి కెటిఆరే అసలు టూరిస్టు అని ఎద్దేవా చేశారు. నేరెళ్లలో థర్డ్ డిగ్రీ ప్రయోగించిన ఎస్‌పిపై చర్య తీసుకుంటేనే బాధితులకు న్యాయం జరుగుతుందన్నారు. ఇప్పటి వరకు లారీ ప్రమాదంలో మరణానికి కారణమైన లారీ డ్రైవర్, యజమానిపై ఎందుకు చర్య తీసుకోలేదని ప్రశ్నించారు. బాధితుల పక్షాన ప్రతిపక్షాలు పోరాడుతుంటే రాజకీయం చేస్తున్నారంటూ నిందలు వేయడం మంచి పద్ధతి కాదన్నారు.

ఒంటరి మహిళలకు పెన్షన్ ఘనత మనదే

మన తెలంగాణ/హైదరాబాద్: ఏ రాష్ట్రంలో లేని విధంగా ఆధారం లేని ఒంటరి మహిళలకు పెన్షన్లు అందజేస్తున్న ఘనత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికే దక్కుతుందని సాంఘిక సంక్షేమ బోర్డు చైర్మన్ రాగం సుజాత యాదవ్ అన్నారు. శుక్రవారం ఢిల్లీలో కేంద్ర సాంఘిక సంక్షేమ మండలి కార్యవర్గ సమావేశం జరిగింది. రాష్ట్రం తరపున రాగం సుజాత హాజరై ప్రసంగించారు. మహిళల సంక్షేమం, ఉద్యోగం, ఉపాధి, నిరక్షరాస్యత, లింగ నిర్ధారణ వంటి విషయాలకు ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించాలని ఆమె కోరారు. అనంతరం కేంద్ర సాంఘిక సంక్షేమ బోర్డు చైర్మన్ చేతన్ బి సాంఘికి వినతిపత్రం అందజేశారు. నిధులు కేటాయించేందుకు చేతన్ బి సాంఘి సానుకూలంగా స్పందించినట్లు రాగం సుజాత యాదవ్ తెలిపారు.

దురాశకు పోయి నగరాన్ని పాడు చేయొద్దు

• బిల్డర్లకు కెటిఆర్ హెచ్చరిక • నిబంధనలు పాటించాల్సిందేనని స్పష్టీకరణ

మనతెలంగాణ/హైదరాబాద్: బిల్డర్లు దురాశకు పోయి హైదరాబాద్ నగరాన్ని పాడు చేయకూడదని, నిబంధనలను పాటించాలని మున్సిపల్ శాఖ మంత్రి కె. తారకరామారావు సూచించారు. తమకు తాముగా స్వియనియంత్రణ చేసుకోవాలని, నిబంధనలు అతిక్రమించిన నిర్మాణాలపై చర్యలకు పూనుకుంటే ప్రభుత్వాన్ని తప్పుపట్టొద్దని హెచ్చరించారు. హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో కొందరు బిల్డర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు దురాశతో నిబంధనలకు పాతరపెట్టి మరీ నిర్మాణాలను కొనసాగిస్తున్నారన్నారు. సమగ్ర ప్రణాళికలతో హైదరాబాద్‌ను విశ్వనగరంగా మార్చేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. హైదరాబాద్ శివారు ప్రాంతంలోని పంచాయతీల కాలపరిమితి పూర్తి కాగానే జిహెచ్ఎంసిలో విలీనం చేస్తామని వెల్లడించారు. భూ రికార్డులను త్వరలోనే ప్రక్షాళన చేస్తామన్నారు. హైదరాబాద్‌లో శుక్రవారం "తెలంగాణ బిల్డర్స్ ఫెడరేషన్ 3వ వార్షికోత్సవ కార్యక్రమానికి మంత్రి కెటిఆర్ ముఖ్యఅతిథిగాహాజరై మాట్లాడుతూ కొన్ని ప్రాంతాల్లో బిల్డర్లు మినహాయింపులను కోరితే పరిశీలిస్తామని, అంతే కాని నిబంధనలను మాత్రం తుంగలో తొక్కితే చర్యలు తప్పవన్నారు.వచ్చే ఆగస్టు వరకు లక్ష డబుల్ బెడ్‌రూములను నిర్మించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. ప్రభుత్వంలో ఘననీయమైన అనినీతి తగ్గిందన్నారు. ఈ ఏడాది నవంబర్ చివరి నాటికి హైదరాబాద్ మెట్రో రైల్ మొదటి దశలో భాగంగా నాగోల్ నుంచి మియాపూర్ లైన్‌ను ప్రధాని చేతుల మీదుగా ప్రారంభిస్తామన్నారు. హైదరాబాద్‌లో 290 కిలోమీటర్ల వరకు వైట్‌ట్యాపింగ్ రహదారుల ఏర్పాటు ప్రక్రియను 12 మాసాల్లో పూర్తి చేస్తామని, వర్ష కాలం పూర్తి కాగానే పనులను మొదలు పెడుతామన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే రియల్ ఎస్టేట్ రంగం కుదేలవుతుందని విషప్రచారం చేశారని, సిఎం కెసిఆర్ మూడేళ్లలో తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలబెట్టారని, ఇతర రాష్ట్రాలకు తెలంగాణ పాఠాలు నేర్పిస్తుందన్నారు. డిపిఎంఎస్ తరహాలో బిల్డర్లకు అన్ని అనుమతులతో సింగిల్ విండో విధానాన్ని అమలు చేసేందుకు ప్రయత్ని స్తున్నామన్నారు. రూ.1600 కోట్లతో 33 కిలోమీటర్ల వరకు మూసీ సుందరీకరణ పనులను ప్రారంభించబోతున్నామన్నారు. బిల్డర్ల పరిస్థితులు ఎలా ఉన్నాయో తమ రాజకీయ పరిస్థితులు అలాగే ఉన్నాయని, "ఉప్పర్ షేర్వానీ, అందర్ పరేషానీ" అన్నచందంగా ఉన్నయని ఆయన వ్యాఖ్యానించారు.



మళ్లీ మాదే అధికారం

ఎనిమిదేండ్లలో హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దుతామని, ఇది టిఆర్ఎస్ ప్రభుత్వంతోనే సాధ్యమని, రాబోయే ఎన్నికల్లో కూడా అధికారం మనదేనని(టిఆర్ఎస్) మంత్రి తారకరామారావు ధీమా వ్యక్తం చేశారు. తాము అధికారంలోనికి రాలేమనే విషయం ప్రతిపక్షాలకూ తెలుసన్నారు. ఎనిమిదేండ్లలో హైదరాబాద్ నగరాన్ని అంత ర్జాతీయ ప్రమాణాలతో అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దుతామన్నారు. రాత్రికి రాత్రి విశ్వనగరాలు తయారుకావని, విశ్వనగరం ఇదే నా అంటూ ప్రతిపక్షాలు వ్యాఖ్యలు చేయడం విడ్డూరంగా ఉందని, వారి హయాంలో ఏం చేశారని ఆయన ప్రశ్నించారు. ఈ సమావేశంలో మేయర్ బొంతురామ్మోహన్, రెవెన్యూ ముఖ్యకార్యదర్శి సోమేష్‌కుమార్, జిహెచ్ఎంసి కమిషనర్ బి.జనార్దన్ రెడ్డి, తెలంగాణ బిల్డర్స్ ఫెడరేషన్ అధ్యక్షులు సి.ప్రభాకర్‌రావు, ప్రధాన కార్యదర్శి జె. వెంకట్ రెడ్డితో పాటు వివిధ జిల్లాల నుంచి బిల్డర్స్ ఫెడరేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

సున్నమేసి ఇల్లంత కట్టినట్లు ప్రచారం

కెసిఆర్‌పై మధుయాష్కి విసుర్లు

మన తెలంగాణ/హైదరాబాద్ : కట్టిన ఇల్లంకు సున్నం వేసి ఇళ్లంతా తానే కట్టినట్టు సిఎం కె. చంద్రశేఖర్‌రావు ప్రచారం చేసుకుంటున్నారని, తాము ప్రాజెక్టలు కడితే వాటికి ప్రారంభోత్సవాలు చేస్తూ అవి తానే నిర్మించినట్టు చెప్పుకోవడం సిగ్గు చేటు అని ఎఐసిసి కార్యదర్శి, అధికార ప్రతినిధి మధుయాష్కి విమర్శించారు. గాంధీభవన్‌లో బాల్కొండ మాజీ ఎంఎల్‌ఏ ఈరవత్రి అనిల్ కుమార్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. మహారాష్ట్ర కడుతున్న బాబ్లీ ప్రాజెక్టుతో ఎస్ఆర్ఎస్‌పికి నీరు రావడం లేదని గతంలో తాను సుప్రీంకోర్టులో కేసు వేశానని, అప్పుడు ఎంపిగా ఉన్న కెసిఆర్ సహకరించకపోగా, బాబ్లీ వల్ల పెద్దగా నష్టం లేదన్నారని గుర్తు చేశారు. కాంగ్రెస్ నాయకులు ప్రాజెక్టులకు అడ్డు పడుతున్నారని, తానే ప్రాజెక్టులను నిర్మిస్తున్నానని పదే పదే అబద్దాలు చెబుతున్న సిఎం కె. చంద్రశేఖర్‌రావు ఎస్ఆర్ఎస్‌పి, శంకుస్థాపన చేసిన వరద కాలువ, ఎల్లంపల్లి ప్రాజెక్టు ఎవరు నిర్మించారో చెబితే బాగుండేదన్నారు. అయినా ఎస్ఆర్ఎస్‌పి పునరజ్జీవపథకం కంటే తక్కువ ఖర్చయ్యే ఇంజనీర్ హనుమంతరావు సూచించిన వరుస బ్యారేజీల నిర్మాణం మంచిదని సూచించారు. అసెంబ్లీలో కెసిఆర్ చెప్పిన రీ డిజైన్ అంతా తప్పని, తనకు తానే నిరూపించుకున్నారన్నారు. అసెంబ్లీలో కెసిఆర్ రీడిజైన్‌పై ఇచ్చిన ప్రజెంటేషన్‌లో ఎస్ఆర్ఎస్‌పికి రివర్స్ పంపింగ్ విధానాన్ని చెప్పినపుడు మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం, ఎల్లంపల్లి, మిడ్‌నేరు, మల్లన్నసాగర్ నుంచి నిజాంసాగర్ నుంచి చేస్తామని చెప్పారన్నారు. అయితే ఇప్పుడు ఎల్లంపల్లి నుంచి వరదకాలువకు నీరు పంపిస్తున్నట్టు మార్పు చేశారన్నారు. పోచంపాడు సభకు జనానికి మనిషికి రూ. 500 కూలీ ఇచ్చి, బీర్లు, బిర్యానీ, బస్సులను మొత్తం అక్కడికే కేటాయించి, పాఠశాలలకు సెలవులు ఇచ్చి జనాన్ని తరలించినా సభ ఫెయిల్ అయిందన్నారు. సభకు రాకపోతే మహిళా సంఘాలను జరిమానా వేస్తామని బెదిరించారని ఇంత ఘోరంగా పాలన సాగుతుందన్నారు. అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

17న జాతీయ ద్వితీయ నులి పురుగుల నివారణ దినోత్సవం

మన తెలంగాణ/హైదరాబాద్ : బాలల్లో 1 నుంచి 19 ఏళ్ల మధ్య వయస్కుల్లో పొత్తి కడుపులో నులి పురుగుల నివారణ ద్వారా ప్రజారోగ్యం సాధించేందుకు అవసరమైన పోరు సాగించాలని కేంద్రం నిర్ణయించింది. ఈ సందర్భంగా ఈ నెల 17న జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం అమలు చేయాలని నిర్ణయించింది. 2015లో తొలిసారి జాతీయ స్థాయిలో నులి పురుగుల నివారణ దినోత్సవం ఆ ఏడాది ఫిబ్రవరి 10వ తేదీన పాటించారు. 2016 నుంచి ఆగస్టులో నులి పురుగుల నివారణ దినోత్సవం పాటించాలని రాష్ట్ర ప్రభుత్వాలు తీర్మానించాయి. అంతర్జాతీయంగా పోలిస్తే భారతదేశంలోనే అత్యధికంగా చిన్నారులు పొత్తి కడుపులో నులి పురుగుల సమస్యతో బాధపడుతున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) తెలిపింది. డబ్ల్యూహెచ్ఓ అంచనా ప్రకారం 2014 నాటికి 1 నుంచి 14 ఏళ్ల లోపు బాలల్లో 22 కోట్ల మందికి పైగా చిన్నారులు నులి పురుగుల సమస్యల్లో చిక్కుకున్నారు. నులి పురుగుల వల్ల చిన్నారుల వృద్ధి, ప్రగతిపై ప్రతికూల ప్రభావం చూపుతున్నది.

కెసిఆర్ ఏమైనా ఇంజినీరా?

మన తెలంగాణ/ హైదరాబాద్ : ప్రాజెక్టులు డిజైన్ చేయడానికి సిఎం కెసిఆర్ ఏమైనా ఇంజనీరా? ఆయన చేసిన డిజైన్‌లతో కట్టే ప్రాజెక్టులు నిలబడతాయా? అని టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లు భట్టి విక్రమార్క ప్రశ్నించారు. సిఎల్‌పి కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్ఆర్ఎస్‌పి పునరుజ్జీవ పథకానికి సిఎం కెసిఆరే ఇంజనీర్‌లాగా రూపొందించారని టిఆర్ఎస్ నేతలు చేసిన వ్యాఖ్యలను తప్పుబట్టారు. చిన్న ఇళ్లుకే మనం ఇంజనీర్, ఆర్కిటెక్ట్ వద్దకు వెళ్తామని, రూ. కోట్లతో చేపట్టే ప్రాజెక్టులకు ఇంజనీర్‌లు కాకుండా కెసిఆర్ డిజైన్ చేయడమేమిటన్నారు. సాంకేతిక పరిజ్ఞానం లేని కెసిఆర్ ఇష్టానుసారం పాత ప్రాజెక్టుల డిజైన్‌లు మారుస్తూ ఖజానాను దుబారా చేస్తున్నారని విమర్శించారు. ఎస్ఆర్ఎస్‌పి ప్రాజెక్టు పునరుజ్జీవ పథకమేమిటని, ఆ ప్రాజెక్టేమైనా చచ్చిపోయిందా? అని ప్రశ్నించారు. తానే కొత్తగా ప్రాజెక్టులను కడుతున్నట్లు పాత ప్రాజెక్టుల వద్ద కొత్త శిలాఫలాకాలు వేసుకుంటున్నారని, అందుకు కోట్లాది ప్రజాధనాన్ని సభలు, ప్రచారం కోసం దుబారా చేస్తున్నారని విమర్శించారు. అసలు ఎస్ఆర్ఎస్‌పి ప్రాజెక్టు, కాకతీయ కెనాల్, వరద కాలువ, ఇవన్నీ కట్టిందేమైనా కెసిఆరా? లేదా కాంగ్రెసా? అని నిలదీశారు.

ప్రాజెక్టులను అడ్డుకుంటుంది కెసిఆరే : గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టులను మూడేళ్ళుగా అడ్డుకుంటూ సిఎం కెసిఆర్ తెలంగాణకు తీవ్ర నష్టం చేస్తున్నారని భట్టి మండిపడ్డారు. తమ హయాంలో ప్రారంభించిన అంబేడ్కర్ ప్రాణహిత–చేవెళ్ళ ప్రాజెక్టు పనులను అడ్డుకొని, రీడిజైన్ పేరుతో మార్చేశారని, అలాగే ఎస్ఆర్ఎస్‌పి కాకతీయ కాలువ రెండవ దశ, దేవాదుల ఆయకట్టు స్థిరీకరణకు ఉద్దేశించిన కంతానపల్లి ప్రాజెక్టును నిలిపేశారని అన్నారు. ఈ ప్రాజెక్టు పనులను కొనసాగించి ఉంటే ఈ పాటికి పూర్తయ్యేవని, పూర్తి కానందువల్ల జరుగుతున్న నష్టానికి ఎవరు బాధ్యులని ప్రశ్నించారు. ముందు పాత ప్రాజెక్టులన్నీ పూర్తి చేశాక, మిగులు జలాలు ఉంటే ఇంజనీర్లతో డిజైన్ చేయించి కొత్త ప్రాజెక్టులు చేపట్టాలని డిమాండ్ చేశారు.

గణేష్ నిమజ్జనం కోసం 35 వేల మంది పోలీసులు

మన తెలంగాణ / హైదరాబాద్ : జిహెచ్ఎంసి పరిధిలో గణేష్ చవితి పండుగ, గణేష్ నిమజ్జంలు శాంతియుతంగా నిర్వహించడానికి తమ శాఖ పరంగా 35 వేల మంది పోలీసులను ఈ విధుల్లో ఉంచుతున్నట్లు రాష్ట్ర హోం శాఖ మంత్రి నాయిని నర్సింహారెడ్డి తెలిపారు. సచివాలయంలో గణేష్ చవితి పండుగ, గణేష్ నిమజ్జనం ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులు, గణేష్ ఉత్సవ కమిటి సభ్యులతో నిర్వహించిన సమావేశం అనంతరం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా హోం మంత్రి మాట్లాడుతూ గత సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా గణేష్ చవితి, నిమజ్జనాన్ని శాంతియుతంగా జరుపుకోవడానికి హోంశాఖ పరంగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఖైరతాబాద్ భారీ వినాయక నిమజ్జనంను కూడా మరుసటి రోజుదాకా కాకుండా నిమజ్జనం రోజునే నిర్వహించేలా భాగ్యనగర ఉత్సవ కమిటి సభ్యులు తమకు తగు విధంగా సహకారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ట్యాంక్‌బండ్‌పై నిమజ్జనం కోసం భారీ క్రేన్లు, విద్యుత్ వెలుగుల కోసం ట్రాన్స్‌ఫార్మర్లు, వైద్య సేవలను అందుబాటులో ఉంచుతామన్నారు. ఈ సమావేశంలో ఎంఎల్ఏ రాజా సింగ్, స్టీఫెన్ సన్, జిఏడి ముఖ్య కార్యదర్శి అదర్ సిన్హా, హోంశాఖ ముఖ్యకార్యదర్శి రాజీవ్ త్రివేది, దేవాదాయ శాఖ కార్యదర్శి శివ శంకర్, ఫైర్ సర్వీసెస్ డిజి రాజీవ్ రతన్, హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనర్ మహేందర్ రెడ్డి, సందీప్ శాండిల్య, మహేష్ భగవత్, అడిషినల్ డిజి అంజనీ కుమార్, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

రుసుము ముందుగా చెల్లించాలి

మన తెలంగాణ/హైదరాబాద్: గణేష్ చవితి ఉత్సవాలలో ఏర్పాటయ్యే మండపాలలో తాత్కాలిక విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడానికి ముందుగా రుసుము చెల్లించాలని దక్షిణమధ్య విద్యుత్ పంపిణీ సంస్థ ఒక ప్రకటనలో కోరింది. 250 వాట్ల వినియోగానికి రూ.500, 500 వాట్ల వరకు రూ.1000 చెల్లించాలని సిఎండి రఘుమారెడ్డి తెలిపారు. 500 వాట్ల పైబడి రూ.1500 చెల్లించాలని, ఇంతకు మించి వినియోగించే ప్రతి 500 వాట్లకు అదనంగా రూ.750 చెల్లించాలని తెలిపారు. దరఖాస్తుదారులు కోరితే అమలులో ఉన్న నిబంధనల మేరకు తాత్కాలిక విద్యుత్ కనెక్షన్‌తో పాటు మీటర్ కూడా ఇస్తామన్నారు. తీగలకు కొండీలు తగిలిస్తే ప్రమాదాలు సంభవిస్తాయని, తమ సిబ్బంది కఠిన చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు.

పాదయాత్రకు సిద్ధమవుతున్న భట్టి

మన తెలంగాణ/ హైదరాబాద్ : రాష్ట్ర వ్యాప్తంగా పాదయాత్ర చేసేందుకు టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లు భట్టి విక్రమార్క సిద్ధమవుతున్నారు. రైతులు, దళితులు, బలహీనవర్గాలు, విద్యార్థులపై ప్రభుత్వ ఆకృత్యాలను వ్యతిరేకిస్తూ "తెలంగాణ ప్రజల ఆత్మగౌరవ యాత్ర"ను ప్రారంభించాలని భావిస్తున్నారు. దీనిపై ఇప్పటికే సన్నిహితులతో సమాలోచనలు జరుపుతున్నారు. కాంగ్రెస్ ముఖ్య నాయకులకు కూడా తన ప్రతిపాదనను సూచన ప్రాయంగా తెలియజేసినట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం పాదయాత్రను మిర్చి రైతులకు సంకెళ్ళు వేసిన ఖమ్మం నుండి ఆదిలాబాద్ వరకు నిర్వహిం చాలని అనుకుంటున్నారు. ఆదిలాబాద్ జిల్లాలో గతంలో ప్రారంభించిన అంబేద్కర్ ప్రాణహిత చేవెళ్ళ ప్రాజెక్టు స్థలం వద్ద ముగించాలని, తద్వారా రాజ్యాంగ నిర్మాత పేరుతో మొదలుపెట్టిన ప్రాజెక్టును రీడిజైన్ పేరుతో ఆపేయడాన్ని ఎత్తిచూపాలని భావిస్తున్నారు. యాత్రలో భాగంగా రైతుల ఆత్మహత్యలు, గిట్టుబాటు ధర అడిగిన మిర్చి రైతుల అరెస్టులు, నేరెళ్ళలో దళితులు, బిసిలపై పోలీసుల దాడి, విద్యార్థులపై నిర్బంధం, తదితర అంశాలను ప్రస్తావించాలనుకుంటున్నారు. కాంగ్రెస్ పార్టీ అనుమతితోనే పాదయాత్ర చేస్తానని భట్టి విక్రమార్క తన సన్నిహితులకు స్పష్టం చేశారు. అదే సమయంలో తానేదో పదవుల కోసం పాదయాత్ర చేయడం లేదని, పార్టీ బలోపేతానికే చేస్తున్నానని పార్టీ నేతలను ఒప్పించేందుకు సిద్ధమవుతున్నారు. స్వయంగా ఎఐసిసి ఉపాధ్యక్షులు రాహుల్‌గాంధే నాయకులు ప్రజల్లోకి వెళ్ళాలని పిలుపునిచ్చారని, కాబట్టి తాను పాదయాత్ర చేస్తే ప్రజల్లోకి వెళ్ళినట్లవుతుందని భావిస్తున్నారు. భట్టి పాదయాత్ర పార్టీ బలోపేతానికే ఉపయోగపడుతుందని, ఒక వేళ పదవుల కోసమే ఈ యాత్ర అని పార్టీ నాయకులు ఎవరైనా భావిస్తే, వారిని ఒప్పించేందుకు తన పదవిని కూడా వదులుకునేందుకు సిద్ధంగా ఉన్నారని సన్నిహితులు చెబుతున్నారు.

అవసరాన్ని బట్టి పాదయాత్ర: భట్టి


అవసరాన్ని బట్టి కాంగ్రెస్ నాయకత్వం అంగీకారంతో పాదయాత్ర చేస్తానని భట్టి విక్రమార్క అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో నూటికి నూరు శాతం ఆ అవసరం ఉందన్నారు. సిఎల్‌పి కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడి యా సమావేశంలో పాదయాత్ర గురించి అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధాన మిచ్చారు. రాష్ట్రంలో ఎవ్వరికీ ఆత్మగౌరవం లేకుండా బతికే పరిస్థి తులను టిఆర్ఎస్ ప్రభుత్వం కల్పిస్తోందని, అందుకు సిరిసిల్లలో దౌర్జన్యం, ఖమ్మంలో రైతులకు సంకెళ్ళు, ఉస్మానియా యూనివర్సిటీలో విద్యార్థులపై నిర్బంధం వంటి ఘటనలే నిదర్శనమన్నారు. ప్రజలు కోరుకున్న, సోనియా గాంధీ ఆశించి ఇచ్చిన తెలంగాణ ఇది కాదని, అందుకే ప్రజాస్వామ్యవాదులు, అన్ని వర్గా ల ప్రజఆత్మగౌరవం కోసం కలిసి పనిచేయాల్సిన పరిస్థితులు వచ్చాయన్నారు.

ప్రాణహితపై కెసిఆర్ మాట ఏమైంది?

మన తెలంగాణ/హైదరాబాద్ : ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టుకు జాతీయ హోదా తీసుకోస్తామని సిఎం కె. చంద్రశేఖర్‌రావు చేసిన ప్రకటన ఎటు పోయిందని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు ఎల్. రమణ ప్రశ్నించారు. టిఆర్ఎస్ మూడేళ్ళ పాలనలో ఎన్ని ప్రాజెక్టులు పూర్తి చేసి ఎన్ని ఎకరాలకు సాగునీరు ఇచ్చారో, ఎన్నింటికి శంకుస్థాపనలు చేసారో, మొత్తం ఎన్ని కోట్లు ఖర్చు పెట్టిన దానిపై శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎన్‌టిఆర్ ట్రస్టు భవన్‌లో శుక్రవారం టిడిపి నేతలు మోత్కుపల్లి నర్సింహులు, బండ్రు శోభారాణిలతో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్ ప్రాజెక్టులపై దృష్టి పెట్టకుండా పునర్జీవం పేరిట ఎస్ఆర్ఎస్‌పి ప్రాజెక్టుకు రూ. 2 వేల కోట్లు ఖర్చు పెట్టడం పాత గోడలకు కొత్త రంగు వేసినట్లుగా కెసిఆర్ వ్యవహారశైలి ఉందన్నారు. నంద్యాల ఉప ఎన్నికల ప్రచారంలో టిడిపి అధినేత చంద్రబాబును తీవ్ర పదజాలంలో విమర్శిస్తున్న జగన్‌కు రాజకీయాలలో ఉండే హక్కు లేదన్నారు. మోత్కుపల్లి నర్సింహులు మాట్లాడుతూ నేరెళ్ల ఘటనలో సస్పెండ్ చేయాల్సింది ఎస్ఐని కాదన్నారు. ఎస్‌పి, డిఎస్‌పి, సిఐలను సస్పెండ్ చేసి వారిపై ఎస్‌సి,ఎస్‌టి అట్రాసిటి కేసులు నమోదు చేయాలనిడిమాండ్ చేశారు. అలాగే నేరెళ్ల ఘటన జరిగి ఇన్ని రోజులవుతున్నా సిఎం బాధితులను ఎందుకు పరామర్శించడం లేదన్నారు. కనీసం వారిని ఆదుకునే ప్రయత్నం కూడా చేయలేదన్నారు.

17 నుంచి చిన్నారులకు మీజిల్స్, రుబెల్లా టీకాలు

అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, అంగన్‌వాడీలలో టీకాలు వేసేందుకు ఏర్పాట్లు



మనతెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్రంలో ఈ నెల 17 నుంచి నాలుగు వారాల పాటు తట్టు (మీజిల్స్), రుబెల్లా టీకాలు వేయించాలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి డా. సి.లక్ష్మారెడ్డి విజ్ఞప్తి చేశారు. 9 నెలల నుంచి 15 ఏళ్ల వయసు గల పిల్లలకు తల్లిదండ్రులు తప్పనిసరిగా వేయించాలని ఈ టీకాలు సూచించారు. శుక్రవారం తాజ్ బంజారాహోటల్‌లో మీజిల్స్, రుబెల్లా ప్రచారంపై నిర్వహించిన మీడియా ఓరియెంటేషన్ కార్యక్రమంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. 2020 నాటికి దేశం, రాష్ట్రం నుంచి ప్రాణాంతకమైన మీజిల్స్, రుబెల్లా వ్యాధిని నివారించడమే లక్ష్యంగా ఈ టీకాలు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. గతంలో రెగ్యులర్ టీకాలు వేయించుకున్నప్పటికీ అదనపు డోసుగా ఈ టీకాలు వేయించుకోవాలని తెలిపారు. టీకాల కార్యక్రమం విజయవంతం చేసేందుకు విద్యాశాఖ, మ హిళా, శిశు సంక్షేమ శాఖతోపాటు మిగతా శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేశామన్నారు. ప్రైవేట్‌లో 1985 నుంచే ఈ టీకాలు అందుబాటులో ఉన్నాయ ని, ప్రస్తుతం ప్రభుత్వం ఉచితంగా వేసే టీకాలలో మీజిల్స్, రుబెల్లా టీకాలు రావడం శుభపరిణామమని అన్నారు. రాష్ట్రంలో 9 నెలల నుంచి 15 ఏళ్ల వయసున్న పిల్లలు 90 లక్షల మంది ఉన్నట్లు గుర్తించామని చెప్పారు. ఈ నెల 17 నుంచి సెప్టెంబర్ 25 వరకు అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలతోపా టు అం గన్‌వాడీలలో ఈ టీకాలు వేస్తారని పేర్కొన్నారు. బడి బయట ఉన్న పిల్లలకు కూడా టీకాలు వేయడానికి చర్యలు తీపట్టామని అన్నారు. తెలంగాణ రా ష్ట్రం ఏర్పడే నాటికి కేవలం 68 శాతం టీకాలు వేయించేవారని, ప్రస్తుతం 90 శాతానికి చేరిందన్నారు. ఈ విషయంలో ప్రధాని సైతం అభినందించారన్నారు. కాగా మీజిల్స్, రుబెల్లా వ్యాక్సినేషన్ క్యాంపెయిన్ పోస్టర్‌ను మంత్రి లక్ష్మారెడ్డి ఆవిష్కరించారు.

ప్రత్యేక హోదాపై మోడీతో ముఫ్తీ భేటీ!



న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్‌లో పిడిపి-బిజెపి ప్రభుత్వ కూటమి ఏర్పాటుకు రాజ్యాంగంలోని 370 అర్టికల్‌ను యథాతథంగా ఉంచాలనేదానిపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వందశాతం హామీ ఇచ్చారని ఆ రా ష్ట్ర ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ చెప్పారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇచ్చే అంశంపై తీవ్ర చర్చ జరుగుతున్న నేపథ్యంలో శుక్రవారం పార్లమెంటులో ప్రధానితో మెహబూబా సమావేశమయ్యారు. మోడీతో భేటీ ముగిసిన అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. ప్రత్యేక హోదా విషయంలో రాజ్యాంగ నిబంధనలను మార్చాలనే ప్రయత్నాలకు వ్యతిరేకంగా సహాయం చేయాలని ప్రధానిని కోరినట్టు చెప్పారు. పిడిపి- బిజెపి కూటమి ఏర్పాటు ఎజెండాకు వ్యతిరేకంగా ఎవరూ కూడా పనిచేయకూడదని చెప్పినట్టు ముఫ్తీ తెలిపారు. ఈ విషయంలో మోడీ సానుకూలంగా స్పందించారన్నారు. కూటమి ఏర్పాటు ఎజెండాకు వందశాతం హామీ ఇచ్చారని ముఫ్తీ పేర్కొన్నారు. జమ్ముకశ్మీర్‌లో నెలకొన్న జటిల పరిస్థితి క్రమక్రమంగా మెరు గుపడుతోందని ఆమె అన్నారు. కశ్మీర్ ప్రజలంతా తమ ఐక్యతకు ప్రమాదం పొంచి ఉందని భావనలో ఉన్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో అలాంటి ముప్పేమి లేదనే సందేశం ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందని ముఫ్తీ స్పష్టం చేశారు.

టీచర్ పోస్టుల భర్తీకి ఏర్పాట్లు

❑ 17న తుది నిర్ణయం



మన తెలంగాణ/హైదరాబాద్ : ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తోంది. టీచర్ పోస్టులకు సంబంధించిన అర్హతలు, విధివిధానాలు రూపొందించి వారం రోజుల్లో టిఎస్‌పిఎస్‌పికి అందజేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ పోస్టుల భర్తీ పాత జిల్లాల ప్రకారమా.? లేక కొత్త జిల్లాల ప్రకారమా..? అనే అంశంపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. శుక్రవారం ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి విద్యాశాఖ ఉన్నతాధికారులతో టీచర్ పోస్టుల భర్తీపై సమీక్షించారు. నోటిఫికేషన్ జారీ చేసిన తర్వాత న్యాయ వివాదాలు తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని చర్చించినట్లు సమాచారం. ప్రధానంగా జిల్లాల విషయంపై న్యాయశాఖ సలహా తీసుకోవాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఎన్‌సిటిఇ నిబంధనల ప్రకారమే అర్హతలు పొందుపరచాలని, ఈ విషయంలో ఎలాంటి వివాదాలకు తావు లేకుండా పక్కాగా నియమ నిబంధనలు రూపొందించాలని మంత్రి అధికారులను ఆదేశించినట్లు సమాచారం. ఈ నెల 17న మరోసారి సమావేశం నిర్వహించి టీచర్ పోస్టుల భర్తీకి సంబంధించిన విధి విధానాలు ఖరారు చేయనున్నట్లు తెలిసింది.

నెలాఖరులో నోటిఫికేషన్..?

రాష్ట్రంలో 8,792 టీచర్ పోస్టుల భర్తీకి ఈ నెలాఖరులో నోటిఫికేషన్ వెలువడే అవకాశాలు కనిపిస్తున్నాయి. సెప్టెంబర్ 11వ తేదీలోగా ఈ పోస్టులు భర్తీ చేస్తామని విద్యాశాఖ సుప్రీంకోర్టుకు తెలిపిన నేపథ్యంలో సాధ్యమైనంత త్వరగానే నోటిఫికేషన్ జారీ అయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిసింది. ప్రధానంగా టీచర్ పోస్టుల నియామకాలు కొత్త జిల్లాల ప్రాతిపదికన చేపట్టాలా..? లేక పాత జిల్లాల ప్రకారం చేపట్టాలా అనే విషయంపై స్పష్టత వస్తే వెంటనే టిఎస్‌పిఎస్‌సికి ఇండెంట్ పంపించనున్నారు. ఏ జిల్లాల ప్రాతిపదికన ఉపాధ్యాయ నియామకాలు చేపట్టాలనే విషయంపై న్యాయ నిపుణులు, ఇతర విభాగాలతో సంప్రదింపులు జరిపి తుది నిర్ణయం తీసుకోనున్నారు. అయితే ఈ నెలాఖరులో నోటిఫికేషన్ జారీ చేసినా సెప్టెంబర్ 11లోగా నియామకాల ప్రక్రియ పూర్తయ్యే అవకాశం మాత్రం లేదు. నోటిఫికేషన్ వెలువడిన తర్వాత పరీక్షల నిర్వహణకు కనీసం 40 రోజులు తగ్గకుండా గడువు ఉండాలి. ఉపాధ్యాయ నియామకాల ఈ ప్రక్రియ మొత్తం పూర్తి కావడం కావడానికి కనీసం మూడు నెలలు పట్టే అవకాశం ఉంటుంది.

ఏప్రిల్ 12 నుంచి వేసవి సెలవులు

మన తెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్రంలోని పాఠశాలలకు ఈ విద్యాసంవత్సరంలో ఏప్రిల్ 12 నుంచి వేసవి సెలవులు ప్రకటించి, జూన్ 1వ తేదీ నుంచి పాఠశాలలు పునఃప్రారంభించాలని విద్యాశాఖ నిర్ణయించింది. ఈ మేరకు విద్యాశాఖ రూపొందించిన ప్రతిపాదనలను ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి ఆమోదించారు. 2016–17 విద్యాసంవత్సరంలో మార్చి 21 నుంచి ప్రారంభించిన కొత్త విద్యాసంవత్సరంపై విద్యార్థులు, ఉపాధ్యాయుల నుంచి వ్యతిరేకత వచ్చిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. జూన్ 1న పాఠశాలలు తెరిస్తే, జూన్ 2న రాష్ట్రంలోని పాఠశాలల్లో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం నిర్వహించుకుని, 3వ తేదీ నుంచి బడిబాట చేపట్టవచ్చని విద్యాశాఖ ఈ తేదీలను ఖరారు చేసింది. ఈ తేదీలతో కూడిన విద్యా క్యాలెండర్‌కు ప్రధాన ఉపాధ్యాయ సంఘాలు అంగీకరించినట్లు మంత్రి కడియం శ్రీహరి తెలిపారు.

డిఇఇసెట్‌లో సీట్ల కేటాయింపు

మన తెలంగాణ/హైదరాబాద్ : డిఇఇసెట్‌లో 7,119 మంది అభ్యర్థులకు సీట్లు కేటాయించినట్లు కన్వీనర్ శేషుకుమారి తెలిపారు. సీట్లు కేటాయించిన అభ్యర్థుల వివరాలు tsdeecet.cgg.gov.in వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ విద్యాసంవత్సరం 7,760 సీట్లు అందుబాటులో ఉన్నాయని అన్నారు. ధృవపత్రాల పరిశీలన అనంతరం 17,285 మంది వెబ్ ఆప్షన్లకు అర్హత పొందగా, వారిలో 15,834 మంది ఆప్షన్లు ఇచ్చినట్లు తెలిపారు. ప్రభుత్వ డైట్‌లలో సీట్లు పొందిన ఫీజు మినహాయింపు లేని అభ్యర్థులు రూ.2,385, ప్రైవేట్ కళాశాలల్లో సీట్లు పొందిన అభ్యర్థులు రూ.12,500 ఆన్‌లైన్‌లో గేట్‌వే ద్వారా చెల్లించవచ్చని అన్నారు. ప్రైవేట్ కళాశాలల్లో సీటు పొంది, ఫీజు మినహాయింపుకు అర్హత గల అభ్యర్థులు రూ.1,500 చెల్లించి ఫైనల్ అలాట్‌మెంట్ ఆర్డర్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు. ఈ విద్యాసంవత్సరం ఈ నెల 18 నుంచి డి.ఇ.ఇడి ప్రథమ సంవత్సరం తరగతులు ప్రారంభమవుతాయని అన్నారు.

పిసిబి పోస్టులకు ధ్రువపత్రాల పరిశీలన

మన తెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి(పిసిబి)లో స్టెనో కమ్ టైపిస్ట్, జూనియర్ అసిస్టెంట్ కమ్ టైపిస్ట్, జూనియర్ కమ్ టైపిస్ట్ పోస్టులకు ధృవపత్రాల పరిశీలనకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను టిఎస్‌పిఎస్‌సి వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు కమిషన్ కార్యదర్శి ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులకు ఈ నెల 23న నాంపల్లిలోని ప్రగతి భవన్‌లో ఉదయం 10 గంటల నుంచి ధృవపత్రాల పరిశీలన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఐసెట్ తుది విడత సీట్ల కేటాయింపు

మన తెలంగాణ/హైదరాబాద్ : ఐసెట్ తుది విడత సీట్ల కేటాయింపు పూర్తయింది. ఎంబిఎ కోర్సులో 395 కళాశాలల్లో 22,499 సీట్లు అందుబాటులో ఉండగా, 22,383 సీట్లు కేటాయించినట్లు ప్రవేశాల కన్వీనర్ ఎ.వాణిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. అందులో 22 ప్రభుత్వ కళాశాలల్లో 100 శాతం సీట్లు భర్తీ కాగా, ప్రైవేట్ కళాశాలలో 116 సీట్లు ఖాళీగా మిగిలినట్లు పేర్కొన్నారు. అలాగే ఎంసిఎలో 41 కళాశాలల్లో 2,077 సీట్లు అందుబాటులో ఉండగా, 2,020 సీట్లకు కేటాయింపులు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ కళాశాలల్లో 4 సీట్లు, ప్రైవేట్‌లో 57 సీట్లు మిగిలినట్లు పేర్కొన్నారు. సీటు పొందిన అభ్యర్థులు ఈ నెల 19వ తేదీలోగా ఫీజు చెల్లించాలని అన్నారు. ఈ నెల 21లోగా కళాశాలల్లో రిపోర్టింగ్ చేయాలని తెలిపారు.

నవంబరు 8 నుంచి బాలల చలనచిత్రోత్సవం

మన తెలంగాణ/హైదరాబాద్: నవంబరు 8 నుంచి 14 వరకు హైదరాబాద్‌లో 20వ అంతర్జాతీయ బాలల చలనచిత్రోత్సవం జరగనుంది. వారం రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల ఆరంభ, ముగింపు వేడుకలను శిల్పకళావేదికలో ఘనంగా నిర్వహించనున్నారు. చిల్డ్రన్స్ ఫిలిం సొసైటీ, ఫిలిం డెవలప్‌మెంట్ కార్పోరేషన్ అధికారులతో సమాచార, పౌరసంబంధాల శాఖ కమిషనర్ నవీన్ మిత్తల్ శుక్రవారం నాడు చిత్రోత్సవాల సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. నగరంలో 12 థియేటర్లను బాలల చిత్రోత్సవాలకు రిజర్వ్ చేయాలని, థియేటర్లను ఎఫ్‌డిసి, ఫిలిం సొసైటీ అధికారులు కలిసి సంయుక్తంగా తనిఖీ చేయాలని మిత్తల్ సూచించారు. అన్ని జిల్లాల్లో చిత్రోత్సవాలు జరపాలని, చిత్ర నిర్మాణంపై వర్క్‌షాప్‌ను జవహర్ బాలభవన్‌లో ఏర్పాటు చేయాలని, ప్రత్యేకంగా మీడియా సెంటర్ ఏర్పాటు చేయాలని కమిషనర్ ఆదేశించారు. విదేశీ అతిథులు, బాలలకు వసతిపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని అన్నారు.ఈ సమావేశంలో టిఎస్ ఎఫ్‌డిసి జెఎండి కిషోర్‌బాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఓపెన్ యాక్సెస్ విద్యుత్‌పై క్రాస్ సబ్సిడీ సర్‌చార్జి

మన తెలంగాణ/హైదరాబాద్: నేషనల్ టారిఫ్ పాలసీ ప్రాతిపదికగా ఓపెన్ యాక్సెస్ విద్యుత్ వినియోగదారుల నుంచి క్రాస్ సబ్సిడీ సర్‌చార్జి వసూలు చేయాలని డిస్కంలు విద్యుత్ నియంత్రణ మండలి (టిఎస్ ఇఆర్‌సి)ని కోరాయి. ఈ మేరకు టిఎస్ ఎస్‌పిడిసిఎల్, టిఎస్ ఎన్‌పిడిసిఎల్‌లు ఇఆర్‌సికి తమ ప్రతిపాదనలు అందజేశారు. క్రాస్ సబ్సిడీ వసూలు ప్రతిపాదనలపై వినియోగదారులు తమ అభ్యంతరాలను సెప్టెంబరు 4 లోపు ఇఆర్‌సికి సమర్పించాలని కమిషన్ ప్రకటించింది. గతంలో 2005 నుంచి 2015 వరకు ఎంబెడెడ్ కాస్ట్ మెథడ్ ప్రకారం ఓపెన్ యాక్సెస్ విద్యుత్ వినియోగదారుల నుంచి క్రాస్ సబ్సిడీ సర్‌చార్జి వసూలు చేసేవారు. దీని ప్రకారం యూనిట్‌కు 30 పైసల నుంచి 190 పైసల వరకు డిస్కంలు ఓపెన్ యాక్సెస్ వినియోగదారుల నుంచి అదనంగా వసూలు చేసేవారు. దీనిపై విద్యుత్ వినియోగదారులు కోర్టుకు వెళ్లగా, నేషనల్ టారిఫ్ పాలసీ ప్రాతిపదికగా క్రాస్ సబ్సిడీ వసూలు చేయాలని ఆదేశించింది. న్యాయస్థానం ఆదేశాలను అమలు చేయాలని నిర్ణయించిన నేపథ్యంలో అభ్యంతరాలు, సలహాలు, సూచనలు ఇవ్వాలని కమిషన్, డిస్కంలు వినియోగదారులను కోరుతున్నాయి.

వరంగల్ టెక్స్‌టైల్ పార్కుకు 16న సిఎం శంకుస్థాపన

మన తెలంగాణ / హైదరాబాద్ : వరంగల్ జిల్లాలో ఏర్పాటు చేయతలపెట్టిన మెగా టెక్స్‌టైల్ పార్కుకు ముఖ్యమంత్రి కెసిఆర్ ఈ నెల 16న శంకుస్థాపన చేయనున్నారు. వరంగల్ రూరల్ మండలం గీసుకొండ, సంగెం మండలాల మధ్యలో ఈ పార్కును ఏర్పాటు చేయనున్న విషయం తెలిసిందే. 1190 ఎకరాల్లో రూ.1150 కోట్లతో నిర్మితమవుతున్న ఈ పార్కులో 11,500 కోట్ల పెట్టుబడులు వస్తాయని ప్రభుత్వం అంచనా వేస్తోంది. పెట్టుబడులతో పాటు ఈ పార్కు ద్వారా 1,13,000 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభించనుందని ప్రభుత్వం పేర్కొంటోంది. తెలంగాణ నుండి బతుకు దెరువు కోసం వలసలు వెళ్లిన చేనేత కార్మికులను తిరిగి స్వరాష్ట్రానికి వచ్చే అవకాశం ఈ మెగా టెక్స్‌టైల్ పార్కు ద్వారా కల్గనుందని భావిస్తోంది. ఇక్కడే పని దొరికితే స్థానికంగా ఉండే అవకాశాలు లభించనున్నాయని పేర్కొంటోంది. 2014 ఎన్నికల సందర్భంగా సిఎం కెసిఆర్ ఇచ్చిన హామీ కూడా నెరవేరినట్లు కానుందని భావిస్తున్నారు. పార్కులో పెట్టుబడులు పెట్టే ఔత్సాహికులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించనున్నారు.

టిఎస్‌పిఎస్‌సి చైర్మన్, సభ్యుల వేతనాలు భారీగా పెంపు

మన తెలంగాణ/హైదరాబాద్ : తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టిఎస్‌పిఎస్‌సి) చైర్మన్, సభ్యుల వేతనాలను భారీగా పెంచుతూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. పెరిగిన వేతనాలు 2016, జనవరి 1వ తేదీ నుంచి అమలులోకి వస్తాయని ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు. టిఎస్‌పిఎస్‌సి చైర్మన్ ప్రస్తుతం వేతనం రూ.80వేలు ఉండగా దానిని రూ.2.25 లక్షలకు పెంచారు. సభ్యుల వేతనం రూ.79వేల నుంచి 2.24 లక్షలకు పెంచారు. ఏడవ కేంద్ర వేతన సంఘం సిఫారసులకు అనుగుణంగా వేతనాలు పెంచినట్లు ప్రభుత్వం ప్రకటించింది.

నేరెళ్ల ఘటనలో ఎస్‌పి విశ్వజిత్‌పై చర్యలు

● డిజిపిని కలిసిన అఖిలపక్ష నేతల డిమాండ్



మన తెలంగాణ/సిటీబ్యూరో: నేరెళ్ల ఘటనకు బాధ్యులైన జిల్లా ఎస్‌పి విశ్వజిత్‌తో సహా పోలీసు అధికారులందరిపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటి కేసులు నమోదు చేయడంతో పాటు శాఖపరమైన చర్యలు తీసుకోవాలని అఖిలపక్ష నాయకులు రాష్ట్ర డిజిపిని డిమాండ్ చేశారు. ఈ ఘటనలో కేవలం ఎస్‌ఐని బాధ్యులుగా చేసి ప్రభుత్వం చేతులు దులుపుకుకోవడం సమంజసం కాదన్నారు. నేరెళ్ల ఘటనలో బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ అఖిలపక్షం నేతలు డిజిపి అనురాగ్‌శర్మను శుక్రవారం కలిసి విజ్ఞాపన పత్రాన్ని సమర్పించారు. టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర మల్లు భట్టి విక్రమార్క, నాయకులు ఆరెపల్లి మోహన్, టిడిపి వర్కింగ్ ప్రెసిడెంట్ రేవంత్‌రెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి, నాయకులు ఈర్ల నరసింహ, ధర్నా చౌక్ పరిరక్షణ కమిటీ కోకన్వీనర్ ప్రొఫెసర్ పి.ఎల్.విశ్వేశ్వరరావు డిజిపిని కలిసిన ప్రతినిధి బృందంలో ఉన్నారు. ప్రభుత్వ ఏమి చెబితే పోలీసులు అదే చేస్తున్నారని, నిజమైన బాధితులకు న్యాయం చేయడంలో పోలీసులు విఫలమయ్యారని వారు అనంతరం మీడియాతో మాట్లాడుతూ విమర్శించారు. నేరెళ ఘటనపై బాధితులకు సరైన న్యాయం చేయకపోతే అఖిలపక్షం ఆధ్వర్యంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. మల్లు భట్టివిక్రమార్క మీడియాతో మాట్లాడుతూ పోలీసులే దాడులు చేసారని ప్రభుత్వమే ఒప్పుకున్నందున వారిపై చర్యలకు డిజిపి ఎందుకు వెనుకాడుతున్నారో అర్థం కావడంలేదన్నారు. చాడ వెంకట రెడ్డి మాట్లాడుతూ కెటిఆర్ నియోజక వర్గంలో దళితుల ప్రాణాలకు రక్షణ లేదని ఆరోపించారు. ఆయనకు ప్రజలను చూసే తీరిక లేదని విమర్శించారు. దారుణంగా బాధితులను కొట్టిన ఎస్‌పిని వెంటనే సస్పెండ్ చేస్తేనే బాధితులకు న్యాయం జరుగుతుందన్నారు. ఘటన జరిగి 40 రోజులు కావస్తున్నా పోలీసులు చర్యలపై కాలయాపన చేయడం తగదన్నారు. రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ రాజకీయ వత్తిళ్ల ఉంటే తలొగ్గకుండా చర్యలు తీసుకోవాలని డిజిపిని కోరామన్నారు. ఇసుక లారీ యాజమాన్యంపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ఆయన ప్రశ్నించారు. బాధితులు, అఖిలపక్షం నేతలు ఎస్‌పిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేసినా ఇటు ప్రభుత్వం, అటు డిజిపి స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. పోలీసులు కేవలం మంత్రి కెటిఆర్ సంతృప్తి కోసం పనిచేస్తున్నట్లు కనిపిస్తుందని, పోలీసులు ప్రజల కోసం పనిచేయాలని ఆయన అన్నారు.

నేరెళ్లపై డిజిపికి ఎన్‌హెచ్‌ఆర్‌సి నోటీసులు

మన తెలంగాణ/న్యూఢిల్లీ: తెలంగాణాలోని రాజన్న సిరిసిల్ల జిల్లా నేరెళ్ల ఘటనపై తెలంగాణ డిజిపికి జాతీయ మానవహక్కుల కమిషన్ నోటీసులు జారీ చేసింది. ఈ ఘటనలో షెడ్యూల్డ్ కులాలకు చెందిన వారిని మరియు వెనుకబడిన తరగతులకు చెందిన వారిని అక్రమంగా నిర్బంధించి చిత్రహింసలు పెట్టారని వచ్చిన ఫిర్యాదులు, మీడియా కథనాలపై స్పందించిన కమిషన్ శుక్రవారం తెలంగాణ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. బాధితుల విషయంలో తీవ్రమైన మానవ హక్కుల ఉల్లంఘన జరిగిందన్న భావనలో ఉన్నట్లు జాతీయ మానవ హక్కుల సంఘం జారీ చేసిన నోటీసులో పేర్కొన్నది. ఈ ఘటనపై తెలంగాణ డిజిపి పారదర్శకంగా స్వతంత్ర దర్యాప్తు జరిపి 4 వారాల్లోగా నివేదికను అదించాల్సిందిగా కమీషన్ ఆదేశించింది. గత కొద్ది రోజుల క్రితం ఇసుక రవాణాలో భాగంగా కాంట్రాక్టర్లకు చెందిన లారీలు అతివేగంగా ప్రయాణిస్తూ.... అనేక ప్రమాదాలకు కారణమవుతున్నాయని గ్రామస్థులు చేసిన ఫిర్యాదులపై పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకోలేదని కమిషన్ స్పష్టంచేసింది. గ్రామస్థుల భద్రత పట్టించుకోకుండా అడ్డగోలుగా వాహనాలను నడుపుతూ..... పరిమితికి మించిన ఇసుక బరువుతో, నిర్లక్ష్యపూరిత డ్రైవింగ్ చేస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నారనే ఆరోపణలను ఎన్‌హెచ్‌ఆర్‌సి పరిగణలోకి తీసుకున్నది. గత నెల జూలై2వ తేదీన ఇసుక కాంట్రాక్టర్ కు చెందిన లారీ ఒక గిరిజనుడిని ఢీకొట్టి ప్రాణాలు బలికొన్నది, ఈ ఘటనపై ఆగ్రహం చెందిన గ్రామస్థులు రెండు లారీలను తగులబెట్టారు, దాంతో పోలీసులు ఎనిమిది మంది గ్రామస్థులను అక్రమంగా నిర్బంధించి నాలుగు రోజులపాటు చిత్రహింసలకు గురిచేశారు, వీరంతా తీవ్రమైన నేరాలకు పాల్పడ్డారంటూ నాలుగు రోజుల తర్వాత జూలై 8వ తేదీన జుడీషియల్ మెజిస్ట్రేట్ ముందు హాజరు పరిచారు, చిత్రహింసలు పెట్టిన సంగతి బయట పెడితే వారి భార్యలపైన హేయమైన నేరాలు మోపుతామని బెదిరించారనే సమాచారం తమ దృష్టికి వచ్చిందని కమిషన్ పేర్కొంది.

డ్రగ్స్ కేసులో త్వరలో చార్జ్‌షీటు



మన తెలంగాణ/హైదరాబాద్ : డ్రగ్స్ కేసులో త్వరలోనే చార్జ్ షీటు దాఖలు చేస్తామని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ అకున్ సబర్వాల్ స్పష్టం చేశారు. ఫోరెన్సిక్ నివేదిక రావాల్సి ఉందని, దాని ఆధారంగానే చార్జ్‌షీట్ ఫైల్ చేస్తామన్నారు. వచ్చే నెలలో రెండో విడత విచారణ చేపడతామన్నారు. అయితే ఎవరిని విచారిస్తారనే విషయం స్పష్టం చేయలేదు. డ్రగ్స్ కేసులో కేవలం సినిమా వాళ్లనే ఫోకస్ చేశామనే దాంట్లో వాస్తవం లేదన్నారు. ఐటి, బిజినెస్ సంబంధిత వ్యక్తులను కూడా విచారిస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్ ఓయూ ఇంగ్లీష్ అండ్ ఫారెన్ లాంగ్వేజెస్ (ఇఫ్లూ) యూనివర్శిటీలో వైస్ ఛాన్సలర్ ఇ. సురేష్ కుమార్ అధ్యక్షతన శుక్రవారం జరిగిన డ్రగ్స్ రహిత దేశం, విద్యాసంస్థల పాత్ర అనే అంశంపై అకున్ మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు సూచనలు చేశారు. డ్రగ్స్ తీసుకోమని సన్నిహితులు బలవంతపెట్టినా మోహమాటం లేకుండా వద్దని చెప్పాలన్నారు. అలాగే ఎవరైనా డ్రగ్స్ తీసుకుంటున్నట్లు తెలిస్తే వెంటనే సమాచారమివ్వాలన్నారు. ఈ కేసులో ఒత్తిడి ఏమైనా ఉందా అని విద్యార్థులు అడిగిన ప్రశ్నకు బదులిస్తూ తమపై ఎలాంటి ఒత్తిడి లేదన్నారు. కేసు దర్యాప్తు సవ్యంగా సాగుతోందని తెలిపారు. డ్రగ్స్ వ్యాపారం, వినియోగిస్తూ అరెస్ట్ అయిన వారికి కేవలం 15 రోజుల్లోనే ఎలా బెయిల్ వచ్చిందని విద్యార్థులు అకున్‌ను ప్రశ్నించారు. చట్ట ప్రకారం వారు తప్పక రిహాబిలిటేషన్ సెంటర్ వెళ్లాల్సి ఉంటుందని అందులో భాగంగానే బెయిల్ వచ్చిందన్నారు.

టిఎస్‌ఆర్‌టిసి 'వజ్ర'కు 'నేషనల్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ ఎక్స్‌లెన్స్ అవార్డు'



మన తెలంగాణ / హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణ సంస్థ (టిఎస్‌ఆర్‌టిసి) దేశంలోనే తొలిసారిగా ప్రవేశపెట్టిన 'వజ్ర' మినీ బస్సు సర్వీసులకు 'నేషనల్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ ఎక్స్‌లెన్స్ అవార్డు2017' లభించింది. ఢిల్లీలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో కేంద్ర రోడ్డు రవాణ, రహదారుల మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి లీనా నందన్, సంయుక్త కార్యదర్శి (ట్రాన్స్‌పోర్ట్) అభయ్ డాంలే ఈ వార్డును టిఎస్‌ఆర్‌టిసి మేనేజింగ్ డైరెక్టర్ జి.వి.రమణరావుకు అందజేశారు. పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్‌పై ఎఎస్‌ఆర్‌టియూ నియమించిన నలుగురు సభ్యులతో కూడిన అవార్డు జ్యూరీ టిస్‌ఆర్‌టిసి ప్రవేశపెట్టిన 'ప్రయాణికుల ముంగిల్లోకి సర్వీస్'కు జాతీ య స్థాయి గుర్తింపునిచ్చింది. ఈ సందర్భంగా ఆర్‌టిసి ఎండి రమణరావు మాట్లాడుతూ వివిధ కాలనీల నుంచి ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లేందుకు ఆటోలు, రిక్షాలలో బస్ స్టేషన్లకు చేరుకునేందుకు పడుతున్న అవస్థలను గు ర్తించి నూతన వరవడిలో వజ్ర మినీ బస్సులను ప్రవేశపెట్టామని, ఈ సర్వీసులకు జాతీయస్థాయిలో గుర్తింపు రావడం ఆర్‌టిసి ప్రతిష్టను మరింత పెంచిందన్నారు.

బైపాస్ రోడ్లను కేంద్రం వ్యతిరేకిస్తోంది

❑ హైవే పనుల సమీక్షలో మంత్రి తుమ్మల



మన తెలంగాణ / హైదరాబాద్ : జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ విధాన పరంగా పట్టణాలకు బైపాస్ రోడ్లను వ్యతిరేకిస్తోందని ఆర్ అండ్ బి మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు తెలిపారు. శుక్రవారం ఆయన జాతీయ రహదారుల పనులకు సంబంధించి జూబ్లిహిల్స్‌లోని తన నివాసంలోనే అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఖమ్మం, వైరా, తల్లాడ, సత్తుపల్లి, కల్లూరు, గంగారం, పాలేరు, కూసుమంచి, జీళ్ల చెరువు వంటి చోట్ల బైపాస్‌ల ఏర్పాటుకు జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్‌ఎఐ) సుముఖత వ్యక్తం చేయడం లేదని ఈ కారణంగా వ్యయ పరిమితులకు లోబడి పాత రహదారులనే ఎక్కువగా వినియోగించుకునేలా చూడాలన్నారు. ఖమ్మం... సూర్యాపేట, ఖమ్మం...అశ్వారావు పేట మార్గాల ఎలైన్‌మెంట్లను రూపొందించి పనులు ప్రారంభించాలని కోరారు. ఈ రహదారాలతో పాటు గత సంవత్సరం కేంద్రం అనుమతించి జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థకు బదిలీ చేసిన 5 రాష్ట్ర రహదారుల పనుల తీరుతెన్నులను అధికారులు అడిగి తెలుసుకున్నారు. 15 రోజులలో భూసేకరణకు ల్యాండ్ ప్లాన్ షెడ్యూల్ సిద్ధం చేయాలని కోరారు. హైవే పనుల్లో డిపిఆర్‌ల రూపకల్పన పేరిట తీవ్ర జాప్యం జరుగుతున్నట్లు గమనించిన తుమ్మల ఆ జాప్యానికి గల కారణాలను తెలపాలని అధికారులను నిలదీశారు. ఈ ఐదు జాతీయ రహదారుల నిర్మాణంతో పాటు ఇతర రహదారులకు అవసరమైన భూసేకరణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పనులు సజావుగా సాగేందుకు రైల్వే, సింగరేణి, సాగునీటి శాఖలతో సమన్వయ సమావేశాలు ఏర్పాటు చేసి ఈ రహదారుల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు, సింగరేణి, రాష్ట్ర ఎన్‌హెచ్ విభాగం అధికారులు, కన్సల్టెంట్స్ సంస్థలు, వివిధ జిల్లా ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.




తెలంగాణ రాష్ట్ర శాసనసభ స్పీకర్ మధుసూదనాచారి కుమారుడు కార్తీక్, నవ్యల వివాహం గురువారం శంషాబాద్‌లోని కెఎల్‌సిసి కన్వెన్షన్‌లో ఘనంగా జరిగింది. ఈ వివాహానికి ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు, శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్, ప్రతిపక్షనేత కె.జానా రెడ్డి, పిసిసి అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పలు రాజకీయ పార్టీల ప్రముఖులు హాజరయ్యారు

పునరుజ్జీవం పేరుతో కెసిఆర్ మొసలి కన్నీరు



మన తెలంగాణ/హైదరాబాద్ : బాబ్లీ ప్రాజెక్టు విషయంలో 2010లో టిడిపి ఆందోళన చేస్తే కాకిగోల చేస్తున్నారని ఎగతాళి చేసారని, ఇప్పుడేమో శ్రీరాం సాగర్ ఎడారిగా మారిందని, పున రుజ్జీవం అంటూ సిఎం కె. చంద్రశేఖర్‌రావు మొసలి కన్నీరు కారుస్తున్నారని టిడిపి వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. బాబ్లీ పూర్తయితే ఎస్‌ఆర్‌ఎస్‌పి ఎడారిగా మారుతుందని దీనిని అడ్డుకునేందుకు వెళ్లి టిడిపి నేతలు మహారాష్ట్ర పోలీసులతో లాఠీదెబ్బలు తిన్నారన్నారు. టిఆర్‌ఎస్ ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన విధంగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టుల నిర్మాణానికి ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై మహారాష్ట్రతో చేసుకున్న ఒప్పందాన్ని రద్దు చేసుకొని, పాత డిజైన్ ప్రకారం ఎత్తు పెంచుకునేందుకు వీలుగా ఆ రాష్ట్రంలోని 1800 ఎకరాల భూ సేకరణ కోసం ప్రధానమంత్రి వద్దకు అఖిలపక్షాన్ని తీసుకువెళ్లాలన్నారు. ప్రాజెక్టుల రీడిజైన్ పేరుతో అంచనాల పెంపును నిలిపివేయాలన్నారు. ఈ మేరకు రేవంత్ సిఎం కెసిఆర్‌కు శుక్రవారం బహిరంగ లేఖ రాశారు. ఇందులో ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల మేరకు మూడేండ్లు గడిచినా సిఎం కెసిఆర్ ఒక్క ప్రాజెక్టు కూడా పూర్తి చేయలేదని రేవంత్ విమర్శించారు. అధికా రంలోకి వచ్చాక మాట మార్చి పెండింగ్ ప్రాజెక్టులను పక్కన పెట్టి కొత్త ప్రాజెక్టులను ప్రకటించారని, వాటిని కూడా పూర్తిస్థాయిలో చేపట్టకుండా రీడిజైన్‌ల పేరుతో సాగునీటి రంగాన్ని సంక్షోభంలోకి నెట్టారని మండిపడ్డారు. గతంలో అధికారులు సమర్పించిన నివేదికల ఆధారంగా రూ. 18 వేల కోట్లతో పూర్తయ్యే ప్రాజెక్టులకు తొలి ప్రాధాన్యత కింద నిధులు ఇచ్చి వాటిని పూర్తి చేయాలన్నారు. పాలమూరు జిల్లా ప్రాజెక్టుల పూర్తికి తక్షణం రూ. 1000 కోట్ల నిధులను కేటాయించాలని డిమాండ్ చేశారు. పక్షపాతం లేకుండా ప్రతి నియోజకవర్గంలో లక్ష ఎకరాల సాగునీటి పారుదలకు ప్రణాళికలు రూపొందించాలన్నారు.

"భవిష్యత్తులో ఏమి జరుగుతుందోనని ఎప్పుడూ లెక్కపెట్టేవాడు దేన్నీ సాధించలేడు, సత్యమని, మంచిదని నీవు అర్థం చేసుకున్న దానిని తక్షణమే ఆచరించు. –స్వామి వివేకానంద"



సంపాదకీయం

అన్సారీ పలుకులు

''ప్రభుత్వ విధానాలపై విమర్శను సహించకపోతే ప్రజాస్వామ్యం నియంతృత్వమైపోతుంది''.

''మైనారిటీలకు రక్షాకవచంగా నిరూపించుకోవడంలోనే నిజమైన ప్రజాస్వామ్యం ఇమిడి ఉంది''.

''పార్లమెంటు రాజ్యాంగ సృష్టి, అది భారతదేశ వైవిధ్యాన్ని ప్రతిబింబించాలని జాతి నిర్మాతలు ఆశించారు''.– ఉపరాష్ట్రపతిగా తన పదవీకాలం చివరి రోజున గురువారంనాడు హమీద్ అన్సారీ రాజ్యసభనుద్దేశించి చేసిన ప్రసంగంలో పలికిన ఈ పలుకులు ఏ దేశ ప్రజాస్వామ్యానికైనా ప్రాణప్రదమైనవి. ప్రత్యేకించి భిన్న ప్రాంతాల, మతాల, భాషల సమాహారమైన భారతదేశానికి సంబంధించి అత్యంత విలువైనవి. స్వయంగా తాను మైనారిటీలకు చెందిన వాడైనందునే ఆయన ఇలా మాట్లాడారని అనవచ్చు. కురుచ చూపుగలవారే అలా అనగలరు. దేశంలో నేడు నెలకొన్న పరిస్థితులను ప్రజాస్వామిక అవగాహనతో కూడిన చూపుతో చూసిన వారెవరైనా అన్సారీ ఆవేదనను అర్థం చేసుకోగలరు. అది అర్థవంతమైనదనే భావన వారిలో కలిగి తీరుతుంది.

మత విద్వేషాలు దేశానికి కొత్తకాదు. గత చరిత్రనుంచి వారసత్వంగా సంక్రమించిన మతవిద్వేషం ఇంతకుముందు పలుమార్లు దేశంలో శాంతిని బలి తీసుకున్నది. కాని భారతీయ జనతాపార్టీ అపూర్వమైన సంఖ్యాబలంతో, లోక్‌సభలో తిరుగులేని మెజారిటీతో కేంద్రంలో అధికారం చేపట్టిన తరువాత మత కల్లోలాలకు బదులు మైనారిటీలపై, హేతువాదులపై ఏకపక్ష దాడులు పెరిగిపేట్రేగిపోయాయి. గోరక్షణ పేరిట గూండాల ఆగడాలు పెచ్చరిల్లాయి. దళితులపైన, ముస్లింలపైన హింస చెలరేగింది. ఇవి నేరుగా కేంద్రంలోని పాలకులే చేయిస్తున్నవని అనడం సరికాదు, సబబు కానేకాదు. కానీ ఇటువంటి అపూర్వ దుర్ఘటనలు జరగకుండా పదేపదే సంభవించకుండా చూడవలసిన దృఢమైన, రాజ్యాంగ విహితమైన కర్తవ్య నిర్వహణలో వారు ఘోరంగా విఫలమవుతున్నారని మాత్రం చెప్పక తప్పదు.

రెండు పదవీకాలాలపాటు, పదేళ్ల సుదీర్ఘకాలం ఉపరాష్ట్రపతిగా ఉండి దేశ పరిస్థితులను, పరిణామాలను నిశితంగా పరిశీలించినవారు అన్సారీ. ఐక్య ప్రగతిశీల సంఘటన(యుపిఎ), జాతీయ ప్రజాస్వామ్య కూటమి(ఎన్‌డిఎ) పాలనలు రెండింటినీ ఆయన దగ్గరగా చూశారు. రాజ్యసభ ఛైర్మన్‌గా కూడా రెండువైపుల వారి వైఖరులను గమనించారు.

చట్టాలు చేసేటప్పుడు తొందరపాటు తగదని అన్నివైపులనుంచి ఆలోచించి చేయాలని అన్సారీ శాసనకర్తలకు సలహా ఇచ్చారు. ప్రధానిమోడీ హయాంలో జాతీయస్థాయిలోను, కొన్ని రాష్ట్రాలలోనూ గోరక్షణ పేరిట అమలులోకి వచ్చిన కఠినతర నిబంధనలు దేశంలోని కొన్ని వర్గాల ప్రజల ఆహారపుటలవాట్లమీద తీవ్ర ప్రతికూల ప్రభావాలు చూపిస్తున్న సంగతి తెలిసిందే. భిన్న మతవర్గాల ప్రజలున్న దేశంలో ఒకేవర్గం ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఉత్తర్వులు, ఆదేశాలు జారీచేయడం, శాసనాలు రూపొందించడం బహుళత్వంలో ఏకత్వమనే ప్రజాస్వామిక మౌలిక ధర్మానికి తీవ్ర విఘాతం కలిగిస్తుంది. అవాంఛనీయ పరిణామాలకు దారితీసి దేశ సమైక్యతను, సమగ్రతను దెబ్బతీసే పరిస్థితులను దాపురింపచేస్తుంది.

పాలకపక్షం తనతో కలిసిరాని, తన ప్రయోజనాలకు సహకరించని ప్రతిపక్షాలను, ఇతర శక్తులను నామరూపాలు లేకుండా చేసేందుకు అధికారాన్ని దుర్వినియోగం చేయడం ప్రధాని మోడీ హయాంలో కొత్త రోత పుంతలు తొక్కుతున్న చేదు వాస్తవాన్ని గురించి వివరించి చెప్పుకోనక్కరలేదు. ఇది సహజంగానే ప్రజాస్వామ్యంలో పాలకులను ప్రజాహితం కోరి విమర్శించే స్వేచ్ఛను హరిస్తుంది. అంతిమంగా ప్రజాస్వామ్య మూలాలను కొరికివేసి ఆ మహావృక్షాన్ని కూల్చివేస్తుంది. ఈ నిరంకుశ వైఖరి నేడు జాతీయ స్థాయిలో కొన్ని రాష్ట్రాలలో ప్రబలింది. అందుకే ఉపరాష్ట్రపతిగా, రాజ్యసభ ఛైర్మన్‌గా తన చివరి ఘట్టాన్ని హమీద్ అన్సారీ ఎంతో సద్వినియోగం చేశారని భావించవలసి ఉన్నది. వర్తమాన, భవిష్యత్ పాలకులకు చక్కని హితబోధ చేయడానికి ఈ సందర్భాన్ని ఆయన పలు వేదికలనుంచి ఘనంగా ఉపయోగించుకున్నారు. రాజ్యసభ ఛైర్మన్‌గా హుందాగా సంయమనంతో పరిణతితో విధినిర్వహణ చేసి అన్సారీ ఆదర్శప్రాయులయ్యారు. ఆయనలోని ప్రజాస్వామ్య దీపం దేశానికి మరిన్ని వెలుగులను పంచాలని కోరుకుందాం.

కశ్మీర్‌లో ఐక్యసంఘటన!

చూపు

జమ్ము–కశ్మీర్‌కు ప్రత్యేక హోదాను నీరుగార్చిస్తారా? కాశ్మీర్‌లో ఈ భయం వ్యాపించడంవల్ల అనూహ్య రాజకీయ సమీకరణ ఒకటి చోటు చేసుకొంది. ప్రధాన ప్రత్యర్థి పార్టీలయిన అధికార 'పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ (పిడిపి)' ప్రతిపక్ష 'నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సి)' ఈ అంశంపై ఒకటయ్యాయి.

కశ్మీర్‌కు ఇటువంటి భయాలు కొత్తకాదు. ఈసారి ఆ భయాలకు సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్ కారణం. జమ్ము–కశ్మీర్‌కు ప్రత్యేక హోదా కల్పిస్తున్న రాజ్యాంగంలోని 35 ఎ అధికరణను సవాలు చేస్తున్న పిటిషన్ అది. ఆ అధికరణ కశ్మీర్ తన 'శాశ్వత నివాసులను' నిర్వచించుకోడాన్ని అనుమతిస్తోంది. స్థానికులు కానివారు కశ్మీర్‌లో భూములు, ఆస్తులు కొనడాన్ని నిషేధించిన రాజ్యాంగ నిబంధన ఆ అధికరణలోనిదే. దాని ద్వారా ఆ రాష్ట్ర జనాభా తీరుతెన్నులు మారిపోకుండా చేయడం అసలు లక్ష్యం. 370వ అధికరణ చెల్లుబాటును సవాలు చేసిన మరో పిటిషన్‌లో కూడా కేంద్రం స్పందనను కోరుతూ సుప్రీంకోర్టు ఇటీవల నోటీసు ఇచ్చింది. ఆ రాష్ట్రానికి ఆ అధికరణ ద్వారానే స్వయం ప్రతిపత్తి లభించింది.

మంగళవారం నాడు (ఆగస్టు 8) ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీకి చెందిన నేషనల్ కాన్ఫరెన్స్(ఎన్‌సి) అధ్యక్షుడు ఫారూక్ అబ్దుల్లాను కలుసుకొన్నారు. ఎన్‌సి శాసన సభ్యుడు అలీ మహ్మద్ సాగర్ చెప్పినట్లుగా ఇప్పుడు వివిధ పక్షాల మధ్య ఐక్యత అవసరం. కొన్ని విషయాల్లో ఐక్య పోరాటం తప్ప మార్గం లేదని కూడా ఆయన అన్నారు.


ముఫ్తీ – ఫారూక్ సమావేశంపై ఆయన ఆ వ్యాఖ్య చేశారు. ఇది కశ్మీర్‌లోయ వంటి ఒక ప్రాంతానికి సంబంధించిన అంశం కాదని, మొత్తం రాష్ట్రానికి సంబంధించినదని అలీ వ్యాఖ్యానించారు. ముఖ్యంగా రాష్ట్రం హక్కులు, ప్రత్యేక హోదా వంటి సౌకర్యాలు ఇమిడి ఉన్న అంశమని కూడా వివరించారు. అందువల్ల సాధారణంగా ప్రజల్లో, పార్టీల్లో ఆందోళనలు నెలకొన్నాయని వివరించారు. జమ్ము – కశ్మీర్ ప్రయోజనాల కోసం సాధారణ రాజకీయ వైఖరులకు అతీతంగా మెలగాల్సిన తరుణం ఇదని ఆ సమావేశంలో ఇరువురు నాయకులు అంగీకారానికి వచ్చినట్లు పిడిపి సీనియర్ నాయకుడు నయీమ్ అఖ్తర్ తెలిపారు.

అస్తిత్వ సమస్య అన్న ముఫ్తీ

'జమ్ము– కశ్మీర్ రాజ్యాంగానికి, భారత రాజ్యాంగానికి కట్టుబడి ఉన్న అన్ని రాష్ట్ర రాజకీయ పక్షాలకు ఇది పరీక్షా సమయం. ఈ సరికే ప్రత్యేక హోదాలో మిగిలిందేమీ లేదు. ఇటువంటి స్థితిలో 35 ఎ అధికరణను తారుమారు చేస్తే మనం అస్తిత్వాన్నే కోల్పోతాము. ప్రధాన జీవన స్రవంతికి అది మరణ గంట మోగిస్తుంది.

మన ప్రజలకు చెప్పుకునేందుకు మనకిక అవకాశమే ఉండదు' అని ముఖ్యమంత్రి అన్నట్లు ఒక ఆంగ్ల దినపత్రిక రాసింది. ప్రత్యేక హోదాను నీరుగార్చిస్తే కశ్మీర్‌లోయలో ఇక భారత జాతీయ జెండాను మోసేవారే ఉండరని ఆమె గత నెల ఒక కార్యక్రమంలో అన్నారు.

ఆ రెండు ప్రత్యర్థి పార్టీల్లోనే కాక వెలుపల కొన్ని గ్రూపులు కూడా 35ఎ అధికరణను రక్షించడానికి ఏకమయ్యాయి. ఇటీవల



(ఆగస్టు 7) ప్రధాన ప్రతిపక్షాలు ఫారూక్ అధ్యక్షతన సమావేశం అయ్యాయి. ఆ అధికరణను కాపాడుకోడానికి తిరుగుబాటు తప్పదని ఆ సమావేశంలో ఫారూక్ హెచ్చరించారు. ఆ అధికరణను రద్దు చేస్తే ప్రజావెల్లువ తప్పదని ఆయన సమావేశం తర్వాత విలేకరులతో అన్నారు. 'అమర్‌నాథ్ భూ వివాదం తలెత్తినప్పుడు ప్రజలు రాత్రికి రాత్రి తిరగబడ్డ విషయాన్ని మరువవద్దు. ఇక ఈ అధికరణ విషయం అంతకంటే ఎన్నో రెట్లు పెద్దది కాబట్టి తీవ్ర పరిణామాలు ఏర్పడే ప్రమాదం మరింత ఎక్కువ' అని కూడా ఫారూక్ వ్యాఖ్యానించినట్లు స్థానిక ఆంగ్ల పత్రిక రాసింది.

12న బంద్‌కు వేర్పాటు నాయకుల పిలుపు

ఫారూక్ వైఖరిని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సైఫుద్దీన్ సోజ్ సమర్థించారు. ఈ అంశంపై ఆందోళన ప్రస్తుతం ప్రధాన స్రవంతిని దాటి జనంలోకి చొచ్చుకుపోయింది. వేర్పాటువాద నాయకులు కూడా తమ ఆందోళనలను చాటుతున్నారు.

గత ఆగస్టు 7వ తేదీన ముగ్గురు ప్రముఖ వేర్పాటువాద నాయకులు సయ్యద్ అలీషా గిలానీ, మీర్వాయిజ్ ఉమర్ ఫారూక్, యాసిన్ మాలిక్ కశ్మీరీల ప్రస్తుత ఊచకోతకు నిరసనగా ఈ నెల 12న బంద్‌కు పిలుపునిచ్చారు. జమ్ము– కశ్మీర్ శాంతి భద్రతల అంశాన్ని రాష్ట్రం అధీనంలోంచి తప్పించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని కూడా వారు ఆరోపించారు. దీనికి కూడా నిరసనగా 12న పూర్తిబంద్ జరుగుతుందని ఆ ముగ్గురు వేర్పాటు నాయకులు చెప్పారు.

35 ఎ అధికరణ రద్దు ప్రతిపాదనపట్ల ఇటీవల 'కశ్మీర్ ఆర్థిక కూటమి' పేరిట గల వ్యాపారుల సంస్థ నిరసన ప్రదర్శనలు జరిపింది. రాష్ట్రంలో జిఎస్‌టి అమలును కూడా నిరసిస్తూ వారు నినాదాలిచ్చారు. 35 ఎ అధికరణను రాజ్యాంగ వ్యతిరేకంగా ప్రకటించాలని సుప్రీంకోర్టులో దాఖలయిన పిటిషన్‌పై అఫిడవిట్ దాఖలు యోచన కేంద్రానికి లేనట్లు గత నెల అటార్నీ జనరల్ కెకె వేణుగోపాల్ ప్రధాన న్యాయమూర్తి జెఎస్ ఖేహర్ సారథ్యంలోని బెంచ్‌కి తెలిపారు.

ఈ కేసులో ఎటువంటి 'కౌంటర్ అఫిడవిట్' దాఖలు చేయరాదని నిర్ణయం తీసుకొన్నట్లు ఇటీవల ఆయన కోర్టుకు ఖరారుగా తెలిపారు. వివిధ పార్టీలు ఈ అంశంలో ఒకే రకంగా ప్రతిస్పందిస్తున్నా ఒకే పోరాట వేదికగా ఏర్పడక పోవచ్చునని ఒక రాజకీయ విశ్లేషకుడు వ్యాఖ్యానించారు.

✻ రాయన్ నఖాష్

అమ్మకం వస్తువుగా దళిత అసమ్మతి



టంకశాల అశోక్
9848191767

ఒకప్పుడు అసమ్మతిని చూస్తే సంతోషం అనిపించేది. ఆశ కలిగేది. కాని ఇటీవలి కాలంలో ఎక్కడ ఏ అసమ్మతిని చూసినా అదెప్పుడు ఒక అమ్మకం వస్తువుగా మారిపోతుందేమోననే సందేహం కలుగుతున్నది. భయం వేస్తున్నది. అందువల్లనే, అదెంత తీవ్రంగా కనిపించే అసమ్మతి అయినా, కనీసం తగినంతకాలం వేచిచూసి అపుడొక అభిప్రాయానికి రావచ్చుననిపిస్తున్నది. ఈ పరిస్థితి కేవలం తెలుగు రాష్ట్రాలది కాదు. దేశమంతటా అట్లాగే ఉంది. ఇందులో రకరకాల వాదాల వారున్నారు, ఏ వాదం కానివారూ ఉన్నారు. అసమ్మతులు అన్నీ ఈ విధంగా అమ్మకం వస్తువులుగా మారటానికి కారణం ఏమిటి? అందుకు పరిష్కారాలు ఏవైనా ఉన్నాయా? ఈ ప్రశ్నలపై ఆలోచించినపుడు అస్పష్టంగా ఏవో తోచటం తప్ప నిర్ధారణగా ఏమీ తేలకుండా ఉంది. దానిని బట్టి, ఇంకా విస్తృతమైన ఆలోచనలు అవసరమనిపిస్తున్నది.

ఉదాహరణకు ఇటీవల కొద్దికాలంగా గుజరాత్, ఉత్తరప్రదేశ్‌లలో దళిత యువనాయకులు కొందరు, తమ వర్గాల ప్రజలపై జరుగుతున్న అత్యాచారాలపట్ల, వారి అభివృద్ధి లేమిపట్ల రాడికల్ అనదగ్గ రీతిలో స్పందిస్తున్నారు. దళితుల ఆహారం, వారు పశు కళేబరాలను తొలగించటం, పలు విధాలైన సాకులతో వారిపై దాడులు, మాలిన్యాన్ని ఎత్తివేసే వృత్తి, పేదరికం, ఫూలే–అంబేద్కర్ వంటి వారి విగ్రహాల ఏర్పాటుకు స్వేచ్ఛ లేకపోవటం, పార్టీల నాయకత్వాలూ అధికార యంత్రాంగాలూ తమ పట్ల కపట ప్రేమ చూపుతూ ఉన్నత వర్గాల పక్షం వహించటం, సాధారణ పౌర సమాజంలోనూ ఉన్నత వర్గాలదే ప్రాబల్యం అయినందున తమపై అంతటా చిన్నచూపు, దళితులలోని వెనుకటి తరాలు దీనినంతా నిస్సహాయంగా భరించినా కొత్త తరాలు నిరసించటం, ప్రతిఘటించటం వంటి పలు అంశాలను కేంద్రంగా చేసుకుంటున్న స్థితి మనకు కన్పిస్తున్నది.

నిజానికి వీటన్నింటిలో ఏదీ పూర్తిగా కొత్త కాదు. అధికారంలో ఎవరు ఉన్నా కొంత హెచ్చు తగ్గులుగా ఈ పరిస్థితి మొదటినుంచి ఉంటూనే ఉంది. ఆ వర్గాలకు చెందిన యువకులు, మేధావులు నిరసించి ప్రతిఘటించటంతో సహా. కాని ఆ పని చేసి దేశమంతటా తమ వారిని, ఇతర ప్రజాస్వామిక వాదులను ఉత్తేజపరచిన రాడికల్ అసమ్మతివాదులు, క్రమంగా తమ అసమ్మతిని ఒక అమ్మకపు సరుకుగా మార్చివేసారు. వ్యక్తిగతంగా లాభపడ్డారు. తమ వారిని గాలికి వదిలారు. ఇతరత్రా ఏ విధంగానైతే ఆధిపత్య వర్గాలు పీడిత జనులకు ఏవో కొన్ని విదిలించి, భ్రమలకు గురిచేసి, వారిని ఓటర్లుగా ఉపయోగించుకుంటున్నాయో, ఈ రాడికల్ అసమ్మతి వాదులు కూడా సరిగా అదే పనిచేస్తున్నారు. తాము ఒక కొత్త ప్రాబల్యవర్గంగా మారి అధికారాన్ని, సంపదలను సమకూర్చుకుంటున్నారు. సంప్రదాయికమైన ప్రాబల్య వర్గాలకు అనుబంధ ప్రాబల్యవర్గంగా మారుతున్నారు. దీనితో పీడిత వర్గాలలోని సాధారణ ప్రజల స్థితిగతులు, పీడనలు, అవమానాలు ఎప్పటివలెనే ఉండిపోతున్నాయి.

ఇక్కడ ఎవరిపేర్లూ ప్రత్యేకంగా రాయటం లేదు. కాని ఇదే గుజరాత్‌కు పొరుగున గల మహారాష్ట్రలో దళితుల అసమ్మతి, ప్రతిఘటన మొత్తం దేశాన్ని ఊపివేసాయి. తగినంతకాలం పాటు అదొక బలమైన ఉద్యమంగా సాగింది. ఆ స్ఫూర్తి ఇతర రాష్ట్రాలలోనూ కన్పించింది. ఆ పరిస్థితుల నుంచి ఫైర్‌బ్రాండ్స్ అనిపించుకున్నవారు చాలా మంది ఉద్భవించారు. వారంతా క్రమంగా ఏమయ్యారో తెలిసిందే. కాని విషయం అంతటితో ముగిసిపోక, ఇదే రాడికలిజం కొన్ని తేడాలతో బీహార్, ఉత్తరప్రదేశ్, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడులలో కన్పించింది. అటువంటి మథనం నుంచి వారు కొన్ని రాజకీయ పార్టీలు నెలకొల్పి తమది సంస్కరణలవాదం కాదని, రాజకీయాధికార పోరాటమని ప్రకటించారు. అటువంటి పార్టీలలో బిఎస్‌పి కూడా ఒకటైంది. చరిత్ర క్రమంగా కొత్త మలుపు తిరగగలదనే ఆశాభావాలు ఈ వర్గాలకు దేశవ్యాప్తంగా ఏర్పడ్డాయి.

సంస్థలు కోకొల్లలుగా పుట్టుకువచ్చి రకరకాల కార్యక్రమాలు సామాజికంగా, మేధోపరంగా, సాంస్కృతికంగా, రాజకీయంగా ముమ్మరమైన రీతిలో సాగాయి. లెక్కలేనంత మంది రాడికల్స్ పుట్టుకువచ్చారు.

21వ శతాబ్దంలోనూ కొంతవరకు కొనసాగిన ఈ వాతావరణం, ఈ రోజున వెనుకకు తిరిగి సమీక్షించుకుంటే, ఏ విధంగా ఉంది? ఇక్కడ అక్కడ అని కాదు, అంతటా కూడా? నిర్మొహమాటంగా చెప్పాలంటే చాలావరకు అసమ్మతి ఒక అమ్మకపు సరుకుగా మారింది. కొంతవరకు నిస్సహాయంగా మారి, ఏమి చేయాలో తోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నది. అమ్మకపు సరుకుగా మారినవారు సుఖపడుతున్నారు. మారనివారు తమ వర్గాల జనసమూహాలతో కలిసి దుఃఖిస్తున్నారు. ఇదంతా గమనించిన మీదట ప్రస్తుతపు గుజరాత్, యుపి దళిత రాడికల్ యువ నాయకులను ఏ విధంగా చూడాలి? యుపితోపాటు బీహార్, ఢిల్లీల నిన్నటి రాడికల్స్ నేడు, తమ నిన్నటి ప్రత్యర్థుల శిబిరాలలో వెలిగిపోతున్నప్పుడు? నేటి రాడికల్స్ రేపు ఎక్కడ ఉండగలరోననే సందేహాలు పీడిస్తున్నప్పుడు?

అసమ్మతి అమ్మకం వస్తువుగా మారటానికి కొన్ని కారణాలు కనిపిస్తున్నాయి. ఈ వాదాలకు ఇన్ని దశాబ్దాలు గడిచినా ఒక స్పష్టమైన, సమగ్రమైన అజెండా లేకపోవటం వాటిలో ఒకటి. వీటికి మద్దతుగా నిలవగల ప్రజాస్వామిక–వామపక్ష వాదాలు క్రమంగా బలహీనపడుతుండటం రెండవది. ఈ రెండు వాదాలకు చెందిన వారి మధ్య తగిన అవగాహన ఎన్నడూ లేకపోవటం మూడవది. ఇతరులవలెనే వామపక్షాలు కూడా వీరిని ఓటు బ్యాంకుగానో, విప్లవ పోరాటాలకు ఇంధనంగానో చూసే ధోరణి నాల్గవది. ఉన్నత తరగతులకు చెందిన పార్టీలు వివిధ ఎత్తుగడలతో వీరిని ఉపయోగించుకుంటూ, బలహీనంగా ఉంచుతూ, చీల్చుతూ, భ్రమలు కల్పిస్తూ, నాయకులను అమ్మకపు వస్తువులుగా మార్చి వేయగలగటం అయిదవది. ఇటువంటివి మరికొన్ని ఉండవచ్చు.

ఇంతకూ ఈ అసమ్మతి రాడికల్స్ అమ్మకపు వస్తువుగా ఎందుకు మారుతుండవచ్చుననే ప్రశ్న ఒకటుంది. పైన అనుకున్నట్లు ఈ వాదాలకు ఇన్ని దశాబ్దాలు గడిచినా ఒక స్పష్టమైన, సమగ్రమైన అజెండా లేదు. తమ స్థితిగతుల పట్ల, వాటిని సృష్టించిన వారిపట్ల నిరసన స్పష్టంగానే ఉంది. వారు అటువంటి స్థితిగతులను ఎందుకు సృష్టించి ఎట్లా అమలు పరుస్తున్నారనే దానిపై చారిత్రకమైన, వర్తమానపరమైన అవగాహన కూడా స్పష్టంగానే ఉంది. కాని అస్పష్టతలు అన్నీ ఆ తర్వాత నుంచి మొదలవుతున్నాయి. ఇందుకు నిజమైన పరిష్కారం రాజకీయ అధికార సాధన అంటారు బాగున్నది గాని, 'రాజకీయ అధికారం' అంటే ఏమిటో వారిలోనే చాలామందికి నిర్దిష్టంగా తెలియదు.

ప్రభుత్వాధికారమే రాజకీయాధికారం అవుతుందా? ప్రభుత్వాధికారమంటే ఇతరుల ప్రభుత్వంలో తమకు కొంత అవకాశం లభించటమా లేక తామే ప్రభుత్వం ఏర్పాటు చేయటమా? కేవలం దళితులు స్వంత బలంతో ప్రభుత్వం నెలకొల్పగలరా, రాజ్యాధికారమూ సాధించగలరా? ఇతర పీడితవర్గాలతో మైత్రి అవసరమనుకుంటే ఎవరితో, ఏ విధంగా? ఇంతకూ తమ ప్రత్యామ్నాయ ఆర్థిక–రాజకీయ–సామాజిక వ్యవస్థ నమూనా ఏమైనా ఉందా? ఉంటే ఏమిటి? లేకుంటే ఎందుకు లేదు? ఎపుడు ముందుకు తెస్తారు? అదిగాక ప్రత్యామ్నాయ పరిపాలనలు, నైతిక వ్యవహారణల నమూనా ఏమిటి?

ఇవేవీ మనకు తెలియవు. ఇటువంటివి లేని శూన్యస్థితి ఈ వర్గాలను ఒక మార్గానికి కట్టుబడి నిలపలేకపోతున్నది. వారు ఫ్రీ మార్కెట్ వస్తువులుగా ఏదో ఒక దశలో మారిపోవటానికి ఈ శూన్య స్థితి ఒక కారణమవుతున్నది. అటువంటప్పుడు వారు సామూహికాలను వదిలివేసి వ్యక్తిగత ప్రయోజనాల వైపు మళ్లుతున్నారు. వారిని సామూహికానికి కట్టివేసి ఉంచే సైద్ధాంతిక వ్యవస్థలుగాని, పరిపాలనా ఆదర్శాలు గాని, దళిత బహుజన సామాజికుల వైపునుంచి గాని ఎటువంటి వ్యవస్థలూ కన్పించటం లేదు. అనగా ఈ వర్గాల బాధలు ఎట్లా నిజమో వారి నిరసన కూడా అట్లాగే నిజమై, తక్కినవన్నీ ఒక మిథ్యగా మిగిలిపోతున్నాయి. అటువంటప్పుడు అసమ్మతి ఒక అమ్మకపు వస్తువుగా మారటం తార్కిక పరిణామం కావచ్చు.

పోరాడే ప్రజలు నేరస్థులా?

ధర్మాగ్రహం నేరంకాదు. ఏ సమాజంలోనైనా మనిషికి ప్రాణం అత్యధిక విలువైనది. కుటుంబ సభ్యులకు కుటుంబంలోని సభ్యుల ప్రాణం కూడా అంతే విలువైనది. ఒక వ్యక్తి పైన యింకొక వ్యక్తి ఆధిపత్యం సహించరానిది. మొత్తం సమాజ ఆస్తి ప్రజలందరిది. ప్రభుత్వం కాపలాదారుగా ఉండి, సమంగా పంపకం చేసి ఆర్థిక సమానత్వం కాపాడాల్సిన బాధ్యత తీసుకోవాలి. వివిధ మతాలు, కులాలు, సాంప్రదాయాలు, భాషలు, జీవిత వైవిధ్యాలు కలిగిన భారతదేశంలో అదనంగా ఈ సమాజ హక్కులు కూడా ముందుకు వస్తున్నాయి. మనిషిపై మనిషి అజమాయిషీ చలాయించడం మతంపై మతం, కులంపై కులం, భాషలపై భాషలు, సాంప్రదాయాలపై సాంప్రదాయాలు ఆధిపత్యం చెలాయించి అణచి వేతలకు పాల్పడటం వ్యక్తి మానవ హక్కులపై దాడి చేయటమే. ఇవి జరిగినప్పుడు ప్రభుత్వం వీటిని చూసీచూడనట్లు ఉదాసీనంగా ఉండటం రాజ్యాంగాన్ని, చట్టాన్ని ఉల్లంఘించటమే.

రాజ్యాంగ, న్యాయ సూత్రాల ప్రకారంగా ప్రజలకు న్యాయం జరగనపుడు ప్రభుత్వం అర్థంలేని, నిష్ప్రయోజక పాత్ర పోషించినపుడు ప్రజలు నిరసనలు తెలిపి పోరాటాలు చేస్తారు, ప్రభుత్వాన్ని మార్చుకొంటారు. ఇవన్నీ కొత్తవేమీ కాదు. శతాబ్దాల చరిత్ర నేర్పిన విషయాలే. ఫలితంగా మెరుగైన సమాజాలు ఉద్భవించాయి. తత్పర్యవసానంగా రాజ్యాలు, రాజ్యాంగాలు, చట్టాలు నిత్యం అభివృద్ధి చెందాయి, చెందుతున్నాయి. మార్పులు నిత్యం చలనంగానే ఉన్నాయి. భవిష్యత్ వైపు జ్ఞానం పరుగులు పెడ్తోంది.

ఆధునిక రాజ్యాంగాలు, ప్రజాస్వామికమైన చట్టాలు రూపొందించుకున్నామని బోరలు విరుచుకొని గర్వంగా చెప్పుకుంటున్న మన పాలకులు నిత్యం వాటిని ఉల్లంఘించి, రాజకీయాల్లో డాంబికాలు, ఆధిపత్య అహంకార ధోరణులు, తమవే వజ్రంలా రాటుదేలిన రాజకీయాలని, చర్చించటానికి తావులేని విధానాలని భావించి ప్రవర్తిస్తున్నారు. అధికారం వచ్చిందే అదనుగా, ప్రజలకిచ్చిన వాగ్దానాలను మరచి ఆవురావురుమని దోచుకోవటానికి ఎంతటి బరితెగింపుకైనా పాల్పడుతున్నారు. అందులో భాగంగా ప్రాజెక్టులు, పథకాల పేరుతో జన సామాన్యాన్ని మోసపుచ్చి, సింహభాగాన్ని కాజేసి అధికారంలో ఉండగానే కోట్లాది ఆస్తులు కూడబెట్టుకుంటున్నారు. ప్రజల కళ్లెదురుగానే వీరి గత జీవితాలు, నేటి జీవితాలు పోలికకు చిక్కుతున్నాయి.

భూములు, భూగర్భ, అటవీ, జల సంపదలు, మొత్తం ప్రకృతిని తమ గుప్పిట్లోకి తీసుకొని, తమ వందిమాగధులకు భాగం పంచుతున్నారు. ఫలితంగా ప్రజలు మోసాలకు గురయిపోతున్నారు. 70 సంవత్సరాల స్వాతంత్ర్యం తర్వాత కూడా ప్రజలు నిత్య పేదరికంతో, అనారోగ్యంతో, ఆకలితో కునారిల్లుతున్నారు. ఇల్లు, విద్య మిథ్యలుగానే మిగిలాయి. ఎన్నెన్ని పథకాల గురించి డంబాలు చెప్పినా ఆకలుంది. నివాసాలు లేవు. ఆరోగ్యం మధ్యతరగతికే దూరమైంది. విద్య ధనవంత రూపం తీసుకుంది. గ్రామాల్లో, పట్టణాల్లో, నగరాల్లో నేటికీ అపరిశుభ్ర పరిసరాల్లో జీవితం వెళ్లబుచ్చే పేదలు, పేదాతి పేదలు(poor of the poor) ఉన్నారు. ఒక వైపు ఊహకందని సంపద, కొత్త భూస్వామ్య వర్గ ఆవిర్భావం, కార్పొరేటు దోపిడీ సంస్థలు దేశాన్ని కొల్లగొట్టి కోట్లాది ధనాన్ని మూట కట్టుకొని విదేశాల్లో గుప్తం చేస్తుంటే మరోవైపు విశాల భారతం తిండికి అల్లాడుతున్నది.

ఇంకొక జీవితముంది. అది ఆదివాసీ జీవితం. దేశమంతా విస్తరించిన అటవీ ప్రాంతం. వీరు ప్రభుత్వ పథకాలకు చాలా చాలా దూరంగా ఉంటారు. ఉంచబడ్డారనటమే సరైన పదం. వీరికి ప్రభుత్వం, రాజ్యాంగం, చట్టాలు మారిన అభివృద్ధి చెందిన జీవన జీవిత పద్ధతులు ఏవీ తెలియకుండా చీకటి పొదల్లోనే ఉంచబడ్డారు. అటవీ సంపద – చెట్లు, అటవీ ఉత్పత్తులు, అందులో నిక్షిప్తమైన భూగర్భ సంపదలో వారికి భాగస్వామ్యముంది. చట్టాలన్నాయి. వారికి స్థిరనివాస హక్కులున్నాయి. కానీ దోపిడీ దొంగలు అక్కడికి కూడా చేరుకున్నారు. ప్రభుత్వంలోని వారు ఈ సంపదను కొల్లగొట్టటానికి విదేశీ, స్వదేశీ వ్యాపార శక్తులకు అడ్డు అదుపులేని అవకాశాలను కల్పించి, దోపిడీని ప్రోత్సహించి భాగాలు పంచుకుంటున్నారు. దేశ సంపద ప్రకృతి సిద్ధంగా ఆదివాసీలకు, ప్రజలకు చెందాల్సి ఉన్నా, వీటిని కొల్లగొడ్తున్న దోపిడీదార్లకు కేంద్ర, రాష్ట్రాల ప్రభుత్వాలు అండగాఉండి, ప్రజల సంపదకు కాపలాదార్లుగా ఉన్న ఆదివాసీలను ఎలాగైనా అడవుల నుంచి వెళ్లగొట్టటానికి కుయుక్తులు పన్నుతున్నారు.


ఈ పరిస్థితుల్లో మైదాన ప్రాంతాల్లో, అటవీ ప్రాంతాల్లో ప్రగతిశీల ఉద్యమాలు చేస్తున్న ప్రజలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్రాతి తీవ్రమైన హింసాత్మక అణచివేత పద్ధతులకు తెరలేపాయి. చట్టం, న్యాయం బిత్తరపోయి చూడటం తప్ప ఏమీ చేయలేని నిరాసక్తతకు గురయ్యాయి. ప్రజలకు నాయకత్వాలు వహిస్తున్న సంఘాలు, పార్టీల నాయకులు, కార్యకర్తలను బెదిరించి, అరెస్టులు చేసి, కేసులు బనాయించి, కోర్టుల చుట్టూ తిప్పి, ప్రజలను కార్యకర్తలను నేరస్థులుగా చిత్రిస్తున్నారు. ప్రజలకు నాయకత్వం వహించేవారు నేరస్థులు కారు. చివరకు రైతులకు బేడీలు వేసిన ప్రభుత్వాలకు ప్రజల ఎడల ఏమాత్రం గౌరవముందో చూసి ముక్కున వేలేసుకోవాల్సి వచ్చింది.

మూడు సంవత్సరాలుగా దేశంలో ఉత్తర, దక్షిణ రాష్ట్రాల్లో మహమ్మారిలా వ్యాపించిన కొత్త ధోరణులు మత దురహంకారం, ఆహార అలవాట్లపై ఆంక్షలు, దళిత, మైనారిటీలపై దాడులు, హింసలు, హత్యలు. ఇవి ఎంతలా వ్యాపించాయంటే వేలాదిమంది ఈ దాడులకు గురైన సంఘటనలు, మరణాలు, స్త్రీలపై లైంగిక వేధింపులు, అగ్ర కులాల అత్యాచారాలు మనస్సులను కలచి వేస్తున్న సంఘటనలు. మేధావులు, దళిత ప్రజలను గ్రామాల నుంచి బహిష్కరించటం సమాజాన్ని వెనుక పట్టు పట్టించటమే. కులాంతర యువతీ, యువకుల ప్రేమలు, పెళ్లిళ్లు వారి జీవితాలను అంతం చేసే దశకు చేరుకున్నాయి. ఫలితంగా యువశక్తి నశించిపోయే ప్రమాదం పొంచి ఉంది. కులాంతర హత్యలను, దాడులను ప్రభుత్వాలు ఆపకపోగా వాటిని పరోక్షంగా ప్రోత్సహించి అంతిమంగా దళిత, అణగారిన కులాలను తమ చెప్పుచేతల్లో ఉంచుకొని, తమ దోపిడీ, కులాధిపత్యాలకు అడ్డురాకుండా చూసుకొనే ఎత్తుగడ సాగుతున్నాయి. ఇది అగ్ర కులాల పాలనలకు మార్గం సుగమం చేసుకోవటమే. వర్గాలకు తోడు ఈ దేశంలో కులాల దొంతర్లు సమాజంలో వైషమ్యాలను రగిలించి ప్రజలను దోపిడీ, పీడనలపై తిరగబడకుండా వారి ఐక్యతకు ఒక అడ్డంకిగా ఉన్నాయి. ఈ పరిస్థితులు పాలక పార్టీలకు అవసరమే. ప్రజలను చీల్చాల్సినంత చీల్చి అనైక్యతను పోషిస్తున్నాయి. ఈ ప్రమాదకర ధోరణులను ప్రజాస్వామిక, ప్రగతిశీల శక్తులు గ్రహించాలి. మూలమైన, ప్రాథమికమైన ఈ సమస్యను పసిగట్టి, దాని నిర్మూలన వైపు ప్రజలను చైతన్యపరచకుండా ఏ అభివృద్ధి సమాజాన్ని కనలేము. మేధావులు, ప్రజాస్వామ్యవాదులు, యువతీ యువకులు, దళిత, అణగారిన ప్రజలందరూ ఐక్యం కావలసిన తరుణమిది.

రెండు తెలుగు రాష్ట్రాలలో ఇటీవలి సంఘటనలు అన్నీ కూడా ప్రజలను నేరస్థులుగా చిత్రించి అణచివేత, హింసలకు గురిచేస్తున్నవే. ప్రజలు నేరస్థులుకారు. వారి జీవిత అవసరాలు, జీవిత హక్కుల కోసం పోరాడేవారు నేరస్థులు కారు. ప్రజలను పోరాటాలకు సమాయత్త మయ్యే పరిస్థితికి నెట్టిన ప్రభుత్వాలు నేరస్థులు. ప్రజల్ని భయపెట్టటం, ప్రభుత్వ అప్రజాస్వామిక విధానాలను విమర్శించిన వారిని, సంఘాలను, పత్రికా ప్రతినిధులను బెదిరించటం లాంటి చర్యలు పాలన ఏ విధంగా సాగుతోందో తెలియజేస్తున్నది. ఈ పరిస్థితులకు అంతం పలకాల్సిన మార్గాలను ఎన్నుకోవటమే తక్షణ కర్తవ్యం.

– బి.నరసింహ, కార్యదర్శి,
ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ ఇండియా.
ఓ.పి.డి.ఆర్., తెలంగాణా





శ్రావణమాసపు జల్లులలో...

అర్బన్ మ్యూజింగ్స్



కుప్పిలి పద్మ

శ్రావణం యిలా వచ్చిందో లేదో నగరమంతా వొకటే కోలాహలం. యెటుచూసినా పూల రాసులు. అరటి మొక్కలు. తీయని బెల్లం సువాసనలు. వూరు వూరంతా ఆఫర్‌ల్లే ఆఫ్ఫర్స్. బట్టల దుకాణాల్లో రంగురంగు చీరలు, చూడీదార్లు పరిచే చేతులు, బట్టలు కుట్టే చోటా చేతులు చకచకా కదిలిపోతుంటాయి. బంగారం, వన్ గ్రామ్ గోల్డ్ నగలు అమ్మే దుకాణాల్లో రద్దీ రద్దీ. మరో వైపు పెళ్ళిళ్ళ కోలాహలం. బ్యూటీ పార్లర్స్ సొగసులద్దుతూ మిలమిలలాడుతుంటాయి.

శ్రావణ శుక్రవారాల పేరంటాలు, నోములతో స్త్రీలు భలే బిజీ. మరో వైపు వూరు వూరంతా ఆఫర్ సేల్స్ నడుస్తూనే వుంటాయి. అమ్మాయిలు వుదయమే పూజ చేసుకొని, చేతికి తోరణం కట్టుకొని వండిన తీపి వంటలు ఆఫీస్‌లో కొలీగ్స్ కోసం కూడా బాక్స్ కట్టి ఆఫీసులకి వెళతారు. అలానే పురుషులు తమ యిళ్ళల్లో వండిన వంటకాలని బాక్స్ ల్లో సర్దించుకొని బయలుదేరుతారు. రోజులో యెక్కువ భాగం పనిచేసే చోట గడిపే వారి మధ్య యిలాంటి వేడుకలు వొక నవ్య వుత్సాహాన్ని యిస్తాయి. పని చేసే చోట వొకరికి వొకరు స్నేహాలని యిలా వాన చినుకుల్లా వెదజల్లుకొనే సందర్భాలు అనేకం యీ మాసమంతా మనకి కనిపిస్తాయి. వృత్తి క్షేత్రంలో రోజువారి పనుల్లో మునిగి తేలే మనుష్యులకి యిలా పండగలు స్నేహావారధిగా పనిచేస్తాయి.

శ్రావణ పౌర్ణమి భలే దాగుడుమూతల వెన్నెలని చిలకరిస్తుంటుంది. ఆ రోజు రాఖీ పండుగ అనురాగ సంబరాల్లో అందరి మనసులు తడిసి ముద్దవుతాయి. మనకి సినిమాల్లో అన్నచెల్లెళ్ళ అనుబంధం మీద 'అన్నయ్య సన్నిధి అదే నాకు పెన్నిధి' లాంటి పాటలు యెన్నెన్నో. పసితనంలో యింటి వాకిట ఆడుకుంటున్నప్పుడు తన చిన్నారి చెల్లె గెలవాలనుకొనే అన్న, బడికి వెళ్ళుతున్నప్పుడు వాన కురిసినప్పుడు మనకి గొడుగు వేసే అన్న, మనం నిరంతరం ఆనందంగా వుండాలని పరితపించే అన్నకి రక్షాబంధనం కట్టి యెప్పటికప్పుడు ఆ అన్న ఆశీస్సులు తీసుకోవటం మనకెంతో ధైర్యాన్ని సంతోషాన్ని యిస్తాయి.

యిలా అన్నతమ్ములకి రాఖీ కట్టి వారికి స్వీట్ తినిపించి వారిచ్చిన కానుకలని సంతోషంగా తీసుకొంటారు అక్క చెల్లెళ్ళు. అన్నతమ్ములని భారతీయ సమాజంలో స్త్రీలు తమ జీవితంలో యెంతో ఆత్మీయభరోసాగా భావిస్తారు. పెళ్ళి చేసుకొని అత్తగారి యింటికి వెళ్ళే అమ్మాయిలకి అన్నతమ్ములు కొండంత అండ. ఆ అనుబంధానికి చిహ్నంగా అలా వొక రాఖీ కట్టి అమ్మాయిలు భలే ఆనందపడే వేడుకా యీ మాసంలో రావటంతో వయస్సుతో నిమిత్తం లేకుండా అమ్మాయిలు తమతమ అభిరుచికి తగిన రాఖీని యెంపిక చెయ్యటం కోసం దుకాణాల్లో సరదాసరదాగా కబుర్లు చెప్పుకొంటూ వుండటం చూసాం.

యీ సారి హెల్మెట్ అన్నలకి బహుకరించమని ఎంపి కవిత గారు పిలుపునిచ్చారు. మీ భద్రతని మేం పట్టించుకొంటాం అని అక్క చెల్లెళ్ళు అన్నతమ్ములకి చెప్పటానికి అదో చక్కని ప్రతీక. గట్టిగా అరచి చెప్పక్కర లేదు. లొడాలొడా వాగక్కర లేదు. పదే పదే వివరించక్కర లేదు. సున్నితంగా హెల్మెట్ యెంత ఆవశ్యకమో స్పష్టంగా దృఢంగా చెప్పినట్టు అవుతుంది. వొక సామరస్యం కుదిర్చే సమయపు బాల్యమంతా మన అన్నల కళ్ళ ముందు కదలాడుతుంది. అప్పుడు వాళ్ళు గ్రహిస్తారు. అలానే హెల్మెట్ యెంత ముఖ్యమో ప్రజలందరికీ వొక ఆత్మీయత నుంచి గుర్తు చెయ్యటం మంచి ఆలోచన. వొక సమిష్టి సుసంబరాలని యిలా విలువైన విషయాలు చెప్పటానికి వొక సందర్భంగా వినియోగించటం మంచి యోచన.

చిన్నిచిన్ని కానుకలు అనుబంధపు సంకేతాలు. ఆ అనుభూతిని అడుగు జాడలే యింటా బయటా అందరి నడుమా వొక మృదువైన యేకీభావాన్ని యిస్తుంది.

అలాంటి సున్నితమైన అనుబంధాలకి ఆనవాలుగా మేమూ మీతోనే అంటూ శ్రావణపు జల్లులు నగరాన్ని పలకరిస్తూనే వున్నాయి తెరిపిలేకుండా.

kuppilipadma@gmail.com



యువ మానవ వనరులే ముప్పుగా మారేనా?!

నేడు అంతర్జాతీయ యువజన దినోత్సవం

వార్తా పత్రికల్లో ప్రతి రోజూ వచ్చే(20 వ శతాబ్దం తొలి దశలో) సక్సెస్ స్టోరీస్, నూతన ఆవిష్కరణల గురించి చదివిన యువత స్ఫూర్తి పొందింది. ఆ స్ఫూర్తి సమాజ పురోగతికి ఉపయోగపడింది. కాని నేడు ప్రపంచంలోనే అత్యధిక సంఖ్యలో యువత కలిగిఉన్న మన దేశంలో, వారికి సంబంధించిన అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నది. బుజ్జగిస్తే వినే వయసు కాదు అలాగని బాధ్యతలను భుజాన వేసుకునే వయసు అంతకంటే కాదన్న స్థితిలో నేటి యువత ఉన్నది. విద్యలో నాణ్యతాలోపం, విపరీతంగా పెరిగిన ఫీజులు వాటిని భరించే ఆర్థిక స్తోమతలేని కుటుంబాలు, గ్రామీణుల్లో అవగాహనా లోపం, వారి ప్రజ్ఞకు సరిపడ అవకాశాలు రాకపోవడం, భవిష్యత్తులో ఏం కావాలో నిర్ధారించుకోకుండా పోటీ పరీక్షలకు సిద్ధపడటం, గ్రామీణ యువతలో కమ్యూనికేషన్ స్కిల్స్ లోపించడం, ఎండమావుల్లాంటి అవకాశాలకోసం రాజకీయ పార్టీలవైపు ఆకర్షితమవడం(రాజకీయ నిరుద్యోగం) వంటివి నేటి యువత ఎదుర్కొంటున్న సవాళ్లు. వీటిని ఎదుర్కొనే మానసిక స్థైర్యం లోపించడంతో యువత డ్రగ్స్, మద్యం, స్మోకింగ్ లాంటి చెడు మార్గాలను ఎంచుకొని చివరకు ప్రాణాలను పణంగా పెడుతోంది. ఇటువంటి పరిస్థితులు మారాలంటే మార్పు రావాల్సింది యువతలోనా, సమాజంలోనా, విద్యావ్యవస్థలోనా అనేది మిలియన్ డాలర్ ప్రశ్నగానే మిగులుతోంది. యువతను ప్రభావితం చేస్తున్న కొన్ని అంశాలీవిధంగా ఉన్నాయి...

ఐక్యరాజ్య సమితి తాజా లెక్కల ప్రకారం భారత జనాభా చైనా కంటే తక్కువగానే ఉన్నా, దేశంలో యువత జనాభా అధికంగా ఉంది. దేశంలో దాదాపు 356 మిలియన్ల జనాభా 10-24 సంవత్సరాల మధ్య వయస్సుకలవారే కావడం గమనార్హం. ఈ సంఖ్య మొత్తం భారత జనాభాలోనే 28 శాతంగా ఉంది. అయితే ఎక్కువ మొత్తంలో ఉన్న యువ జనాభాను సరైన దిశగా తీసుకుపోగలిగితే దేశం శక్తివంతమైనదిగా ఎదుగుతుంది లేదా అధిక సంఖ్యలో ఉన్న యువతే దేశానికి పెను ముప్పుగా పరిణమిస్తుంది.

రాజకీయాల ప్రభావం : ప్రస్తుతంఉన్న పరిస్థితుల్లో యువత రాజకీయాలవైపు త్వరగా ఆకర్షితమవుతున్నారు. రాజకీయ నాయకుల ఆదేశాలకనుగుణంగా నడుస్తూ, రాజకీయ స్వార్థానికి బలవుతున్నారు. నాయకుల 'విభజించి పాలించే' సంస్కృతికి యువతను పావులుగా వాడుకుంటున్నాయి రాజకీయ పార్టీలు. జాతి, మత, కుల, భాషలపరంగా యువతను విడదీసే ప్రయత్నం రాజకీయ పార్టీలు చేస్తున్నాయి. ఈ రకమైన క్రీడలో బలమైన వర్గంగా ఉన్న యువత నలిగి బలహీనమవుతోంది.

ఒత్తిడి, బాధ్యతలు : సామాజిక, ఆర్థిక పరమైన అంశాలే కాకుండా మానసిక స్థితిని కూడా ప్రభావితం చేసే అంశాలు నేటి యువతను నిర్వీర్యం చేస్తున్నాయి. ఒంటరితనం, బయటకు రాలేని బంధాల్లో ఇరుక్కుపోవడం, ప్రేమ పేరుతో వంచన, బెదిరింపులు వంటివి వారిని డ్రగ్స్, మద్యం, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేలా ఉసిగొల్పుతున్నాయి. పెరిగిన పని ఒత్తిడి, తోటివారి ఒత్తిడి, కుటుంబ బాధ్యతలు లాంటివి వారిని ఆత్మహత్యలవైపు ప్రేరేపిస్తున్నాయి. సరైన ఆదరణ, సమయానుకూల కౌన్సెలింగ్ యువతలో స్థైర్యాన్ని నింపి శక్తివంతులుగా చేస్తాయి. ఈ రకమైన ప్రతికూల పరిస్థితుల ప్రభావం యువతమీద పడకుండా ఉండడానికి ప్రభుత్వాలు కూడా పాటుపడాలి. అప్పుడే యువ భారత్ దేశాన్ని నడిపే శక్తిగా ఎదుగుతుంది.

అంతర్జాతీయ యువజన దినోత్సవం ఆగస్ట్ 12, 2000 సంవత్సరం నుంచి జరుపుతున్నారు. యువతకు సంబంధించిన సాంస్కృతిక, న్యాయ విషయాల్లో అవగాహన కల్పిస్తూ ప్రభుత్వం చొరవ తీసుకునేలా చేయడమే ఈ దినోత్సవం ముఖ్యోద్దేశ్యం. స్థానిక ప్రభుత్వ, ప్రైవేట్ వ్యక్తులను కలుపుకుని వర్క్‌షాప్స్, సాంస్కృతిక కార్యక్రమాలు, మీటింగులు ఏర్పాటుచేయడంలో యువజన సంఘాలు ప్రపంచవ్యాప్తంగా పనిచేయడం తద్వారా వారిలో యువతకు సంబంధించిన అంశాల పట్ల అవగాహన ఏర్పడాలన్నది లక్ష్యం. ఇంటర్నేషనల్ యూత్ డే-2017 థీమ్ "యూత్ బిల్డింగ్ పీస్" వైరుధ్యాలు రూపుమాపడంలో, సామాజిక న్యాయం, స్థిరమైన శాంతి కోసం ప్రయత్నించే యువతను గుర్తించడం ఈ దినోత్సవం ప్రత్యేకత.

అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా కళాశాలల యువతను మన తెలంగాణ పలకరించగా వారి మనోభావాలను ఈ విధంగా తెలియజేశారు..

విద్యావ్యవస్థలో మార్పు రావాలి



ప్రతి విద్యాసంస్థలో మంచి, చెడు అనే విభాగాలుంటాయి. అయితే 60 మంది ఉన్న క్లాస్‌రూంలో పది శాతం మంది చెడువారున్నా, వారి ప్రభావం మిగతా 50% మంది మీద ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఉంటుంది. అయితే ఏ తల్లిదండ్రి డ్రగ్స్, లిక్కర్ తీసుకోమనో, స్మోకింగ్ చేయమనో చెప్పరు. ఎవరికి వారే వారి భవిష్యత్తును నిర్మించుకోవాలి. మొదట ఒక గోల్ నిర్ణయించుకుంటే దానిప్రకారం పనిచేస్తూ వెళ్లవచ్చు, దురదృష్టవశాత్తు చాలామంది యువత వారేం చేయాలో నిర్ణయించుకోలేని స్థితిలో కొట్టుమిట్టాడుతూంటారు, ఇదే వారిని ఇతరత్రా వ్యాపకాల వైపు మళ్లిస్తుంది. యువతను మానసికంగా శక్తివంతంగా తయారుచేసే విద్యావ్యవస్థ ఏర్పడాలి.

– ఆకాంక్ష జాజు, ఇంజినీరింగ్ సెకండ్ ఇయర్, గీతం యునివర్సిటీ.

విదేశీ వలసలు ఆగాలి



ప్రాథమిక విద్యలో మార్పు చాలా వచ్చినా, యునివర్సిటీ స్థాయిలో విద్యాప్రమాణాలు పడిపోతున్నాయి. దేశ వ్యాప్తంగా ఉద్యోగావకాశాలు తక్కువగానే ఉన్నాయి. మేం డిగ్రీ తీసుకుని బయటకు వచ్చే సమయంలో మన రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగావకాశాలుంటాయని భావిస్తున్నాం. దేశం బాగుపడాలనే భావనకంటే వ్యక్తిగా బాగుండాలనే భావన పెరిగిపోయింది, దానికి తోడు ప్రొఫెషనల్ కోర్సుల్లో ప్రమాణాలు దారుణంగా పడిపోయాయి. దాంతో డిగ్రీ తీసుకున్న ప్రతి విద్యార్థి విదేశాలకు వెళ్లేందుకే మొగ్గు చూపుతున్నాడు, ఇది దేశాభివృద్ధికి ఆటంకమే. ఉద్యోగావకాశాలు లేక యువత నిరాశా నిస్పృహలకు లోనై అసాంఘిక కార్యకలాపాలవైపు మళ్లుతున్నది. ప్రభుత్వం దీనిపై దృష్టిపెట్టాలి.

– రసజ్ఞ రంగ, ఇంజినీరింగ్ ఫైనల్ ఇయర్, స్టాన్లీ కాలేజీ.

అలోవెరాతో ముఖంపై మచ్చలు మాయం



అలోవెరాలో ఎన్నో రకాల ఔషధగుణాలున్నాయి. ఆరోగ్యానివ్వడమేగాక అందాన్ని కూడా ఇస్తుంది అలోవెరా. నేడు వయసుతో సంబంధం లేకుండా అందరికీ ముఖంపై మచ్చలు కనపడుతున్నాయి. ఇలాంటి మచ్చలను తొలగించుకోవాలంటే అలోవెరాతో సాధ్యమవుతుంది. ముఖంపై మచ్చలు, పొడి చర్మం, ఇతరత్రా చర్మ సమస్యలతో బాధపడుతున్న వారు ప్రతిరోజూ అలోవేరా జ్యూస్‌ను రాసుకుంటే మంచి ఫలితం కనపడుతుంది. మగవాళ్ళు షేవింగ్ చేసుకున్న తర్వాత బ్లేడుతో గాయమైతే.. వెంటనే అలోవెరా జెల్‌ను ముఖానికి రాసుకుంటే సరిపోతుంది. అలోవెరా జ్యూస్‌ను రాత్రిపూట ముఖానికి రాసుకుని ఉదయం లేవగానే గోరు వెచ్చని నీటితో ముఖాన్ని కడిగేస్తే.. చర్మ సౌందర్యం మెరుగవుతుంది. అలోవెరాను శుభ్రంగా కడిగి.. తొక్కతో పాటు మిక్సీలో రుబ్బుకుని పేస్టులా ముఖానికి, చేతులు, కాళ్లు, మెడకు పట్టించి అరగంట తర్వాత స్నానం చేస్తే చర్మం మిలమిల మెరిసిపోతుంది. అలాగే చర్మ వ్యాధులు తగ్గుతాయి. అలోవెరా ముఖంపై గల ముడతలకు చెక్ పెడుతుంది. అలోవెరా జ్యూస్‌ను జుట్టుకు పట్టిస్తే చుండ్రు సమస్యను తొలగించుకోవచ్చు.

ఖర్జూరాలతో రక్తహీనతకు చెక్



యాభైశాతానికి పైగా మహిళలు రక్తహీనతతో బాధపడుతున్నట్లు తాజా అధ్యయనాలు చెబుతున్నాయి. ఈ సమస్యనుంచి బయట పడాలంటే ఇనుము ఎక్కువగా ఉండే పదార్థాలను తీసుకోవాలి. శరీరానికి కావాల్సిన ముఖ్య పోషకాల్లో ఇనుము ఒకటి. ఇది లోపిస్తే అలసట, ఆయాసం, తలనొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు వస్తుంటాయి. ఇలా తరచుగా వస్తుంటే రక్తహీతన ఉన్నట్లు లెక్క. వెంటనే వైద్యుని వద్దకు వెళ్లి తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఈ సమస్య గర్భిణుల్లో ఉంటే, అది పుట్టబోయే బిడ్డపై పడుతుంది. డాక్టర్ సూచనల మేరకు ఐరన్ మాత్రలు వేసుకోవాలి. ఇనుమును తగిన మోతాదులో తీసుకోవాలి. దీని వల్ల హిమోగ్లోబిన్ శాతం పెరుగుతుంది. ఇది శరీరానికి కావాల్సిన ప్రాణవాయువును సరఫరా చేస్తుంది. మెదడు చురుగ్గా పనిచేయాలంటే తగినంత ప్రాణవాయువు అందాలి. ఐరన్ శరీర ఉష్ణోగ్రతను క్రమబద్ధీకరిస్తుంది. కండరాల ఆరోగ్యం కూడా దీనిపైనే ఆధారపడి ఉంటుంది. ఐరన్ తక్కువైతే కండరాలు సరిగ్గా పనిచేయవు. ఏ పని చేసినా త్వరగా అలిసిపోతారు. మనం తీసుకునే ఆహార పదా ర్థాల ద్వారా శరీరానికి కావాల్సిన ఇనుము అందనప్పుడు వైద్యుని సలహా మేరకు ఇనుము, ఫోలిక్ యాసిడ్ మాత్రలు వేసుకోవాలి. శరీరంలో హిమోగ్లోబిన్ శాతం తగ్గితే మలేరియా, టైఫాయిడ్, వంటి వ్యాధులు, ఎముకల్లో బలహీనత ఏర్పడతాయి. అందువల్ల ఆహారంలో మార్పులు చేయడం అవసరం. ఉదయం అల్పాహారంతో పాటు ఒక గ్లాసు పాలు, ఒక పండు నాలుగు ఖర్జూరాలు తీసుకోవాలి. సాయంత్రం నాలుగ్గంటలకు రాగిజావ, ఒక అరటిపండు తీసుకోవాలి. భోజనంలో ప్రతిరోజూ పప్పు, ఆకుకూరలు ఉండేలా చూసుకోవాలి. నిద్రపోయే ముందు గుప్పెడు వేరుశనగలు, కాస్త బెల్లం, నాలుగు ఖర్జూరాలు తీసుకోవాలి.

గీతంలో విజయవంతమైన గ్లోబల్ ఎడ్యుకేషన్ ఫెయిర్



మనతెలంగాణ/హైదరాబాద్ : ఉన్నత విద్యాసంస్థలు, పలు విశ్వవిద్యాలయాలు ఒకే వేదికపై వచ్చిన తమ విద్యార్థులకు ఆయా కోర్సుల వివరాలకు తెలియజేయడం ఆనందంగా ఉందని గీతం ప్రొ వైస్ ఛాన్సలర్ ఎన్.శివప్రసాద్ అన్నారు. గీతం విశ్వవిద్యాలయం ప్రాంగణంలో శుక్రవారం ఎడ్యుకేషన్ మాటర్స్ నిర్వహించిన ఒక రోజు గ్లోబల్ ఎడ్యుకేషన్ ఫెయిర్ విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమాన్ని గీతం ప్రొ వైస్ ప్రారంభించి మాట్లాడారు. విదేశాలలో విద్యను Aఅభ్యసించాలని అభిలషించే విద్యార్థులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా, స్విట్జర్లాండ్ తదితర దేశాలకు చెందిన విద్యాసంస్థల ప్రతినిధులు విద్యార్థులు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. ఈ ఫెయిర్‌లో దాదాపు 20 వర్సిటీలు, ఉన్నత విద్యాసంస్థలు పాల్గొని జీఆర్ఇ, ఐఇఎల్‌టిఎస్, జీమాట్, టోఫెల్, శాట్ వంటి వివరాలు తెలిపారు. ఎడ్యుకేషన్ ఫెయిర్ ప్రారంభోత్సవంలో గీతం ప్రతినిధులు సిహెచ్ సంజయ్, జివి రామారావు, శ్రీనివాస్, వై.లక్ష్మణ్‌కుమార్, డివివిఎస్ఆర్ వర, ఫెయిర్ సమన్వయకర్త డాక్టర్ పి.త్రినాథరావు, ఎడ్యుకేషన్ మాటర్స్ ప్రతినిధి శ్రీనివాసరాజు తదితరుతు పాల్గొన్నారు.

సీట్ల భర్తీపై మధ్యంతర ఉత్తర్వులు

మన తెలంగాణ/ హైదరాబాద్ : కాళోజీ నారాయణరావు, ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీల్లోని ఎంసీహెచ్, డీఎం సీట్ల భర్తీ తాము వెలువరించే తుది తీర్పుకు లోబడి ఉండాలని హైకోర్టు న్యాయమూర్తులు వి.రామసుబ్రమణియన్, టి రజనీలతో కూడిన డివిజన్ బెంచ్ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. సూపర్ స్పెషాలటీ కోర్సు సీట్లను నేషనల్ లెవెల్ కౌన్సిలింగ్‌కు అనుగుణంగా భర్తీ చేయాలని కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ ఉత్తర్వులను హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ బి.సతీష్‌కుమార్, మరో పది మందికిపైగా వైద్యులు వేసిన అత్యవసర కేసును బెంచ్ శుక్రవారం విచారించింది. కేంద్ర ఆరోగ్య శాఖ జారీ చేసిన ఉత్తర్వుల ప్రతిని సమర్పించాలని కేంద్రాన్ని బెంచ్ ఆదేశించింది. రాజ్యాంగ అధికరణాం 371(డి) ప్రకారం తెలంగాణలోని కాళోజీ వర్సిటీలో 85 శాతం సీట్లను తెలంగాణ వారితోనూ, ఎన్టీఆర్ వర్సిటీలోని 85 శాతం సీట్లను ఏపీ అభ్యర్థులతోనూ భర్తీ చేయాలని, మిగిలిన 15 శాతం సీట్లను ఏపీలో తెలంగాణ, తెలంగాణలో ఏపీ అభ్యర్థులతో భర్తీ చేయాల్సివుందని పిటిషనర్ల న్యాయవాది సరసాని సత్యంరెడ్డి గుర్తు చేశారు. జాతీయ స్థాయి కౌన్సిలింగ్‌తో భర్తీ చేయాలనే కేంద్ర ఉత్తర్వులు రాజ్యాంగంలోని ఆ అధికరణానికి వ్యతిరేకమని వాదించారు. భర్తీ జరపాలని, అయితే తాము వెలువరించే తీర్పుకు లోబడి ఆభర్తీలు ఉంటాయని న్యాయమూర్తి ఉత్తర్వులు జారీ చేస్తూ తదుపరి విచారణ 16కి వాయిదా వేశారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల కొనసాగింపు

మన తెలంగాణ/ హైదరాబాద్ : సమాచార కమిషన్‌లో ఉన్న ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను యథావిధిగా కొనసాగించాలని, వారికి ఏపీ 58, తెలంగాణ 42 శాతం నిష్పత్తిలో జీతాలు చెల్లించాలని హైకోర్టు రెండు తెలుగు రాష్ట్రాలకు మధ్యంతర ఆదేశాలిచ్చింది. తమ సేవల్ని కొనసాగించేలా ఆదేశాలివ్వాలని కోరుతూ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది దాఖలు చేసిన వ్యాజ్యాల్ని విచారించిన తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి ఉమాదేవిలతో కూడిన డివిజన్ బెంచ్ శుక్రవారం ఈ ఆదేశాలిచ్చింది. ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు సిబ్బందిని కొనసాగిస్తామని, రాష్ట్ర విభజన చట్టం మేరకు 5842 నిష్పత్తిలో జీతాలు చెల్లిస్తామని తెలంగాణ ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ డి.ప్రకాష్‌రెడ్డి మరోసారి హైకోర్టుకు తెలిపారు. ఏపీలో సమాచార కమిషనే లేనప్పుడు ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు సిబ్బందికి జీతాలు చెల్లించే బాధ్యత తమది కాదని ఏపీ ప్రభుత్వ న్యాయవాది చేసిన వాదనతో హైకోర్టు ఏకీభవించలేదు. ఆరువారాల్లోగా ఏపీలో కూడా సమాచార కమిషనర్ల నియామకాలు చేయాలని ఆదేశించామని, ఇప్పుడున్న సిబ్బంది జీతభత్యాలను రెండు రాష్ట్రాలు చెల్లించాలని బెంచ్ ఆదేశాలిచ్చింది. సిబ్బందిని రోడ్డున పాడేస్తామంటే కుదరదని తేల్చి చెప్పింది.

ఎర్రమంజిల్ నుంచి 3 కోర్టుల తరలింపు

మన తెలంగాణ/హైదరాబాద్ : ఎర్రమంజిల్‌లోని 14వ అడిషనల్ జడ్జి కమ్ 18వ అడిషనల్ చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్, 15వ అడిషనల్ జడ్జి కమ్ 19వ అడిషనల్ చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్, 16వ అడిషనల్ జడ్జి కమ్ 20వ అడిషనల్ చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టులను సికింద్రాబాద్ కోర్టు ఆవరణలోకి తరలిస్తున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

సెన్సార్ బోర్డు ఛైర్మన్‌గా ప్రసూన్ జోషి

న్యూఢిల్లీ: సెన్సార్‌బోర్డు అధ్యక్షుడుగా పాటల రచయిత, కవి ప్రసూన్ జోషి నియమితులయ్యారు. శుక్రవారం ప్రస్తుత ఛైర్మన్ పహ్లాజ్ నిహలానిని పదవి నుంచి తొలిగించిన ప్రభుత్వం ఆయన స్థానంలో జోషిని నియమించింది. సెన్సార్ బోర్డు ఛైర్మన్‌గా జోషి నియామకం తక్షణమే అమల్లోకి వచ్చింది. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు మూడేళ్ల పాటు ఆయన పదవీ బాధ్యతలు నిర్వహిస్తారని సమాచార ప్రసార శాఖ ఒక ప్రకటలో తెలిపింది. 2015లో నిహలాని సెన్సార్ బోర్డు ఛైర్మన్‌గా నియామకం అయినప్పటి నుంచి వివాదాస్పద చర్యలు, ప్రకటనలతో వార్తల్లో నిలిచారు.

జెడి(యు) నుంచి అన్సారీ సస్పెన్షన్

న్యూఢిల్లీ : తమ పార్లమెంటరీ పార్టీ నుంచి రాజ్యసభ సభ్యుడు అలీ అన్వర్ అన్సారీని జెడి (యు) శుక్రవారం సస్పెండ్ చేసింది. ప్రతిపక్ష పార్టీ సమావేశానికి హాజరు కావడంతో ఆయనను సస్పెండ్ చేసింది. బిజెపిని ఎదుర్కొనేందుకు కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీ అధ్యక్షతన జరిగిన 16 పార్టీల కూటమి సమావేశానికి హాజరు కావడంతో పార్టీ నుంచి ఆయనను బహిష్కరించినట్లు జెడి (యు) అధికార ప్రతినిధి కెసి త్యాగి తెలిపారు. తమ పార్టీ అంతర్గత వ్యవహారాల్లో సోనియా జోక్యం చేసుకుంటున్నారని ఆయన విమర్శించారు. కాగా, మహాకూటమి నుంచి బయటకు వచ్చిన జెడి (యు) అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ బిజెపితో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారని అన్సారీ విమర్శించారు.

డిసెంబర్ 5 నుంచి అయోధ్య విచారణ

న్యూఢిలీ: అయోధ్య స్థల వివాదంపై డిసెంబర్ 5 నుంచి తుది విచారణ జరపాలని సుప్రీంకోర్టు శుక్రవారం నిర్ణయించింది. గంటన్నరకు పైగా జరిగిన విస్తృత సంప్రదింపుల తరువాత అత్యున్నత న్యాయస్థానం తుది విచారణ తేదీలను ఖరారు చేసింది. రామజన్మభూమి– బాబ్రీ మసీదు స్థలం ఎవరిది అనే అంశంపై వ్యాజ్యాలు సాగుతూ వస్తున్నాయి. 2010 సంవత్సరంలో అలహాబాద్ హైకోర్టు దీనికి సంబంధించి తీర్పు వెలువరించింది. అయితే దీనికి వ్యతిరేకంగా పలు అప్పీళ్లు, ప్రతి అప్పీళ్లు దాఖలు అయ్యాయి. వీటికి సంబంధించి తుది విచారణను డిసెంబర్‌లో చేపట్టాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఇందులో వాయిదాల ప్రసక్తి ఉండబోదని ధర్మాసనం తెలిపింది. అలహాబాద్ హైకోర్టు వెలువరించిన తీర్పు మేరకు అయోధ్యలో వివాదాస్పద 2.77 ఎకరాల భూమిని మూడుగా విభజించాలని పేర్కొన్నారు. సున్నీ వక్ఫ్‌బోర్డు, నిర్మోహీ అకారా, రామ్‌లల్లాకు సమానంగా మూడు భాగాలుగా ఈ భూమి చెందాల్సి ఉందని తీర్పులో తెలిపారు.

అయితే దీనిపై పిటిషన్లు దాఖలు కావడంతో అయోధ్య వివాదం తెగకుండా ఉంది. అయోధ్యవివాదంపై ప్రత్యేకంగా ఏర్పాటు అయిన జస్టిస్ దీపక్ మిశ్రా నాయకత్వంలోని ధర్మాసనం తుది విచారణ గురించి ప్రకటించడం కీలకంగా మారింది. సంబంధిత కక్షిదార్లు అంతా తుది విచారణకు సంబంధించి ధర్మాసనం ఖరారు చేసే షెడ్యూల్‌కు కట్టుబడి ఉండాల్సిందేనని , ఏ కారణంతో కూడా దీనిని వాయిదా వేసే ప్రసక్తే లేదని ధర్మాసనం తెలిపింది. దీపక్ మిశ్రాతో పాటు ఈ ధర్మాసనంలో అశోక్ భూషన్, అబ్దుల్ నజీర్ సభ్యులుగా ఉన్నారు. అయోధ్య వివాదం, అలహాబాద్ తీర్పునకు సంబంధించిన పత్రాలన్నింటినీ పది వారాల వ్యవధిలో ఆంగ్లంలోకి తర్జుమా చేయాలని, తగు సాక్ష్యాలను కూడా పొందుపర్చాలని అత్యున్నత న్యాయస్థానం ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాన్ని ఆదేశించింది.

గోరఖ్‌పూర్‌లో ఘోరం

(మొదటిపేజీ తరువాయి)

మిగిల్చింది. బాలల మరణానికి దారితీసిన కారణాలను కలెక్టర్ తెలియచేయలేదు. అయితే ఆసుపత్రిలో సరైన రీతిలో ఆక్సిజన్ ఇతర సౌకర్యాలు లేకపోవడంతో బాలలు అకాలమరణానికి గురయినట్లు వెల్లడవుతోంది. నవజాత శిశువుల విభాగంలో ఏడుగురు, ఎఇఎస్ వార్డులో ఇద్దరు , జనరల్ వార్డులో ఇద్దరు గత అర్ధరాత్రి నుంచి చనిపొయ్యారని కలెక్టరు వివరించారు. ఇక ఈ నెల 9–10 తేదీల మధ్యలో 23 మంది మృతి చెందారు. ఇంత భారీ సంఖ్యలో పిల్లల మరణాలపై కారణాలు తెలియలేదని, ఓ దర్యాప్తు కమిటీని ఏర్పాటు చేసినట్లు, శనివారం సాయంత్రానికి నివేదిక అందనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఆసుపత్రికి అవసరమైన ఆక్సిజన్‌ను సమీపంలోని సంత్ కబీర్ నగర్ జిల్లా ఆసుపత్రుల నుంచి తెప్పిస్తున్నట్లు చెప్పారు. రెండు రోజుల క్రితమే ముఖ్యమంత్రి గోరఖ్‌పూర్‌ను సందర్శించి వెళ్లారు. ఇప్పుడు స్థానికంగా ఈ దారుణం జరిగింది.

చైనా సరిహద్దుల్లో భారీగా భారత సైన్యం



న్యూఢిల్లీ : చైనా సరిహద్దులకు భారీగా భారతీయ సైన్యాన్ని తరలించారు.సిక్కిం, అరుణాచల్‌ప్రదేశ్‌ల వెంబడి ఉండే చైనా సరిహద్దుల పొడవునా సైన్యాన్ని మొహరించడం ఇప్పుడు రక్షణ పరంగా వ్యూహాత్మక కీలక పరిణామంగా మారింది. డోక్లామ్ ప్రతిష్టంభన సాగుతున్న దశలో చైనా నుంచి తీవ్రస్థాయి హెచ్చరికల నేపథ్యంలోనే సైనిక బలగాలను తరలించిన విషయాన్ని సీనియర్ ప్రభుత్వాధికారులు ఇక్కడ ధృవీకరించారు. సరిహద్దుల వెంబడి సైనిక బలగాలు మరింత జాగరూకతతో ఉండాలని ఆదేశాలు వెలువరించినట్లు కూడా అధికారులు తెలిపారు. సిక్కిం నుంచి అరుణాచల్ వరకూ చైనా –భారత్‌ల సరిహద్దులు దాదాపు 1400 కిలోమీటర్ల పొడవునా ఉన్నాయి. డోక్లామ్‌పై చైనా ప్రదర్శిస్తున్న దూకుడు ధోరణిని పరిశీలనలోకి తీసుకుని సైనికబలగాలను తరలించాలనే నిర్ణయం తీసుకున్నట్లు అధికార వర్గాలు పిటిఐ వార్తా సంస్థకు తెలిపాయి. భారతీయ సైన్యానికి చెందిన సుక్నా స్థావర దళాలు, అరుణాచల్, సిక్కింలలోని దళాలను తూర్పు రంగంలో సునిశితమైన సరిహద్దుల రక్షణ బాధ్యతను తీసుకోవాలనే ఆదేశాలు కూడా వెలువరించారు. ఎంత మంది సైనికులును సరిహద్దులలోకి తరలించిందీ వివరాలను అధికారులు వెల్లడించలేదు. అయితే దాదాపు 50 వేల మంది వరకూ అదనపు సైనికులను సిద్ధం చేసి ఉంచినట్లు వెల్లడైంది. సైనిక బలగాలు ఈ సరిహద్దులలో వాతావరణ , ఇతర అన్ని కీలక అంశాలను జాగ్రత్తగా పరిశీలిస్తున్నారు.

వెంకయ్య పదవీ స్వీకారం

(మొదటిపేజీ తరువాయి)

రాజకీయ నాయకులు హాజరయ్యారు. తెల్లని చొక్కా, పంచెకట్టుతో ఆయన శాంతి కపోతంలా ఈ కార్యక్రమానికి హాజరై హిందీ భాషలో ప్రమాణం చేశారు. వెంకయ్య 15వ ఉప రాష్ట్రపతి కాగా, ఈ పదవిని అలంకరించిన వ్యక్తుల్లో 13వ వ్యక్తి కావడం గమనార్హం. అంతకుముందు ఈ పదవిని హమీద్ అన్సారీ, ఎస్.రాధాకృష్ణన్ వరుసగా రెండేసి పర్యాయాలు చేపట్టారు. ప్రధాని నరేంద్ర మోడీ, మాజీ ఉప రాష్ట్రపతి అన్సారీ, లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్, మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్, రాజ్యసభలో విపక్ష నేత గులాం నబీ ఆజాద్, బిజెపి కురువృద్ధ నేత లాల్‌కృష్ణ అద్వానీ, పలువురు కేంద్ర మంత్రులు, గవర్నర్లు, ముఖ్యమంత్రులతో పాటు ఎస్‌పి నేత ములాయం, ఎన్‌సిపి నేత తారీఖ్ అన్వర్, సిపిఐ నేత డి.రాజా, టిఎంసి నేతలు సుదీప్ బందోపాధ్యాయ్, డిరెక్ ఓబ్రీన్, అన్నాడిఎంకె నేత ఓ.పన్నీర్‌సెల్వం కూడా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఢిల్లీ సిఎం కేజ్రీవాల్, బీహార్ సిఎం నితీశ్ కుమార్ కూడా హాజరయ్యారు. మరోవైపు రాజ్యసభ ఛైర్మన్‌గా కూడా ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వెంకయ్య తనదైన శైలిలో సభ్యులనుద్దేశించి ప్రసంగించారు. సభలో ప్రజా సమస్యలపై చర్చించాలని, సంప్రదింపులు జరపాలని, నిర్ణయాలు తీసుకోవాలని ఆయన ఈ సందర్భంగా సభ్యులను కోరారు. మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీని కలిసినపుడు ఆయన ఈ మాట తనకు చెప్పారని వెంకయ్య అన్నారు. గందరగోళ పరిస్థితులను సృష్టించరాదని ఆయన హితవు పలికారు. సభలో గందరగోళ పరిస్థితుల నడుమ చట్టాలను తాను ఆమోదించనని ఆయన స్పష్టం చేశారు. పలువురు సభ్యులు చేసిన వినతుల మేరకు ఆయన ఇలా హామీ ఇవ్వడం గమనార్హం. ప్రశాంత పరిస్థితుల్లోనే బిల్లులు ఆమోదం పొందాలని ఆయన అన్నారు. వివిధ పార్టీలకు చెందిన సభ్యులు రాజకీయ ప్రత్యర్థులే గానీ శత్రువులు కారని ఆయన చెప్పారు. సభ్యులంతా తమ ఆలోచనలు, సిద్ధాంతాలకు అనుగుణంగా దేశ పురోగతికి కృషి చేయాలని ఆయన కోరారు. తాను ఒక సాధారణ కుటుంబం నుండి వచ్చానని, తనకు ఎలాంటి రాజ వంశం మద్దతు లేదని ఆయన వ్యాఖ్యానించారు. తానిపుడు పార్టీలకు అతీతంగా అందరివాడినని ఆయన చెప్పుకొచ్చారు. సంఖ్యాబలంతో పనిలేకుండా రాజ్యసభలో అన్ని పార్టీలకు ముఖ్యమైన సమస్యలపై మాట్లాడే అవకాశం కల్పిస్తానని ఆయన హామీ ఇచ్చారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో విపక్షానికి గొంతుక ఉండితీరాలని ఆయన చెప్పుకొచ్చారు. విపక్షంలో ఉన్నప్పుడు రోజులను ఆయన ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. అప్పట్లో తాను విమర్శకుడిగా ఉన్నప్పటికీ, హద్దులు మీరలేదని ఆయన అన్నారు. కీలక సమస్యలపై మాట్లాడే అవకాశం తమకూ కల్పించాలంటూ చిన్న పార్టీలు విజ్ఞప్తి చేసిన నేపథ్యంలో ఆయన ఈ మేరకు చెప్పడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

సంచలనాత్మకతను వీడండి

రాజ్యసభ ఛైర్మన్ హోదాలో ఉప రాష్ట్రపతి వెంకయ్య సంచలనాత్మకతను వీడాలని, సభలో నిర్మాణాత్మక చర్చలపై మరింత దృష్టి సారించాలని మీడియాకి సూచించారు. తాను ఎంపిగా ఉన్న రోజుల్లో దేశంలో వ్యవసాయ సంబంధిత సమస్యలపై చేసిన ప్రసంగానికి ఇతర సభ్యులు తనను మెచ్చుకున్నారని, అయితే మరుసటి రోజు ఒక్క వార్తా పత్రిక మినహా మిగిలినవన్నీ తనను విస్మరించాయన్న సంగతి తెలిసి ఆశ్చర్యానికి గురయ్యానని ఆయన చెప్పుకొచ్చారు. ఆ ఒక్క పత్రిక కూడా వ్యవసాయ సమస్యలపై వెంకయ్య వాగ్ధాటితో మాట్లాడారంటూ ఒక్క పంక్తిలోనే ముగిసించి వేసిందని ఆయన విమర్శించారు.

వెంకయ్య ఎదుగుదల ప్రజాస్వామ్యానికే గౌరవం : మోడీ

నిరాడంబరమైన, గ్రామీణ నేపథ్యాల నుండి ఉన్నత శిఖరాలను వ్యక్తులు అధిరోహించడం భారతదేశ ప్రజాస్వామ్య వ్యవస్థకు దక్కిన గౌరవమని ప్రధాని మోడీ అన్నారు. వెంకయ్య నాయుడు వ్యవసాయ కుటుంబం నుండి అంచెలంచెలుగా ఎదిగి ఉప రాష్ట్రపతి పదవితో పాటు రాజ్యసభ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఆయన ఈ రకంగా ప్రశంసించడం గమనార్హం.

స్ఫూర్తి యాత్ర భగ్నం

(మొదటిపేజీ తరువాయి)

పలువురు నేతలను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా జెఎసి కార్యకర్తలకు, పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. దీంతో కొంతసేపు బిక్కనూర్ పోలీసుస్టేషన్ ఎదుట ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. కోదండరామ్‌ను అరెస్టు చేసిన పోలీసులు ఆయనను డిఎస్‌పి ఆధ్వర్యంలో హైదరాబాద్ తరలించారు. ఒకవైపు టిఆర్ఎస్ కార్యకర్తలు.. మరోవైపు పోలీసులు యాత్రను నిలువరించే ప్రయత్నం చేశారు. యాత్ర కామారెడ్డి జిల్లాలోని బస్వాపూర్‌కు చేరుకోగా టిఆర్ఎస్ కార్యకర్తలు అడ్డుకొని జెఎసికి, కోదండరామ్‌కు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం యాత్ర బిక్కనూర్, దోమకొండ, తదితర పట్టణాల గుండా కామారెడ్డికి చేరుకుంది. కామారెడ్డి మున్సిపల్ కార్యాలయం ఎదుట జెఎసి సభా స్థలిని ఏర్పాటు చేశారు. జిల్లా నలుమూలల నుండి సభకు జనం తరలివచ్చారు. అదే సమయంలో తెలంగాణ వ్యతిరేకి కోదండరామ్ గోబ్యాక్ అంటూ టిఆర్ఎస్ కార్యకర్తలు ప్లకార్డులు ప్రదర్శిస్తూ సభా స్థలికి చేరుకున్నారు. దీంతో జెఎసి నేతలు కూడా టిఆర్ఎస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. ఇరువర్గాలను పోలీసులు శాంతింపజేసే ప్రయత్నం చేసినప్పటికీ టిఆర్ఎస్ కార్యకర్తలు మూకుమ్మడిగా జెఎసి నేతలపై, విద్యార్థులపై దాడికి పూనుకోవడంతో ఆ ప్రాంతమంతా రణరంగంగా మారింది. మున్సిపల్ కార్యాలయానికి వచ్చిన ప్రజలు ఈ సంఘటనతో భయభ్రాంతులై పరుగులు తీశారు. మరోవైపు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

ఇరువర్గాలు కుర్చీలు, కోడిగుడ్లు, టమాటోలతో దాడి చేసుకున్నారు. టిఆర్ఎస్ నాయకులు చేసిన దాడిలో ముగ్గురు జెఎసి విద్యార్థి సంఘాల నాయకులు పృధ్వీరాజ్ (28), ప్రకాశ్‌నాయక్ (32), సందీప్ (36)లకు తీవ్ర గాయాలు కాగా వారిలో పృధ్వీరాజ్ పరిస్థితి విషమంగా ఉండటంతో హుటాహుటిన ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి అదుపులో లేదని చెప్పడంతో అక్కడి నుంచి హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. ప్రకాశ్‌నాయక్, సందీప్‌లను జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ సందర్భంగానే సభా స్థలిని టిఆర్ఎస్ వర్గాలు కూలదోశాయి. ఈ సంఘటనతో టిఆర్ఎస్ నాయకులపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గొడవలు మరింత పెరగకుండా ఎస్‌ఐలు రాజాగౌడ్, సంతోష్, డివిజన్ పరిధిలోని పలు మండలాలకు చెందిన ఎస్‌ఐలు అడ్డుకున్నప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. అనంతరం మరికొంత సేపు దాడులు కొనసాగాయి. కొంతసేపటి అనంతరం గొడవ సద్దుమణగగా జెఎసి నాయకులు సభా స్థలి వద్దకు చేరుకుని ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర రైతు సంఘం జెఎసి నాయకుడు రవి మాట్లాడుతూ సభా స్థలిపై దాడి చేసి కూల్చివేయడం హేయమైన చర్య అన్నారు. జెఎసి కార్యకర్తలు మున్సిపల్ ఆవరణలో ఉన్న అంబేద్కర్ విగ్రహం ముందు నల్లగుడ్డలు ధరించి మౌన దీక్ష నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నేతలను పరామర్శించారు. తమపై దాడికి పూనుకున్న నిందితులను రేపటిలోగా అదుపులోకి తీసుకోకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

అప్రజాస్వామికం : సిపిఐ

మన తెలంగాణ / హైదరాబాద్ : అమరుల స్ఫూర్తియాత్ర చేస్తున్న జెఎసి చైర్మన్ ప్రొఫెసర్ కోదండరామ్‌ను టిఆర్ఎస్ కార్యకర్తలు అడ్డుకోవడం, పోలీసులు అరెస్టు చేయడం అప్రజాస్వామికమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి అన్నారు. కామారెడ్డిలో జెఎసి బహిరంగసభకు హాజరైన ఎఐఎస్ఎఫ్, తదితర విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులపై టిఆర్ఎస్ కార్యకర్తలు రాళ్ళతో దాడిచేయడాన్ని తీవ్రంగా ఖండించారు. బహిరంగసభ వేదిక ,టెంట్లను టిఆర్ఎస్ కార్యకర్తలు కూల్చివేస్తుంటే పోలీసులు ప్రేక్షకపాత్ర వహించడమంటే స్వామిభక్తిని ప్రదర్శించడమేనని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతిపక్షాలు, ప్రజా సంఘాలపై అధికార పార్టీ కార్యకర్తలు దాడి చేయడం హింసను ప్రోత్సహించడమే అవుతుందన్నారు. కెసిఆర్ ఒకవైపు బంగారు తెలంగాణ అంటూ మరోవైపు 'గాయాల తెలంగాణ'గా మార్చడం నియంతృత్వ పోకడలకు అద్దం పడుతుందని విమర్శించారు.

ప్రజాస్వామిక స్ఫూర్తికి విఘాతం : సిపిఐ(ఎం)

టిజెఎసి ఛైర్మన్ కోదండరామ్ 'అమరవీరుల స్ఫూర్తి యాత్ర'ను టిఆర్ఎస్ కార్యకర్తలు బస్వాపూర్‌లో అడ్డుకుని దాడి చేయడాన్ని సిపిఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తీవ్రంగా ఖండించారు. యాత్రకు సంఘీభావం పలికిన విద్యార్థులను కూడా వదలకుండా పోలీసులు లాఠీఛార్జి చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతం కలిగించడంతో పాటు, ప్రజా ఉద్యమాల పట్ల ప్రభుత్వ నిరంకుశ వైఖరిని తెలియజేస్తుందని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం ఉద్యమాల పట్ల ప్రభుత్వ నిరంకుశ వైఖరిని విడనాడనట్లయితే ప్రజలనుండి ప్రతిఘటన తప్పదని ఆయన హెచ్చరించారు.

ప్రజాస్వామ్యం ఖూనీ

టిజెఎసి చైర్మన్ కోదండరామ్ నిర్వహిస్తున్న స్ఫూర్తియాత్రపై దాడిని సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. దోషులను తక్షణమే అరెస్టు చేయాలని ఆ పార్టీ తెలంగాణ విభాగం రాష్ట్ర కార్యదర్శి డివి కృష్ణ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మూడు దఫాలుగా విజయవంతంగా స్ఫూర్తి యా త్రలు పూర్తిచేసి, నాలుగో విడత యాత్రను కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాలో చేపట్టారని కృష్ణ అన్నారు.ఈ యాత్రను కామారెడ్డి జిల్లా బసవాపూర్ వద్ద టిఆర్ఎస్ కార్యకర్తలు అడ్డగించారని, ఆ తర్వాత బిక్నూర్‌లో దాడి చేసి టెంట్‌ను చించివేశారని, కార్యకర్తలపై దాడి చేశారని, పూర్తిస్థాయి అనుమతులు తీసుకొని యాత్ర చేస్తుంటే, రక్షణ ఇవ్వలేమని చెబుతూ పోలీసులు అడ్డుకోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు.దాడి చేసిన వారిని కాకుండా, యాత్రలో ఉండి దాడికి గురైన వారిని అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ, ప్రభుత్వం నిరంకుశ వైఖరిని ప్రదర్శిస్తోందని, స్వేచ్ఛను హరిస్తోందని కృష్ణ విమర్శించారు.

దశవర్ష దిశ

(మొదటిపేజీ తరువాయి)

ఫజీయుద్దీన్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్‌కె జోషి, ముఖ్య కార్యదర్శులు నర్సింగ్‌రావు, రామకృష్ణ, నవీన్ మిత్తల్, జిహెచ్ఎంసి కమిషనర్ జనార్ధన్‌రెడ్డి, హెచ్ఎండిఎ కమిషనర్ చిరంజీవులు, జలమండలి కమిషనర్ దానకిషోర్, పిసిసిఎఫ్ పికె ఝా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ ' హైదరాబాద్ నగరం శరవేగంగా పెరుగుతున్నది. పెరిగే జనాభాకు తగ్గట్లుగా అవసరాలు కూడా పెరుగుతాయి. వీటిని దృష్టిలో పెంచుకొని మనం ప్రణాళికలు వేయాలి. రాబోయే 30 ఏళ్లకు ఈ నగరం ఎలా ఉంటుంది, జనాబా ఎంత పెరుగుతుంది. అప్పుడు ఏర్పడే అవసరాలేంటి, ఎలా చేయాలి అని ఆలోచించాలి. దానికి అనుగుణంగా ఇప్పటి నుంచే ఏర్పాట్లు చేసుకోవాలి. కనీసం పదేళ్ల యాక్షన్ ప్లాన్ తయారు చేయాలి. ఇప్పటి నుంచి చేసే ప్రతి పని ఆ ప్రణాళికలో భాగంగా ఉండాలని' సిఎ నిర్దేశించారు. ప్రజలకు నిరంతరం కరెంటు ఇవ్వడమే తొలి ప్రాధాన్యత ఇచ్చాం. ఇందులో విజయం సాధించాం. మిగులు విద్యుత్ రాష్ట్రంగా మార్చేందుకు ప్రాజెక్టులు నిర్మిస్తున్నాం. రైతులకు సాగునీరు అందివ్వడం కోసం ప్రాజెక్టులు కడుతున్నాం. విద్యుత్, నీటిపారుదల ప్రాజెక్టులు బాగా సాగుతున్నాయి. ఇక ప్రజలకు మౌళిక సదుపాయాలు అందించే విషయంలో ప్రభుత్వం దృష్టి కేంద్రీకరిస్తుంది. రాష్ట్రంలో నగరాలు, పట్టణాల్లో నివసింజే జనాభా విపరీతంగా పెరుగతుంది. దీనికి అనుగుణంగా వసతులు కల్పించాలి. ముఖ్యంగా హైదరాబాద్ నగరంలోనే కోటి జనాభా ఉంది. దీనిపై ఎక్కువ దృష్టి పెట్టాలి. ప్రణాళికాబద్ధంగా పనులు చేసుకుంటూ పోవాలి.' అని సిఎం సూచించారు. హైదరాబాద్ మంచినీటి సరఫరాకు శాశ్వత ప్రాతిపదికన రెండు రిజర్వాయర్లు నిర్మించాలి. గోదావరి నదిపై కడుతున్న కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఒక రిజర్వాయర్‌ను, కృష్ణా నదిపై కడుతున్న పాలమూరు ఎత్తిపోతల ద్వారా మరో రిజర్వాయర్‌ను నింపాలి. గ్రావిటీ ద్వారా నీరు సరఫరా చేసి, 10 నుంచి 15 టిఎంసిల నీరు నిల్వ ఉండే విధంగా రిజర్వాయర్లు నిర్మించాలి. దీని కోసం సాంకేతిక అంశాలను పరిశీలించి, వెంటనే పనులు ప్రారంభించాలి. నగరం కాంక్రీట్ జంగల్‌గా మారుతోంది. పచ్చదనం పెంచాల్సిన అవసరం ఉంది. నగరం చుట్టూ ఉన్న వేలాది అటవీ భూముల్లో విరివిగా చెట్లు పెంచాలి. నాగోల్, నారపల్లి ప్రాంతాల్లో దాదాపు ఏడెనిమిది వేల ఎకరాల అటవీ భూమి ఉంది. శంషాబాద్ విమానాశ్రయం ప్రాంతంలో రింగ్ రోడ్డు అవతర మరో 16 వేల ఎకరాల అటవీభూమి ఉంది. నర్సాపూర్, శిశంపేట ప్రాంతంలో దాదాపుగా 40 వేల ఎకరాల అటవీభూమి ఉంది. నగరంలో కూడా చాలా ప్రాంతాల్లో అటవీభూమి ఉంది. వీటన్నింటిలో పెద్ద ఎత్తున మొక్కలు నాటాలి. వాటిని పెంచాలి. ఔటర్ రింగ్‌రోడ్డు పొడవునా ఇరువైపులా వేప, గుల్మోర్, రావి చెట్లు నాటాలి. డిల్లీలో మాదిరిగా హైదరాబాద్‌లో పచ్చదనం ఉండాలి. మునిసిపల్ మంత్రి పేషీలో కేవలం పచ్చదనం పెంచే కార్యక్రమం కోసం ప్రత్యేకంగా ఒక ఐఎఫ్ఎస్ అధికారిని ఓఎస్‌డిగా నియమించాలి. నగరాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం ఉండాలి. ఇందుకోసం బస్తీ కమిటీలు వేయాలి. ప్రతి డివిజన్‌కు 10 కమిటీలు ఉండాలి. 15 రోజుల్లోగా కమిటీల నియామకం కావాలి. ప్రజలందరినీ కలుపుకొని బస్తీల్లో పచ్చదనం పెంచడం, పరిశుభ్రత కాపాడడం తదితర విషయాల్లో ఆ కమిటీలు కీలకంగా పనిచేయాలి. గండిపేట, హిమాయత్‌సాగర్, శామీర్‌పేటతో పాటు నగరంలో, నగరం చుట్టూ అనేక చెరువులు ఉన్నాయి. వాటిలో పారిశ్రామిక వ్యర్థాలు, ఇతర కాలుష్యం లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి. మురికినీరు చెరువుల్లో చేరకుండా ప్రత్యేక కాలువలు నిర్మించాలి. నగరంలో కొత్తగా కట్టే నిర్మాణాలకు అనుమతులు ఇచ్చే సందర్భంలో అధికారులు ఖచ్చితంగా నిబంధనలు పాటించాలి. తప్పులు చేస్తే కఠిన చర్యలు ఉంటాయి. సబర్మతి రివర్ ఫ్రంట్ తరహాలో మూసీ రివర్ ఫ్రంట్‌ను అభివృద్ధి చేయాలి. మూసీ నదిలో మురికి నీరు చేరకుండా చూడాలి. మురికి నీరు పోవడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి. మూసీకి రెండు వైపులా ఉద్యానవనాలు అభివృద్ధి చేయాలి. మూసీ మీదుగా ఓఆర్ఆర్ నుంచి ఓఆర్ఆర్ వరకు రహదారి నిర్మించాలి. మూసీ దాటడానికి పలు చోట్ల వంతెనలు నిర్మించాలి. ఎస్ఆర్‌డిపిల భాగంగా నిర్మించే పెట్టుకొని విద్యుత్ సరఫరా వ్యవస్థను పటిష్టం చేయాలి. ఎస్ఆర్‌డిపిలో భాగంగా నిర్మించే రహదారుల విషయంలో కూడా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలి. ఉప్పల్ లాంటి ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉన్న ప్రాంతాలకు ప్రాధాన్యత ఇవ్వాలి. అండర్‌పాస్‌లు నిర్మించే సందర్భంలో వర్షం, వరద నీరు నిల్వ ఉండకుండా ఉండేందుకు అవసరమైన సాంకేతిక జాగ్రత్తలు తీసుకోవాలి.

భారీ వర్ష సూచన

(మొదటిపేజీ తరువాయి)

పొంచివుంది. ఒడిశా నుంచి దక్షిణ తమిళనాడు వరకు కోస్తాంధ్ర మీదుగా ద్రోణి ఆవరించివుంది. ఫలితంగా వచ్చే నాలుగు రోజుల్లో పలు చోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని వైకె రెడ్డి పేర్కొన్నారు. ఆగస్టు 14, 15 తేదీల్లో భారీవర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిసారు. ఇదిలా ఉండగా గత 24 గంటల్లో ఖమ్మం జిల్లా గుండాలలో 6 సెంటీమీటర్ల అత్యధిక వర్షం కురిసింది. మణుగూరు, ఎంకూరులో 4, సిర్పూర్, మంచాల్, మక్లూరు, ఖమ్మం అర్బన్, డిచ్‌పల్లిలో 3 సెంటీమీటర్ల వర్షం కురిసింది. శుక్రవారం నాడు భద్రాచలంలో 34.2, హన్మకొండలో 34, రామగుండంలో 33.8, ఖమ్మం, ఆదిలాబాద్‌లో 33.6 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది.

లెక్క తప్పింది

(మొదటిపేజీ తరువాయి)

వృద్ధి రేటు 6.75 శాతం– 7.5 శాతం సాధించడం కష్టమే అని ఈ నివేదికలో తేల్చిచెప్పారు. ఈ ఆర్థిక సర్వేను ప్రభుత్వ ఆర్థిక ప్రధాన సలహాదారుడు అరవింద్ సుబ్రమణియన్ రూపొందించారు. అనుకున్న విధంగా ఆర్థిక ప్రగతి ఉండే అవకాశాలు లేవని, ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి మరింతగా వడ్డీరేట్ల తగ్గింపు అవసరం అని సూచించారు. ఆర్థిక రంగ సవాళ్లను ఈ సర్వే పత్రంలో ఉటంకించారు. రూపాయి విలువ పెరగడంతో ఉత్పన్నమవుతోన్న సమస్యలు, వ్యవసాయ రుణాల మాఫీ, విద్యుత్, టెలికాంలో బ్యాలెన్స్ షీట్లపై ఒత్తిళ్లు, జిఎస్‌టి అమలుతో తలెత్తుతున్న పరిణామదశ అంశాలు అనేవి పలు విధాలుగా సవాళ్లకు దారితీస్తున్నాయి. ప్రత్యేకించి వ్యవసాయ రుణాల మాఫీ ప్రభావం ఆర్థిక వ్యవస్థపై భారీగా పడుతోందని విశ్లేషించారు. జడిపి వృద్ధి రేటు లక్ష్యంపై దీని ప్రభావం కనీసం 0.7 శాతం మేర గండికొడుతుందని తెలిపారు.ఇప్పటికి ఇంకా పుంజుకోని దశలోనే ఉన్న ఆర్థిక, ద్రవ్య వ్యవస్థపై పలు విధాలుగా తిరోగమన ప్రభావాలు పడనున్నాయని సర్వేలో హెచ్చరించా రు. పలు ఆర్థిక తప్పిదాలు ఇందుకు కారణంగా నిలిచాయని విశ్లేషించారు.

రుణమాఫీల మొత్తం రూ 2.7 లక్షల కోట్లు

రాష్ట్రాలకు సంబంధించి పంట రుణాలు, ఇతరత్రా వ్యవసాయ రుణాల మాఫీ మొత్తం కలిపితే రూ 2.7 లక్షల కోట్లకు చేరింది. అయితే ద్రవ్యోల్బణం రిజర్వ్ బ్యాంక్ అంచనాల మేరకు మధ్యస్థంగా 4 శాతానికి తక్కువగానే ఉంటుందని తెలిపారు. గత ఆర్థిక సంవత్సరపు ద్రవ్యలోటు 3.5 శాతంతో పోలిస్తే 2017–18 ఆర్థిక సంవత్సరంలో జిడిపిలో ద్రవ్యలోటు 3.2 శాతంగా ఉంటుందని అంచనా వేశారు. రెపోరేటు తటస్థ స్థాయి కన్నా ఎక్కువగా 25–75 ప్రాతిపదికన ఉంది. దీనితో ద్రవ్య విధానం సరళీకృతం అయ్యేందుకు వీలేర్పడుతుంది. గత వారం ఆర్‌బిఐ తమ ప్రధాన పాలసీ రేట్లను తగ్గించింది. 2010 నవంబర్ నుంచి చూస్తే ఇది అత్యంత తక్కువ. ద్రవ్య సరళీకృతం చాలా కీలకమైన పరిణామం అవుతుందని తెలిపారు. ఇక ప్రతికూల పరిస్థితుల గురించి ఇందులో విశ్లేషించారు. పంట రుణాల రద్దుతో పాటు వ్యవసాయపరంగా ఆదాయం పడిపోవడం , తృణేతర ధాన్యాల ధరలు పడిపోవడం, ద్రవ్య కటుతర విధానాలు, విద్యుత్, టెలికాం రంగాలలో లాభాలు తగ్గడం వంటివి ఆర్థిక ప్రగతికి ప్రమాద సంకేతాలు అని విశ్లేషించారు. ఇప్పటికీ ఆర్థిక పరిస్థితి కోలుకోలేదని స్పష్టం చేశారు. జిడిపి, ఐఐపి, క్రెడిట్ ఆఫ్‌టేక్, పెట్టుబడులు, సామర్థ్య వినియోగం వంటి పలు సూచీకలు ఆర్థిక సంవత్సరంలో వాస్తవిక పురోగతి క్షీణతను తెలియచేస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది జనవరి 31న ఆర్థిక సర్వే తొలి విడతను ప్రవేశ పెట్టారు. రెండు భాగాలుగా ఆర్థిక సర్వే నివేదికను పార్లమెంట్‌కు సమర్పించడం ఇదే తొలిసారి. అప్పటి నివేదికలో జిడిపి వృద్ధిరేటు 6.75 శాతం –7.5 శాతం మధ్యలో ఉంటుందని అంచనా వేశారు. ఆ తరువాత అంటే ఫిబ్రవరి తరువాత జరిగిన పరిణామాలు ఆర్థిక రంగంపై ప్రభావం చూపాయని పేర్కొన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి రూపాయి విలువ పెరుగుతూ వచ్చింది. ఇది దాదాపు ఒకటిన్నర శాతం పెరిగింది. దీని ప్రభావం పెట్టుబడుల రాకపై పడిందని విశ్లేషించారు.

జిఎస్‌టి అమలు అనంతర పరిస్థితి

ప్రభుత్వం చేపట్టిన వ్యవస్థీకృత సంస్కరణల అంశాలను కూడా సర్వేలో ప్రస్తావించారు. . జిఎస్‌టి అమలు, ఎయిర్ ఇండియా ప్రైవేటీకరణ, ఇంధన సబ్సిడీల క్రమబద్ధీకరణం, బ్యాంక్‌లు ఎదుర్కొంటున్న ట్విన్ బ్యాలెన్స్ షీట్ల సమస్య పరిష్కార చర్యలువంటివి కీలక సంస్కరణలు అని పేర్కొన్నారు. కాలక్రమంలో పాతనోట్ల రద్దు ప్రయోజనాలు కొనసాగుతూ వస్తున్నాయని, నామమాత్రపు జిడిపి వృద్ధిరేటు పెద్ద నోట్లరద్దు తరువాతనే నమోదు అయిందని తెలిపారు. జిఎస్‌టి అమలు తరువాత పన్నుల వ్యవస్థ బలోపేతం అవుతోన్న దాఖలాలు కన్పిస్తున్నాయి. నోట్ల రద్దు ప్రక్రియతో తీసుకున్న చర్యలతో దాదాపు 5.4 లక్షల మంది కొత్త పన్ను చెల్లింపుదార్లు పన్నుల వ్యవస్థలో ఇమిడిపొయ్యారని వెల్లడించారు. చెక్‌పోస్టుల తొలిగింపు , సరుకుల రవాణా అవరోధాల నిర్మూలన వంటి చర్యలు ఆర్థిక వ్యవస్థకు తాత్కాలిక పోషకాలుగా మారుతాయని నివేదికలో తెలిపారు.

ఆరోగ్య, విద్యారంగాలపై వ్యయం పెంచాలి

దేశంలో సామాజిక సేవలకు వ్యయం రూ 11,18,094 కోట్లకు చేరుకుని 11 శాతం మేర గతంతో పోలిస్తే హెచ్చింపు ఉంది. అయితే సామాజిక మౌలికవ్యవస్థకు కేటాయింపులు పెరగాల్సి ఉందని, ప్రత్యేకించి వైద్య, ఆరోగ్య, విద్యా సేవలకు పెట్టుబడులు పెంచాల్సి ఉందని సర్వేలో తెలిపారు. విజ్ఞాన ప్రాతిపదిక ఆర్థిక వ్యవస్థగా ఎదగాలంటే ఆయా రంగాలకు పెట్టుబడుల పెంపు అవసరం అని సూచించారు. దేశ సామాజిక విధానాలు సంక్షేమ దిశలోనే ఉన్నాయని అయితే ఇప్పటికీ సామాజిక, ఆర్థిక అసమానతలను అధిగమించాల్సి ఉందని స్పష్టం చేశారు. అణగారిన వర్గాలు, మహిళలు, సమాజంలోని ఇతర వెనుకబడిన వర్గాల వారికి తగు విధంగా పరిపుష్టిని కల్పించాల్సి ఉందని , ఈ క్రమంలో చర్యలు తీసుకోవాలని సూచించారు. రెండంకెల జిడిపి వృద్ధిరేటును చేరుకున్న విజ్ఞాన ఆధారిత ఆర్థిక వ్యవస్థ తగు విధంగా అన్ని లక్షణాలను సంతరించుకోవల్సి ఉందని, ఇందుకు కీలకమైనది విద్యా, వైద్య రంగాలకు ఎక్కువ కేటాయింపులు జరపడం అని తెలిపారు.



పోలీసులను కూడా వదిలిపెట్టం : నాగం

మనతెలంగాణ/నాగర్‌కర్నూల్: ప్రతి విషయానికి పోలీసులు వస్తూ , అన్యాయంగా తమ కార్యక ర్తలపై కేసులు పెడితే చూస్తూ ఊరుకోబోమని, పోలీసులను కూడా వదిలిపెట్టే ప్రసక్తే లేదని ఈ సమావేశంలో కూడా పోలీసులు ఉండి ఉంటారని, తాను మాట్లాడిన విషయాలన్ని పై అధికారులకు చేరవేస్తారని, అయినా తాను భయపడబోనని బిజెపి జాతీయ కార్యవర్గసభ్యుడు నాగం జనార్ధన్ రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రం లోని వెలమ ఫంక్షన్ హాల్ లో జరిగిన నాగర్‌కర్నూల్ పట్టణ, మండల బూత్ స్థాయి కార్యకర్తల సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సంద ర్భంగా నాగం మాట్లాడుతూ కెఎల్‌ఐ ప్రాజెక్టును రూపకల్పన చేసింది తానేనని, కెఎల్‌ఐ నిర్మించ డానికి తానే కృషిచేసానని, ఈ ప్రాజెక్టు పై ఎవరికి హక్కు లేదని అన్నారు. బూత్ కమిటీల ద్వారానే అమిత్ షా పలు రాష్ట్రాల్లో అధికారంలోకి తీసుకొచ్చారని అన్నారు. టిఆర్‌ఎస్ పార్టీని ప్రజలు బొందపెడతారని హెచ్చరించారు. బిజెపి జిల్లా అధ్యక్షుడు నాగం శశిధర్ రెడ్డి, ఉపాధ్య క్షుడు కాశన్న, అర్థం రవి, సింగిల్ విండో చైర్మన్ వెంకట్రాములు, ఎస్సీ మోర్చా అధ్యక్షులు లక్ష్మ య్య, బిజెపి నాయకులు పాలమూరి యాదయ్య, బాలగౌడ్, రాంచంద్రారెడ్డి పాల్గొన్నారు.

ఉద్యమ ద్రోహులదే పెత్తనం

- అధికార యంత్రాంగం అండదండల తోనే ఇసుక దందా, కాంట్రాక్టులు
- ఢిల్లీ వెళ్ళి ప్రజావ్యతిరేక విధానాలను వివరిస్తాం : కోదండరామ్



మనతెలంగాణ/హైదరాబాద్: తెలంగాణ ఉద్యమ సమయంలో తమపై దాడులకు పాల్పడినవారే ఇప్పుడూ దాడులకు పాల్పడ్డారని తెలంగాణ జెఎసి ఛైర్మన్ ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ అన్నారు. తెలంగాణ ఉద్యమ ద్రోహులకు అధికార టిఆర్‌ఎస్ ఒక వేదికగా మారిందని విమర్శించారు. ఉద్యమకారులు పక్కకు పోయి, ఉద్యమ ద్రోహులదే పెత్తనం సాగుతుందని, వారే దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. బిక్కనూర్‌లో కోదండరామ్‌ను అరెస్టు చేసిన పోలీసులు సాయంత్రం హైదరాబాద్‌లోని ఆయన నివాసం వద్ద వదలివెళ్ళారు. అనంతరం తార్నాకాలోని తన నివాసంలో కోదండరామ్ మీడియా సమావేశంలో మాట్లాడారు. ఇసుక దందాలు, కాంట్రాక్టర్లు అధికార యంత్రాంగం అండదండలతోనే సాగుతోందని, ఇసుక దందాలో సిఎం పుత్రులే ఉన్నారని విమర్శించారు. అధికారం శాశ్వతం కాదని, ఎప్పటికీ తామే(టిఆర్‌ఎస్) అధికారంలో ఉంటామనుకోవడం భ్రమ అని వ్యాఖ్యానించారు. జెఎసి యాత్రలను అడ్డుకుంటే ఇక కఠినమైన కార్యాచరణతో ముందుకు సాగుతామని హెచ్చరించారు. దాడికి పాల్పడిన వారిని వదిలి గాయాలైన వారిని అరెస్టు చేయడం అప్రజాస్వామిక చర్య అన్నారు. పోచంపాడు సభలో సిఎం కెసిఆర్ పిలుపునిచ్చిన మరుసటి రోజే తమపై దాడి జరిగిందన్నారు. ఇసుక, భూదందాలు బయటకు వస్తాయనే తమ యాత్రను అధికార పార్టీ నేతలు తమపై దాడి చేశారన్నారు. ఉమ్మడి రాష్ట్రంలోని ఆంధ్రాపాలకులు ఇదే ధోరణి వ్యవహరించిన వారు అధికారంలో లేకుండా పోయారని, టిఆర్‌ఎస్ అదే పద్ధతిని వ్యవహరిస్తోందన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను ఢిల్లీకి వెళ్లి అన్ని పక్షాలకు వాస్తవాలను వివరిస్తామన్నారు. నాల్గవ దశ

త్వరలో భవిష్యత్ కార్యాచరణ

మన తెలంగాణ/కామారెడ్డి: కామారెడ్డిలో జెఎసిపై జరిగిన దాడికి ఎలా స్పందించాలన్న విషయమై భవిష్యత్ కార్యాచరణ త్వరలో ప్రకటిస్తామని తెలంగాణ జెఎసి చైర్మన్ కోదండరామ్ అన్నారు. ఉద్యమ పార్టీగా చెప్పుకుంటున్న టిఆర్‌ఎస్ పార్టీ ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తూ దాడికి దిగడంపై 31 జిల్లాల జెఎసి నాయకులతో చర్చించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. కామారెడ్డి జిల్లా ఎస్పీ శ్వేతారెడ్డి అదేశాల మేరకే ఈ నెల 7వ తేదీన అనుమతి తీసుకున్నామని, దాడి ఘటనపై ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడగా ఆయన మౌనం వహించడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కామారెడ్డి ఘటనకు పోలీసులే బాధ్యత వహిం చాల్సి ఉంటుంద న్నారు. జెఎసి చైర్మన్ జగన్నాథం, అడ్వకేట్ జెఎసి క్యాథం సిద్దిరాములు గోపాల్ శర్మ తదితరులు ఉన్నారు.

చేశారు. ఈ యాత్ర కొనసాగుతుందన్నారు. ఈ సమావేశంలో జెఎసి ప్రతినిధి గోపాలశర్మ, జెఎసిప్రతినిధులు ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తం, భైరి రమేష్, అంబటిశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

101 కిలోల గంజాయి పట్టివేత

- ఆరుగురు నిందితుల అరెస్టు



మన తెలంగాణ/వరంగల్ క్రైం: అక్రమంగా నిల్వ చేసిన రూ.5 లక్షల విలువ చేసే 101 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకొని ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ గొట్టె సుధీర్ బాబు తెలిపారు. కమిషనరేట్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. నిందితులు గత ఏడాది గంజాయి సాగుకు పాల్పడినట్లుగా నార్కోటిక్స్ పోలీస్ అధికారులకు సమాచారం రావడంతో స్థానిక పోలీస్ అధికారుల సహకారంతో నెక్కొండ, నర్సంపేట, శాయంపేట ప్రాంతాల్లో నిందితుల ఇండ్లపై దాడులు నిర్వహించగా రవాణకు సిద్ధంగా ఉన్న గంజాయిని పోలీస్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఇందులో నెక్కొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో దీక్షకుంట గ్రామంలో 42 కిలోలు గంజాయితో పాటు ముగ్గురు నిందితులను, నర్సంపేట దాసరి పల్లె గ్రామంలో 39 కిలోలు ఇద్దరు నిందితులు, శాయంపేట పత్తిపాక గ్రామంలో 20 కిలోలు ఒకరి పోలీసులు అరెస్ట్ చేశారు. అరెస్ట్ చేసిన నిందితులను విచారించగా నేరాన్ని అంగీకరించారు. ఈ దాడిలో వెస్ట్‌జోన్ డిసిపి ఇస్మాయిల్, దుగ్గొండి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బోనాల కిషన్, నర్సంపేట ఇన్‌స్పెక్టర్ కె.దేవేందర్‌రెడ్డి, నెక్కొండ ఎస్‌ఐ మిథున్, శాయంపేట రాజబాబు, కానిస్టేబుళ్లు నర్సయ్య, మోహన్,యాకూబ్‌పాషా, రాజులను కమిషనర్ అభినందించారు.

వైద్యుల నిర్లక్ష్యం వల్లే పసికందు మృతి

మన తెలంగాణ/భైంసా : అప్పుడే పుట్టిన పసికందు వైద్యుల నిర్లక్ష్యం మూలంగా చనిపోవడంతో బాధిత కుటుంబసభ్యులు శుక్రవారం ఆదిలాబాద్ జిల్లాలోని భైంసా ఏరియా ఆసుపత్రి ఎదుట ఆందోళనకు దిగారు. సంఘటన వివరణలోకి వెళ్తే తానూర్ మండలంలోని కోలూరు గ్రామానికి చెందిన లలితను ప్రసూతి కోసం గురువారం రాత్రి ఏరియా అసుపత్రికి తీసుకువచ్చారు. గర్భిణీని పరిశీలించిన వైద్యుడు సురేందర్ శుక్రవారం ఉదయం శస్త్రచికిత్స నిర్వహిస్తామని చెప్పి వెళ్ళిపోయినట్లు బాధిత కుటుంబీకులు చెబుతున్నారు. అయితే శస్త్రచికిత్స నిర్వహించిన కొద్దిసేపటిలోనే పసికందు మృతిచెందింది. దీంతో బాధిత కుటుంబీకులు పలువురు ఏరియా ఆసుపత్రిలో ఆందోళనకు దిగారు. వైద్యుడు రాత్రివేళనే శస్త్రచికిత్స నిర్వహిస్తే పసికందు బ్రతికేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణ ఎస్‌ఐ పున్నం చందర్, ఏరియా అసుపత్రి సూపరింటెండెంట్ బాధితులకు సముదాయించే ప్రయత్నం చేశారు. ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలు జరగాలని చెప్తూ కెసిఆర్ కిట్ అందజేస్తుండగా ఏరియా ఆసుపత్రిలో చికిత్సలు అందడం లేదని బాదితులు ఆరోపించారు.

మనస్థాపంతో విద్యార్థి ఆత్మహత్య

మన తెలంగాణ/నార్నూర్ : మన స్థాపానికి గురై విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గాధిగూడ మండలంలోని లోకరి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ హరిశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం వెట్టపెల్లి తరున్ (18) అనే విద్యార్థి ఐటిఐలో సీటు రాకపోవడంతో తీవ్ర మనస్థాపానికి గురై గురువారం రాత్రి పురుగుల మందు సేవించి ఆత్మహత్యయత్నానికి పాల్పడగా, దీనిని గమనించిన కుటుంబ సభ్యులు పరిస్థితి విషమించడంతో చికిత్స కోసం ఉట్నూర్ అసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో చనిపోయినట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉట్నూర్ ఆసుపత్రికి తరలించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అనారోగ్యంతో మన తెలంగాణ దినపత్రిక విలేకరి మృతి



మనతెలంగాణ/కడ్తాల్: గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతూ బంజరాహిల్స్ కేర్ ఆసుపత్రిలో చికిత్స పొందిన 'మనతెలంగాణ' దినపత్రిక తలకొండపల్లి మండల జర్నలిస్ట్ మీసాల యాదయ్య(34) శుక్రవారం తెల్లవారుజామున మృతిచెందారు. కొంతకాలంగా డెంగ్యూ, టిబిలాంటి వ్యాధులతో బాధపడుతున్న ఆయన పదిహేను రోజులకు పైగా కేర్ ఆసుపత్రిలో చికిత్స పొంది ఈనెల 9న డిశ్చార్జి అయ్యారు. శుక్రవారం ఆయన రాంపూర్‌లోని తన స్వగృహంలో కన్నుమూశారు. యాదయ్య పది సంవత్సరాలుగా ఆంధ్రజ్యోతి, మన తెలంగాణ దినపత్రికలకు జర్న లిస్టుగా సేవలందించారు. యాదయ్య మృతి పట్ల టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డితో పాటు పలువురు నాయకులు ఆయన అంత్య క్రియలలో పాల్గొని యాదయ్య మృతదేహానికి పూలమాలలతో నివా ళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం ప్రకటిం చి వారిని ఓదార్చారు. పలువురు జర్నలిస్టులు యాదయ్యతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుని తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఎంపిపి లక్ష్మీ దేవి రఘురాములు, జడ్పిటిసి నర్సింహ, టిఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల మండల అధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్, భగవాన్‌రెడ్డి, నాయకులు మోహన్‌రెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, వస్పుల జంగయ్య, మాదారం నర్సింహ, రాములు, వెంకటయ్య, సుధాకర్, విజయ్, కృష్ణలతో పాలు పలువురు అధికారులు, నాయకులు ఆయన అంత్యక్రియలకు హాజరయ్యారు.

ఆరోగ్యశ్రీ ఉద్యోగులకు జీవో 14 ప్రకారం వేతనాలు

మన తెలంగాణ/హైదరాబాద్ సిటీబ్యూరో: రాష్ట్ర వ్యాప్తంగా పని చేస్తున్న ఆరోగ్యశ్రీ ఉద్యోగులకు జీవో 14 ప్రకారం వేతనాలు చెల్లించాలని డైరక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) డాక్టర్ రమేష్‌రెడ్డి ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం ఆయన మనతెలంగాణతో మాట్లాడుతూ..గత కొన్నేళ్లుగా ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఆరోగ్యశ్రీ ఉద్యోగులకు వేతనాల సడలింపు, సమయానికి అందకపోవడం వంటి సమస్యలు ఉన్నాయని ఇక నుంచి ఇలాంటి ఇబ్బందులు ఉండబోవని ఆయన స్పష్టం చేశారు. గత నెల 1వ తేది నుంచి రాష్ట్ర వ్యాప్తంగా 12 బోధన ప్రభుత్వ వైద్యశాలల్లో పనిచేస్తున్న సుమారు 800మంది ఆరోగ్యశ్రీ ఉద్యోగులకు జీవో 14ప్రకారం వేతనాలు సడలింపు చేస్తున్నట్టు తెలిపారు. ఇక నుంచి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని ఆయన వివరించారు. ఈ ఉత్తర్వులతో ఆరోగ్యశ్రీ ద్యోగులుగా పనిచేస్తున్న డేటా ఎంట్రీ ఆపరేటర్లకు రూ.9,500 నుంచి 15,000, డేటా ప్రాసెసింగ్ ఆఫీసర్లకు రూ.11,500 నుంచి 17,500లతో పాటు ఆయా విభాగాల్లో పని చేస్తున్న వారందరికీ వేతనాలు పెరిగాయి. ఈ పెరిగిన వేతనాలు జూలై 1వ తేది నుంచి వీరికి అందనున్నాయి.

ఉద్యోగాల ప్రోత్సాహక పథకానికి ఎంపిక

మన తెలంగాణ/హైదరాబాద్: ఉత్తమ పనితీరును కనబరిచిన ఉద్యోగుల ప్రోత్సాహక పథకానికి ప్రభుత్వం పలువురిని ఎంపిక చేసింది. గ్రూప్ 1 నుంచి గ్రూప్ 4 వరకు ఒక్కో కేటగిరీలో ముగ్గురు ఉద్యోగులను ఎంపిక చేశారు. దీనికి సంబంధించిన ఫైలుపై ముఖ్యమంత్రి శుక్రవారం రాత్రి సంతకం చేశారు. మొదటి ర్యాంకు వచ్చిన వారికి రూ.5 లక్షలు, రెండో ర్యాంకు వారికి రూ.3 లక్షలు, మూడో ర్యాంకు వచ్చిన ఉద్యోగికి రూ.2 లక్షలు నగదు బహుమతిని, జ్ఞాపికను ముఖ్యమంత్రి చేతుల మీదుగా గోల్కొండలో జరిగే స్వాతంత్ర్యదినోత్సవ వేడుకల్లో అందజేస్తారు. ఎంపికైన ఉద్యోగుల వివరాలిలా ఉన్నాయి. గ్రూప్ 1 కేటగిరీలో మొదటిర్యాంకును ఉస్మానియా మెడికల్ కాలేజీలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ సిహెచ్ మధుసూధన్ ఎంపికయ్యారు. తర్వాతి స్థానంలో సిద్ధిపేట ప్రణాళికా అధికారి సురేష్ బాబు, వికారాబాద్ డిఆర్‌డివో పిడబ్ల్యు జాన్సన్ ఉన్నారు. గ్రూప్ 2 కేటగిరీలో హైదరాబాద్ ఆర్డీవో ఖానాపూర్ చంద్రకళ మొదటి ర్యాంకు వచ్చింది. రంగారెడ్డి జిల్లా హెడ్ మాస్టర్ జి.విశ్వనాథం గుప్తా, పెద్దపల్లి జిల్లా మండల గణాంకాధికారి రజీముద్దీన్ అహ్మద్ తర్వాతి స్థానాల్లో ఉన్నారు. గ్రూప్ 3 కేటగిరిలో మహబూబ్‌నగర్ జిల్లాలో స్టాఫ్ నర్స్‌గా పనిచేస్తున్న ఎం. జయమ్మ మొదటి ర్యాంకు రాగా, తర్వాతి స్థానాల్లో వరంగల్ రూరల్ జిల్లా పంచాయతీ కార్యదర్శి కె.ప్రకాశ్, సిఎం సిపిఆర్‌వో పిఎ డి.శంకర్ కుమార్ ఉన్నారు. గ్రూప్ 4 కేటగిరీలో మహిళా శిశు సంక్షేమాభివృద్ధి శాఖ ఉద్యోగి బి.దశరథ్ మొదటి ర్యాంకు రాగా, తర్వాతి స్థానాల్లో కామారెడ్డి జిల్లా ఆఫీస్ సబార్డినేట్ కె.జంగయ్య, యాదాద్రి జిల్లాకు చెందిన కె.కిష్టయ్య ఉన్నారు.

ఇసుక లారీలపై కొరడా ఝుళిపించిన బృందం

మన తెలంగాణ/తిమ్మాపూర్: రాజన్న సిరిసిల్లా జిల్లా నేరెళ్ల ఉదంతం నేపథ్యంలో రవాణా శాఖ అధికారులు అధిక లోడుతో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీలను నియత్రించేందుకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తనిఖీలను ముమ్మరం చేసి లారీలపై కొరడా ఝులిపిస్తున్నారు. రవాణా శాఖ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సునీల్ శర్మ ఆదేశం మేరకు హైదరాబాద్ నుంచి వచ్చిన ప్రత్యేక తనిఖీ బృందం దాడులను ఉధృతం చేశారు. అక్రమదారులు అడ్డదారిలో ఒకే నంబర్‌పై అనేక లారీలలో ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ఉదంతం సిరిసిల్లా జిల్లాలో బయట పడ్డ విషయం తెలిసిందే.ఈ నేపథ్యంలో రవాణా శాఖ,కరీంనగర్ ప్రాంతీయ రవాణా శాఖతో పాటు హైదరాబాద్ నుంచి వచ్చిన 8 ప్రత్యేక బృందాలు వారం రోజుల నుంచి ఒవర్ లోడుతో వెళ్తున్న 90 వాహనాలను తమ దూకుడును మరింత వేగంగా పెంచి సీజ్ చేశారు.

పునరుజ్జీవ పథకంతో తీవ్ర అన్యాయం

- టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి రేవూరి ప్రకాష్‌రెడ్డి

మన తెలంగాణ/ఎన్‌జిఒస్ కాలనీ: గత కొద్ది రోజులుగా కెసిఆర్ ప్రజలను మోసం చేస్తూ ఎస్‌ఆర్‌ఎస్‌పి పునరుజ్జీవ పథకం శంకుస్థాపన చేశారని తెలుగు దేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి రేవూరి ప్రకాష్ రెడ్డి విమర్శించారు. శుక్రవారం హన్మకొండలోని జిల్లా టిడిపి కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోచంపాడు వద్ద ఎస్సారెస్పి పునరుజ్జీవ పథకాన్ని ప్రారంభిస్తున్నామని ప్రకటనలు చేస్తూ తెలంగాణ ప్రజలను మభ్యపెడుతూ వస్తున్నారని విమర్శించారు. టిఆర్‌ఎస్ ప్రభుత్వం ఎన్నికల ముందు తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి కొత్తకొత్త పథకాలను సృష్టిస్తూ వాటి అమలుకు చిత్తశుద్ధి లేక పోవడంతో పథకాలన్ని ప్రజలకు అందకుండా నిర్వీర్యమవుతున్నాయని ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, వాటిని కప్పిపుచ్చుకోవడానికి పునరుజ్జీవ పథకాలని పనికిరాని పథకాలతో ఆర్భాటాలు నిధులన్ని వెచ్చిస్తున్నారని విమర్శించారు. కెసిఆర్ కేంద్ర మంత్రిగా పనిచేసిన రోజుల్లో ఏనాడు ఎస్సారెస్పిని పట్టించుకున్న పాపన పోలేదని దుయ్యబట్టారు. ఆనాడు టిడిపి ధర్నా, రాస్తారోకో చేస్తే అడ్డుకొని బదనాం చేశారని విమర్శించారు. రాష్ట్రంలో 11 కొత్త ప్రాజెక్టులు నిర్మిస్తున్న ఏ ఒక్కటి తుది దశకు చేరుకోలేదని ఈ ప్రాజెక్టులన్ని ఆంధ్రా కాంట్రాక్టర్ల చేతిలో ఉన్నాయని, వీటిని రీ డిజైన్ల పేరుతో టిఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.కోట్లాదికోట్లు అవినీతికి పాల్పడుతుందని విమర్శించారు. ఇప్పటికైనా వరంగల్ ప్రజలను టిఆర్‌ఎస్ ప్రభుత్వం మోసం చేయడం మానుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పుల్లూరి అశోక్, టిఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంతోష్‌నాయక్, జిల్లా నాయకులు హన్మకొండ సాంబయ్య, మార్గం సారంగం, మార్క విజయ్, ఎండి.రహీం, బైరపాక ప్రభాకర్, వీరస్వామి,కుసుమ శ్యాం, ఈశ్వరచారి, మాదాసి బాబు, రఘుబాబు, జయశంకర్, బొమ్మగాని శ్యాం తదితరులు పాల్గొన్నారు.

కోర్టును ధిక్కరిస్తున్న ప్రభుత్వం

మనతెలంగాణ/జహీరాబాద్: జహీరాబాద్ నియోజకవర్గంలో నూతనంగా నిర్మించతల పెట్టిన నిమ్జ్ భూముల సేకరణకు హైకోర్టు ఇప్పటికి స్టే విధించినప్పటికి అధికారులతో ఏ విధంగా సర్వేలు నిర్వహిస్తున్నారని అఖిల భారత కిసాన్ సభ జాతీయ ఉపాధ్యక్షులు సారంపల్లి మల్లారెడ్డి ప్రశ్నించారు. శుక్రవారం స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఒక వైపు ప్రజలను ఆదుకుంటాం, పంచాయతిరాజ్ హక్కులను కల్పిస్తామని గొప్పలు చెబుతూ మరో వైపు నిమ్జ్ పరిధిలోని గ్రామాలైనటువంటి ఝరాసంగం, న్యాల్‌కల్ మండలాల్లోని 17 గ్రామ సర్పంచ్‌ల హక్కులను హరిస్తు మెమోనంబర్ 1044ను జారీ చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. ఇది వరకు అధికార పార్టీ నాయకులు కేవలం వ్యవసాయ భూములను మాత్రమే నిమ్జ్ ఏర్పాటుకు తీసుకుంటున్నామన్నారు. కాని నేడు ప్రభుత్వం ఎవరితో చర్చించ కుండా హైకోర్టు ఉత్తర్వుల దిక్కరిస్తునందున్న కేసును నమోదు చేస్తామన్నారు.

2019 ఎన్నికల నాటికి ప్రతిపక్షాల అడ్రస్ గల్లంతు

- మంత్రి జూపల్లి కృష్ణారావు



మనతెలంగాణ/అచ్చంపేట : 2019 లోపే ఎన్నికలు వచ్చినా టిడిపి, కాంగ్రెస్, భాజపా ప్రతిపక్ష పార్టీల అడ్రస్ గల్లంతు కావడం ఖాయమని రాష్ట్ర పౌరసరాఫరాల శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. శుక్రవారం అచ్చంపేటకు వచ్చిన ఆయన అచ్చంపేట ఎంఎల్‌ఎ గువ్వల బాల్‌రాజుతో కలిసి విలేకర్లతో మాట్లాడుతూ టిఆర్ ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సంవత్సరన్న కాలంలోనే జరిగిన హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికల ఫలితాలే ప్రభుత్వం పనితీరుకు నిదర్శనమని ఆయన అన్నారు. విడివిడిగా కలివిడిగా పోటీ చేసిన ఏదో ఒక సీటు సాధించడం కోసమో పోటీ చేయాలి తప్పా దరిదాపుల్లో అధికారం వచ్చే ప్రసక్తే లేదని మంత్రి ఎద్దేవా చేశారు. అచ్చంపేట మున్సిపల్ ఎన్నికల్లో మూడు పార్టీలు కలిసి పోటీ చేసిన 20వార్డులను టిఆర్‌ఎస్ కైవసం చేసుకుందని, ఈ ఫలితాలే మళ్ళీ వచ్చే ఎన్నికల్లో చూడడం తప్పా మరో మార్గం లేదని మంత్రి జోష్యం చెప్పారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులన్నింటిని పూర్తి చేసి 7 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగు నీరందిస్తున్నామన్నారు. శ్రీశైలం ప్రాజెక్టు ద్వారా800అడుగుల నీటి మట్టం వచ్చే వరకు కెఎల్‌ఐ ద్వారా నాగర్‌కర్నూల్ జిల్లాలో 3లక్షల ఎకరాల ఖరీఫ్ సాగుకు నీళ్ళివ్వడం ఖాయమని మంత్రి దీమా వ్యక్తం చేశారు. ఎన్ని ఇబ్బందులున్న పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పనులను పూర్తి చేసి అచ్చంపేట నియొజకవర్గానికి 60వేల ఎకరాలకు సాగు నీరందిస్తామన్నారు. నగర పంచాయితీ చైర్మన్ కేతావత్ తుల్సీరాం,ఎంపిపి పర్వతాలు, నాయకులు నర్సింహ్మాగౌడ్,మనోహార్ పాల్గొన్నారు.

ఉస్మానియాలో జూడాల సమ్మె విరమణ

- డిమాండ్లను పరిష్కరిస్తామని మంత్రి హామీ

మన తెలంగాణ/హైదరాబాద్ సిటీబ్యూరో: గత నెల 29న ఉస్మానియా ఆసుపత్రిలోని ఐఎంసీ వార్డులో జూనియర్ డాక్టర్లపై జరిగిన దాడికి నిరసనగా నాలుగు డిమాండ్లతో జూడాలు నిర్వ హిస్తున్న సమ్మె విరమించారు. శుక్రవారం ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ సి.లక్ష్మారెడ్డి, డైరక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) డాక్టర్ రమేష్ రెడ్డిలతో జరిగిన చర్చలు సఫలమయ్యాయి. జూడాల డిమాండ్లలపై 15రోజుల్లో సెంట్రల్ సెక్యూరిటీ ఫోర్స్ ఏర్పాటు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఆసుపత్రిలోని అన్ని విభాగాల్లో మౌళిక వసతుల కల్పన గురించి టిఎస్‌ఎంఐడీసీ ప్రతినిధులతో చర్చలు జరిపారు. ఉస్మానియాలో వసతులను రెండు నెలల్లో ఏర్పాటు చేయడంతో పాటు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న ఉన్నత స్థాయి అధికారుల మార్పులు చేస్తామని హామీ ఇవ్వడంతో జూడాలు సమ్మె విరమిస్తూ విధుల్లోకి హాజరవుతున్నామని తెలిపారు. జూడాలపై దాడికి పాల్పడ్డ ఇద్దరిలో ఇప్పటికే ఒకరిని అరెస్టు చేయగా, శుక్రవారం మరొకరినిఅదుపులోకి తీసుకున్నారు.

దుప్పి మాంసం కలకలం

మన తెలంగాణ/మంగపేట: మండలంలో శుక్రవారం ఉదయం అటవీ మాంసం కలకలం రేపింది. ఉదయం తొమ్మిది గంటల ప్రాంతంలో ఏటూరునాగారం ప్రాంతం నుంచి మంగపేట వైపు గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు దుప్పి మాంసాన్ని సంచిలో వేసుకుని ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా కమలాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద ఉన్న స్పీడ్ బ్రేకర్ వద్ద అదుపుతప్పి కిందపడ్డారు. దీంతో సంచిలో ఉన్న మాంసం ముక్కలు రోడ్డుపైన చెల్లాచెదురుగా పడ్డాయి. గ్రామానికి చెందిన కొంతమంది యువకులు దీనిని గమినించి వారి ప్రశ్నించగా వాహన దారులు భయపడి పారిపోయారు. ఈ సమా చారాన్ని స్థానికులు పోలీసులకు, అటవీశాఖ అధికారులకు అందించడం వారు ఘటన స్థలానికి చేరుకొని మాంసాన్ని పరిశీలించగా అది దుప్పి మాంసమని తేలడంతో ఆ మాంసాన్ని ఖననం చేశారు.

శింబు సినిమా ఇంగ్లీష్‌లో!

పాటలుండవు... ఇంటర్వెల్ ఉండదు... అంటూ రెండు వారాల కిందట తన స్వీయ దర్శకత్వంలో ఒక సినిమాను ప్రకటించేసి అందరినీ ఆశ్చర్యపరిచాడు. తమిళ్ హీరో శింబు. దీంతో ఈ సినిమాపై ఒక్కసారిగా తమిళ ప్రేక్షకుల్లో ఆసక్తి ఏర్పడింది. ఈ చిత్రానికి సంతోష్‌శివన్ వంటి లెజెండరీ సినిమాటోగ్రాఫర్ పనిచేస్తుండటం మరింతగా ఆసక్తిని రేకెత్తించింది. ఈ సినిమా కథ గురించి తాజాగా సంతోష్ శివన్ పాజిటివ్‌గా మాట్లాడాడు కూడా. మరోవైపు మ్యూజిక్ డైరెక్టర్ యువన్ శంకర్‌రాజా ఈ సినిమా స్క్రిప్ట్ విన్న వెంటనే షూటింగ్‌కంటే ముందే నేపథ్య సంగీతాన్ని కూడా పూర్తిచేసేశాడట. ఈ సినిమాకు సంబంధించిన తాజా సమాచారం ఏమిటంటే... ఈ చిత్రం తెరకెక్కుతున్నది తమిళంలో కాదట. ఇది పూర్తిస్థాయి ఇంగ్లీష్ సినిమా అట. ఈ చిత్రాన్ని ఇంగ్లీష్‌లో మాత్రమే తీస్తున్నానని... తర్వాత తమిళం, ఇతర భాషల్లోకి అనువదిస్తానని తాజాగా ప్రకటించాడు శింబు. విశేషమేమిటంటే ఈ చిత్రానికి గౌతమ్‌మీనన్ మాటలు రాస్తున్నాడట. శింబుతో ఏమాయ చేసావే, సాహసం శ్వాసగా సాగిపో తమిళ్ వర్షన్ సినిమాలను చేసిన దర్శకుడు గౌతమ్ మీనన్... శింబు దర్శకత్వం వహించే సినిమాకు ఇంగ్లీష్‌లో మాటలు రాయడం విశేషమే. శింబు ఇంతకుముందు స్వీయ దర్శకత్వంలో 'వల్లభ' సినిమా చేశాడు. అది ఫ్లాప్ అయింది. అంతకుముందు అతని కెరీర్‌లో బిగ్గెస్ట్ హిట్‌గా నిలిచిన 'మన్మథ'కు కథ, స్క్రీన్‌ప్లే కూడా శింబు అందించడం విశేషం.



ఆరు నెలల్లో పూర్తవుతుందట



'బాహుబలి' కోసం చాలా సమయాన్ని కేటాయించిన ప్రభాస్ ఇకపై చకచకా సినిమాలు చేసేస్తాడని అంతా అనుకున్నారు. దానికి తగ్గట్టే 'బాహుబలి2' రిలీజ్ సందర్భంగా థియేటర్లలో తన కొత్త సినిమా 'సాహో'కు సంబంధించి ఓ చిన్న టీజర్‌ను రిలీజ్‌చేశాడు ప్రభాస్. ఇట్స్ షో టైమ్.. అంటూ విడుదలైన ఈ సినిమా టీజర్ అప్పట్లో పెద్ద సంచలనం సృష్టించింది. అయితే అప్పటి నుంచి ఇప్పటిదాకా 'సాహో'కు సంబంధించి పెద్దగా అప్‌డేట్స్ లేకపోవడంతో ప్రభాస్ అభిమానులు ఒకింత డీలాపడ్డారు. అప్పుడప్పుడు ప్రభాస్‌కు సంబంధించిన డిఫరెంట్ గెటప్‌లు బయటకొస్తుండడంతో ఇవన్నీ 'సాహో' కోసమేనని అభిమానులు భావించారు. కానీ ప్రభాస్ గెటప్ విషయమై ఇంకా గందరగోళం కొనసాగుతూనే ఉంది. అయితే ఇప్పటికే ఈ సినిమా షూటింగ్ ప్రారంభమైందని... ప్రభాస్ లేకుండానే కొన్ని రోజులు షూటింగ్ జరిపేశామని ఈ చిత్రం సినిమాటోగ్రాఫర్ మదిరాజు గంగాధరన్ ఎలియాస్ మది తెలియజేశాడు. అతి త్వరలో ప్రభాస్ షూటింగ్‌కు హాజరవుతాడని... ఏకబిగిన ఆరు నెలల్లో 'సాహో' షూటింగ్ పూర్తయిపోతుందని ఆయన ప్రకటించడం గమనార్హం. అదేగనుక జరిగితే ప్రభాస్ అభిమానులకు అంతకన్నా కావాల్సిందేముంటుంది. ఓవైపు సినిమా నిర్మాణం, ఇంకోవైపు విజువల్ ఎఫెక్ట్స్ వర్క్ వెరసి 'సాహో'చిత్రం శరవేగంగా నిర్మాణం పూర్తిచేసుకుంటుందట. సుజిత్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో నటించే హీరోయిన్ ఎవరనేది ఇంకా ఖరారు కాకపోవడం గమనార్హం.

ప్రభాస్

టీజర్‌కు కోటి వ్యూస్



సూపర్‌స్టార్ మహేష్‌బాబు నటిస్తున్న 'స్పైడర్' టీజర్ విడుదలై సోషల్ మీడియాలో సందడి చేస్తూనే ఉంది. ప్రేక్షకులు, అభిమానులు ఈ టీజర్‌ను విపరీతంగా షేర్ చేస్తున్నారు. దీంతో విడుదలైన మొదటి 24 గంటల్లోనే 8.6 మిలియన్ల వ్యూస్ సాధించిన ఈ చిత్రం ప్రస్తుతం 10 మిలియన్లు అనగా కోటి వ్యూస్‌ను తాకేసింది. 'బాహుబలి'ని మినహాయిస్తే ఓ తెలుగు మూవీ టీజర్ ఇంత వేగంగా కోటి వ్యూస్‌ను అందుకోవడం ఇదే మొదటిసారి. దీన్ని బట్టి చూస్తే ప్రేక్షకుల్లో ఈ చిత్రం పట్ల ఎంత ఆసక్తి నెలకొనిఉందో అర్థమవుతుంది. 'భయపెట్టడం మాకూ వచ్చు...' అంటూ మహేష్ చెప్పిన డైలాగ్ అభిమానులకు విపరీతంగా నచ్చేసింది. ఈ మూవీ థియేట్రికల్ ట్రైలర్ సెప్టెంబర్ మొదటి వారంలో విడుదలకానుంది. మురుగదాస్ దర్శకత్వంలో ఈ చిత్రాన్ని ఠాగూర్ మధు, ఎన్‌వి ప్రసాద్‌లు భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. తెలుగుతో పాటు తమిళంలో కూడా ఈ సినిమాను భారీ ఎత్తున రిలీజ్ చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ప్రేక్షకుల్లో ఉన్న క్రేజ్ వలన ప్రీరిలీజ్ బిజినెస్ భారీగా జరిగింది. ఎస్.జె.సూర్య, భరత్‌లు ప్రతి నాయకులుగా నటిస్తున్న ఈ చిత్రానికి హారిస్ జైరాజ్ సంగీతాన్ని అందించాడు. ఈ మూవీ ఆడియో ఇంకా రిలీజ్ కానప్పటికీ బూమ్ బూమ్... అనే ఒక్క పాటను లాంచ్ చేశారు. ఈ పాటకు మంచి స్పందన వస్తోంది. దసరా పండుగ కానుకగా సెప్టెంబర్ 27న 'స్పైడర్'ను థియేటర్లలోకి తీసుకురావాలని ప్లాన్ చేశారు ఫిల్మ్‌మేకర్స్.

మహేష్‌బాబు

51 సంవత్సరాల గూఢచారి 116

తెలుగు సినిమాను కొత్త ఒరవళ్లు తొక్కించిన వారిలో సూపర్ స్టార్ కృష్ణ కాస్త ముందే ఉంటారు. హీరోగా రాణిస్తున్న సమయంలో ఆయనకంటే సీనియర్లు ప్రయోగాలు చేయడానికి భయపడుతుంటే... కృష్ణ మాత్రం డేరింగ్ స్టెప్పులు వేశారు. ముఖ్యంగా టెక్నికల్‌గా అప్‌డేట్ అవడంలో ఆయనకు ఆయనే సాటి. అందుకే ఎన్నో రకాల టెక్నాలజీల తొలి ఆవిష్కరణ ఆయన సినిమాల ద్వారానే జరిగింది. అలాగే తొలిసారిగా జేమ్స్ బాండ్, కౌబాయ్ సినిమాలను చేసింది కూడా ఆయనే. డిటెక్టివ్ కథతో కృష్ణ హీరోగా తెరకెక్కిన చిత్రం 'గూఢచారి 116'. ఈ చిత్రం 1966 సంవత్సరం ఆగస్టు 11న రిలీజైంది. దీంతో ఈ చిత్రం విడుదలై శుక్రవారంనాటికి 51 సంవత్సరాలు పూర్తయ్యాయి. అప్పట్లో పెద్ద నగరాల్లో నివసించే బాగా చదువుకున్న వారికి కూడా ఈ సినిమా టైటిల్ డిఫరెంట్‌గా అనిపించిందట. ఇంగ్లీష్‌లో జేమ్స్‌బాండ్ సినిమాలు చూడని వారికి మాత్రం ఈ చిత్రం విభిన్నమైన అనుభూతిని కలిగించింది.



కృష్ణ



అసలు దేశం కోసం పనిచేసే గూఢచారులు ఇలా ఉంటారా... అంటూ ప్రేక్షకులు నోరెళ్లబెట్టారు. కృష్ణను పొగడని వారే లేరు. విచిత్రం ఏమిటంటే... ఈ సినిమా రిలీజై సరిగ్గా 51 సంవత్సరాల తర్వాత ఇప్పుడు కృష్ణ కొడుకు మహేష్‌బాబు 'స్పైడర్' సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. అప్పట్లో కృష్ణ అలాంటి సినిమాలు చేస్తూ సూపర్ స్టార్ స్టేటస్‌ను సొంతం చేసుకుంటే... ఇప్పుడు మహేష్ మాత్రం సూపర్ స్టార్ అయ్యాకనే అలాంటి సినిమాలు చేస్తున్నాడు.

యువతకు సందేశాన్నిచ్చే మనసైనోడు

మనోజ్ నందం, ప్రియాసింగ్ హీరో హీరోయిన్లుగా హెచ్ పిక్చర్స్ పతాకంపై హసీబుద్దీన్ నిర్మాతగా వెంకటేశ్వరరావు దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'మనసైనోడు'. ఈ చిత్రం ఆడియో విడుదల కార్యక్రమం హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్స్‌లో జరిగింది. ముందుగా ఈ చిత్రం ట్రైలర్‌ను సురేష్ కొండేటి రిలీజ్ చేశారు. అనంతరం ఆడియో బిగ్ సిడి, ఆడియో సిడిలను గోపినాథ్ రెడ్డి విడుదల చేసి సిడిలను చిత్ర యూనిట్‌కు అందజేశారు. ఈ సందర్భంగా సురేష్ కొండేటి మాట్లాడుతూ ''ఈ సినిమాను దర్శకుడు వెంకటేశ్వరరావు అద్భుతంగా తెరకెక్కించారు. సినిమా హిట్ అయి నిర్మాతలకు మంచి లాభాలు రావాలని కోరుకుంటున్నాను''అని అన్నారు. దర్శకుడు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ''సినిమాలో మనోజ్ నందం, ప్రియా సింగ్ జంట చూడముచ్చటగా ఉంటుంది. చిత్రంలోని ఆరు పాటలకు సుభాష్ ఆనంద్ చక్కని సంగీతాన్ని అందించారు. 'జయ జయ జయహే భారతావని...' అని అంటూ మన భారతదేశ గొప్పతనాన్ని ప్రతి భారతీయుడు గర్వంగా తల ఎత్తుకొని పాడుకునే విధంగా స్వర్గీయ డా.సి.నారాయణరెడ్డి రచించారు. ప్రేమ కథలో కుటుంబ కథను జోడించి యువతకు సందేశాన్నిచ్చేవిధంగా ఈ చిత్రం రూపుదిద్దుకుంది''అని తెలిపారు. ఈ కార్యక్రమంలో చిత్ర హీరో,హీరోయిన్‌లు మనోజ్ నందం, ప్రియాసింగ్, సంగీత దర్శకుడు సుభాస్ ఆనంద్‌తో పాటు చిత్ర బృందం పాల్గొంది.



'మనసైనోడు' ఆడియో వేడుకలో గోపీనాథ్ రెడ్డి, సురేష్ కొండేటి, మనోజ్‌నందం, ప్రియా సింగ్, వెంకటేశ్వరరావు, హసీబుద్దీన్ తదితరులు

ఇంట్లోనే పోల్ డ్యాన్స్



జాక్విలిన్ ఫెర్నాండెజ్

శ్రీలంక నుంచి వచ్చి బాలీవుడ్‌లో హీరోయిన్‌గా సెటిలైన బ్యూటీ జాక్విలిన్ ఫెర్నాండెజ్. సూపర్ ఫిజిక్‌తో కనిపించే ఈ భామ సినిమాల్లో అందాలు ఆరబోయడానికి ఏమాత్రం వెనుకాడదు. దీంతో బాలీవుడ్‌లో ఆమెకు వరుసగా అవకాశాలు వచ్చేస్తున్నాయి. తన లేటెస్ట్ సినిమా 'ఎ జెంటిల్‌మన్' కోసం జాక్విలిన్ పోల్ డ్యాన్స్ నేర్చేసుకుంది. సినిమాలోని ఒక పాటలో పోల్ డ్యాన్స్ చేస్తూ ప్రేక్షకులను అలరించబోతోంది.

మొదటి నుంచి ఈ భామ ఫిట్‌నెస్ విషయంలో ఎంతో జాగ్రత్తగా ఉంటోంది. దీంతో పోల్ డ్యాన్స్ వల్ల తన ఫిట్‌నెస్ మరింత పెరుగుతుందని రెగ్యులర్‌గా ఈ డ్యాన్స్ ప్రాక్టీస్ చేస్తోందట. తన ఇంట్లోనే పోల్‌ను ఏర్పాటుచేసుకొని ప్రతిరోజు ఆమె పోల్ డ్యాన్స్ చేస్తుండడం విశేషం. ఇక సినిమాలోని చంద్రలేఖ... పాటలో జాక్విలిన్ పోల్ డ్యాన్స్‌తో తన అందాలను ఆరబోస్తుందట. ఈ పాట సినిమాకే హైలైట్‌గా ఉంటుందట.



శ్రీదేవి, జాన్వి కపూర్

స్టార్ కిడ్స్ అన్నాక ఇలాగే..

నాటి అతిలోక సుందరి శ్రీదేవి ఇటీవల 'మామ్' చిత్రంతో సక్సెస్‌ను అందుకుంది. తన సెకండ్ ఇన్నింగ్స్‌లోనూ ఆమె తనదైన శైలిలో ప్రేక్షకులను అలరిస్తూ మంచి విజయాలను తన ఖాతాలో వేసుకుంటోంది. అయితే శ్రీదేవి పెద్ద కూతురు జాన్వీ కపూర్‌పై ఈమధ్యన ఎక్కువగా రూమర్లు వినిపిస్తున్నాయి. జాన్వీ ఏకంగా బాలీవుడ్ యంగ్ హీరో రణబీర్ కపూర్ వెంటపడుతోందని ఈమధ్యన ఒక రూమర్ వినిపించింది. అన్నింటి గురించి మాట్లాడే శ్రీదేవి తన కూతురుపై వస్తున్న రూమర్ల గురించి స్పందించదా? అని బాలీవుడ్ జనాలు అంటున్నారు. చివరికి ఈ రూమర్లపై స్పందించింది శ్రీదేవి. ''ఈమధ్య నా పెద్ద కూతురిపై తీవ్ర స్థాయిలో రూమర్లు వస్తున్నాయి. నా అమ్మాయిలు ఇద్దరికీ నేను ముందే చెప్పాను. స్టార్ కిడ్స్ అన్నాక ఇలాగే ఉంటుంది. మీకు నచ్చినా, నచ్చకపోయినా అర్థం చేసుకొని ముందుకు వెళ్లాలని వారితో చెప్పాను. ఒక పార్టీలో నా పెద్ద కూతురు జాన్వీ... హీరో రణబీర్‌కపూర్ వెంటపడింది అని అన్నారు. అందులో ఒక్క శాతం కూడా నిజం లేదు. ఇలాంటి అనుభవాలు ఎదురవుతూనే ఉంటాయి. వాటిని పట్టించుకోవాల్సిన అవసరం లేదని నా కూతుళ్లకు చెప్పాను''అని శ్రీదేవి పేర్కొంది. నిజానికి బాలీవుడ్ బిగ్ ఫిల్మ్‌మేకర్ కరణ్‌జోహార్... జాన్వీని హీరోయిన్‌గా పరిచయం చేస్తానని అన్నా కూడా శ్రీదేవి మాత్రం రకరకాల ఇతర ఆప్షన్లు వెతుకుతోంది. చివరకు జాన్వీకపూర్ సినీ రంగ ప్రవేశం ఎప్పుడు జరుగుతుందో చూడాలి.

సందీప్ కిషన్ క్యూట్ లవ్ స్టోరీ

సందీప్‌కిషన్ నటించిన 'నక్షత్రం' ఇటీవల ప్రేక్షకుల ముందుకొచ్చి అతన్ని నిరాశపరిచింది. గత కొంతకాలంగా సరైన సక్సెస్‌లేక ఈ యంగ్ హీరో సతమతమవుతున్నాడు. కెరీర్ ప్రారంభంలో సందీప్ 'వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్' వంటి కామెడీ మూవీతో మంచి హిట్‌ను అందుకున్నాడు. ఆతర్వాత లవ్ స్టోరీస్ సినిమాలతో వచ్చి పర్వాలేదనిపించాడు. అనంతరం వచ్చిన సినిమాలన్నీ సందీప్‌ను నిరాశపరిచాయి. అయితే తెలుగులో అతని పరిస్థితి ఇలా ఉంటే తమిళ్‌లో మాత్రం ఈ యంగ్ హీరో పర్వాలేదనిపిస్తున్నాడు. అతనికి అక్కడ మంచి మార్కెట్ కూడా ఉంది. ప్రస్తుతం సందీప్ కిషన్ సూపర్ స్టార్ మహేష్ అక్కయ్య మంజుల దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నాడు. ఇది ఓ కొత్త తరహా లవ్ స్టోరీ సినిమా అని తెలిసింది. అతనికి జోడీగా అమైరా దస్తూర్, త్రిధా చౌదరిలు నటిస్తున్నారు. ఈ సినిమా ఒక క్యూట్ లవ్‌స్టోరీ అని... తప్పకుండా ఇది ప్రేక్షకులకు నచ్చుతుందని చెబుతున్నాడు సందీప్ కిషన్. ఈ సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ను మహేష్ చిత్రం 'స్పైడర్' రిలీజ్ రోజైన సెప్టెంబర్ 27న విడుదల చేస్తారట దర్శకురాలు మంజుల.





పది కోట్ల మైలురాయి చేరుకున్న రిలయన్స్ జియో

న్యూఢిల్లీ: టెలికామ్ రంగంలోకి సంచనాలకు కేంద్రబిందువుగా మారిన రిలయన్స్ జియో మరో రికార్డును సాధించింది. తాజాగా ఈ సంస్థకు చెందిన 'మై జియో'యాప్ పది కోట్ల డౌన్‌లోడ్లతో మరో మైలు రాయిని అందుకుంది. గూగుల్ ప్లేస్టోర్‌లో ఆండ్రాయిడ్ యాప్‌ను 10కోట్ల మంది డౌన్‌లోడ్ చేసుకున్నారు. దీంతో టాప్ ఫ్రీ ఆండ్రాయిడ్ యాప్స్‌లో 'మై జియో' యాప్ తొమ్మిదో స్థానంలో నిలిచింది. కేవలం ఏడాదిలోనే జియో ఈ రికార్డును సాధించింది. ఈ సంస్థ అతి తక్కువ కాలంలో 10 కోట్ల మంది వినియోగదారులను సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. రిలయన్స్ జియో వినియోగదారులు ఈ యాప్ ద్వారా అధికారికంగా రీఛార్జ్‌లు చేసుకోవడంతో పాటు, బ్యాలెన్స్‌ను కూడా చెక్ చేసుకోవచ్చు. జియో ఇతర యాప్‌లైన 'జియో 4జి వాయిస్', 'జియో టీవీ'లు 50 మిలియన్ల డౌన్‌లోడ్‌లను చేరుకున్నాయి.

వడ్డీ రేట్లు యథాతథం


మన తెలంగాణ / హైదరాబాద్ : ఆంధ్రాబ్యాంక్ వడ్డీ రేట్లు యథాతథంగానే కొనసాగనున్నాయి. మార్జినల్ కాస్ట్ ఫండ్స్ బేస్డ్ లెండింగ్ రేట్లు (ఎంసిఎల్ఆర్)ను నెల రోజులు, మూడు మాసాలు, ఆరు మసాల, ఒక సంవత్సర కాల పరిమితిని గాను ఇంత క్రితం వడ్డీ రేట్లనే కొనసాగిస్తున్నట్లు ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ వడ్డీ రేట్లు ప్రస్తుతం 8.65 శాతంగా ఉన్నాయి. జూన్ 16 నుండి అమలు చేయనున్నట్లు వెల్లడించింది.

ఒక్క రూపాయి మాఫీ లేదు

• డొల్ల కంపెనీలపై త్వరితగతిన చర్యలు • ఆర్థిక సర్వే సందర్భంగా కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ

న్యూఢిల్లీ: కార్పొరేట్ సంస్థలు తీసుకున్న రుణాల్లో ఒక్క రూపాయి కూడా మాఫీ చేయబోమని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ స్పష్టం చేశారు. దీనిపై ప్రతిపక్షాలు మాట్లాడే ముందు వాస్తవాలు తెల్సుకోవాలని అన్నారు. అదేసమయంలో డొల్ల కంపెనీల(షెల్)పై వేగవంతంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కంపెనీల చట్టం ప్రకారం డొల్ల కంపెనీలకు ఒక నిర్వచనమంటూ లేదని, అయితే అవి నగదు తరలింపులో ఉపయోగపడుతున్నాయని అన్నారు. లోక్‌సభ ప్రశ్నోత్తరాల సమయంలో ఓ ప్రశ్నకు ఆయన ఈ విధంగా సమాధానమిచ్చారు.

డొల్ల కంపెనీల వెనక ఉన్న అసలు యజమానులను గుర్తించి ఆదాయపు పన్ను, బినామీ చట్టాల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమానిత షెల్ కంపెనీల ట్రేడింగ్‌కు వ్యతిరేకంగా మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ చర్యలు చేపట్టడంపై మంత్రి స్పందిస్తూ, స్టాక్‌మార్కెట్లలో కొంత సంక్షోభ పరిస్థితులు ఉన్నాయని అన్నారు. మరోవైపు డొల్ల కంపెనీల నియంత్రణకు కంపెనీల చట్టాల్లో మార్పులేమైనా చేస్తారా? అని ప్రశ్నించగా జైట్లీ అలాంటిదేమీ లేదని అన్నారు. సరళతర వ్యాపారంలో భాగంగా రెండు రోజుల్లోనే కంపెనీలు రిజిస్టర్ అవ్వడానికి అవకాశం ఉండాలని, అదే సమయంలో అవి దుర్వినియోగానికి పాల్పడకుండా చర్యలు తీసుకోవాల్సి ఉందని పేర్కొన్నారు. దీనికి గాను కొంత సమన్వయం అవసరమని, సాంకేతికతతో అదేమీ పెద్ద సమస్య కాదని పేర్కొన్నారు. కాగా శుక్రవారం ఆర్థిక సర్వే 2016–17ను జైట్లీ పార్లమెంటులో ప్రవేశపెట్టారు. పుంజుకుంటున్న రూపాయి విలువ, వ్యవసాయ రుణాల రద్దు, జిఎస్‌టి అమలు తదితర సవాళ్ల కారణంగా గతంలో అంచనా వేసిన 6.75–7.5 శాతం వృద్ధిని సాధించడం చాలా కష్టమవుతుందని సర్వే వెల్లడించింది. ప్రధానందా జిఎస్‌టిలో నిర్మాణాత్మక సంస్కరణలు, నోట్ల రద్దు వంటి అంశాలను చర్చించింది. ఎయిర్ ఇండియా ప్రైవేటీకరణ సహా పలు అంశాలను నివేదిక ప్రతిపాదించింది. దేశ ఆర్థికవ్యవస్థ ప్రస్తుత స్థితి, మొత్తం వాణిజ్యం, బాహ్య రుణం, ఎఫ్‌డిఐ కింద విదేశీ నిధుల ప్రవాహం తదితర అంశాలపై నివేదికలో ఆర్థిక సర్వే పేర్కొంది.



ఆర్థిక సర్వే ముఖ్యాంశాలు

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో 2016–17 ఆర్థిక సంవత్సరం ఆర్థిక సర్వే పార్ట్–2ను కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ మంగళవారం పార్లమెంట్ లో ప్రవేశపెట్టారు. దేశ వృద్ధిరేటు 7.1 శాతంగా నమోదైనట్లు ఆర్థిక సర్వేలో తేల్చింది. జిడిపిలో కరెంట్ ఖాతా లోటు 0.3 శాతంగా ఉంటుందని, అయితే ఇది తాత్కాలికమేనని చెప్పారు. గత ఏడాది కాలంగా ఏడు కీలక సంస్కరణలు చేపట్టినట్టు తెలిపారు. జిఎస్‌టి, అవినీతి నిరోధక బిల్లు, పరపతి విధాన కమిటీ, ఆధార్ బిల్లు, విదేశీ పెట్టుబడుల సరళీకరణ, కార్మిక రంగ అభివృద్ధి లాంటి అంశాల్లో సంస్కరణలు చేపట్టినట్టు ఆర్థిక సర్వేలో వెల్లడించారు.



- జనవరిలో అంచనా వేసిన వాస్తవ జిడిపి(స్థూల దేశీయోత్పత్తి) 6.75–7.5 శాతంను చేరుకోలేకపోవచ్చు.
- 2016–17 ఆర్థిక సంవత్సరంలో 3.5 శాతంతో పోలిస్తే 2017–18లో జిడిపిలో ద్రవ్యలోటు 3.2 శాతానికి తగ్గనుందని అంచనా
- మార్చి నాటికి రిటైల్ ద్రవ్యోల్బణం 4 శాతం దిగువనే ఉండనుంది.
- 2017–18కు ఆర్థిక దృక్పథంలో అనిశ్చితి
- ద్రవ్యపరపతి విధాన సమీక్షలో పరిశీలనకు మరింత అవకాశం, తటస్థ రేటు కంటే 25–75 బేసిస్ పాయింట్లు పైన రెపోరేటు
- జిఎస్‌టి, ఎయిర్ ఇండియా ప్రైవేటీకరణ, ఇంధన సబ్సిడీల హేతుబద్ధీకరణ, బ్యాంకులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ద్వంద్వ బ్యాలెన్స్ షీట్
- జిఎస్‌టి(వస్తు, సేవల పన్ను) అమలు అనంతరం పన్ను పరిధి మరింత విస్తరణ దిశగా సంకేతాలు
- డిమానిటైజేషన్ అనంతరం వేగవంతంగా జిడిపి వృద్ధి రేటు, నోట్ల రద్దు తర్వాత 5.4 లక్షలకు కొత్త పన్ను చెల్లింపుదారులు
- డిమానిటైజేషన్ దీర్ఘకాలంలో మిగులు నిధులను అందిస్తుంది
- రైతు రుణాల మాఫీతో జిడిపిలో 0.7 శాతం వరకు కోత, రూ.2.7 లక్షల కోట్లకు చేరిన రాష్ట్రాల రైతుల రుణాల మాఫీ
- బ్యాంకుల నుంచి రుణాలకు డిమాండ్ తగ్గడం మందగమనాకి దారితీస్తోంది
- ప్రభుత్వరంగ బ్యాంకుల కంటే వేగంగా ప్రైవేటు బ్యాంక్‌ల రుణాల వృద్ధి
- ఇంటి అద్దె అలవెన్స్ 40–100 బేసిస్ పాయింట్ల ద్రవ్యోల్బణం వైపు
- గతంలో మాదిరిగా భౌగోళిక రాజకీయాలు చమురు ధరలపై అంత ప్రభావమేమీ చూపవు
- షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంకుల స్థూల నిరర్థక అడ్వాన్స్‌లు (జిఎన్‌పిఎ)ల నిష్పత్తి 9.2 శాతం నుంచి 9.5 శాతానికి పెరిగింది.
- 2015–16లో 1.1 శాతం నుంచి 2016–17లో డిజిపిలో కరెంట్ ఖాతా లోటు(క్యాడ్) 0.7 శాతానికి పడిపోయింది.
- స్థూల జిడిపి ఇన్‌ఫ్లో 55.6 బిలియన్ డాలర్ల నుంచి 60.2 బిలియన్ డాలర్లకు గణనీయంగా పెరిగింది.
- 2017 మార్చి చివరినాటికి విదేశీ రుణ సూచికలు 2017 చివరినాటికి మెరుగయ్యాయి. 2017 మార్చి చివరినాటికి భారత్ మొత్తం విదేశీ రుణాల నిల్వ 471.9 బిలియన్ డాలర్లుగా నమోదైంది.
- 3.1 బిలియన్ డాలర్లు (2.7 శాతం) విదేశీ మారకద్రవ్యం గత ఏడాది 74.3 శాతంతో పోలిస్తే విదేశీ మారకద్రవ్యం 78.4 శాతం విదేశీ రుణాన్ని అందించింది. అయితే, విదేశీ మారకద్రవ్యం జిడిపికి 20.2 శాతానికి పడిపోయింది.
- రుణ సేవల నిష్పత్తి 8.8 శాతం నుండి 8.3 శాతానికి పడిపోయింది
- అత్యధిక స్థాయిలో నిరుద్యోగం, నైపుణ్య కొరత

ఎస్‌బిఐ లాభం రూ.3,105 కోట్లు

• క్యూ1 ఫలితాలపై మొండి బకాయిల భారం ప్రభావం

న్యూఢిల్లీ: దేశీయ అతిపెద్ద బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బిఐ(స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా) తొలి త్రైమాసిక ఫలితాల్లో నికర లాభం రూ.3,105.35 కోట్లు నమోదైంది. జూన్ 30 ముగింపునాటి క్యూ1(ఏప్రిల్–జూన్) ఫలితాలను శుక్రవారం బ్యాంక్ వెల్లడించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో బ్యాంక్ లాభం రూ.867.32 కోట్లుగా ఉంది. మొండి బకాయిలు మరింతగా పెరగడం వల్ల స్టాండలోన్ ఆధారంగా చూస్తే బ్యాంక్ లాభం 20 శాతం డౌన్ అయింది. అయితే గతేడాదితో పోలిస్తే మూడింతల వృద్ధిని నమోదు చేసింది. ఇక 2016–17 తొలి త్రైమాసికంలో బ్యాంకు ఆదాయం రూ.69,414.82 కోట్లు నమోదవగా, ప్రస్తుత ఏడాది జూన్ త్రైమాసికంలో ఆదాయం రూ.70,776 కోట్లకు పెరిగింది. 2016–17 చివరి త్రైమాసికంలో స్థూల నిరర్థక ఆస్తులు 6.9శాతం ఉండగా, ఈ ఏడాది జూన్ త్రైమాసికంలో అవి 9.97శాతానికి పెరిగాయి. నికర నిరర్థక ఆస్తులు కూడా 3.71 శాతం నుంచి 5.97 శాతం వరకూ పెరిగాయి. భారతీయ మహిళా బ్యాంక్‌తో సహా ఎస్‌బిబిజె, ఎస్‌బిఎం, ఎస్‌బిటి, ఎస్‌బిపి, ఎస్‌బిహెచ్ వంటి అనుబంధ సంస్థలను విలీనం చేసుకున్నందువల్ల ఈసారి త్రైమాసిక



ఫలితాలు పోల్చదగినవి కావని ఎస్‌బిఐ పేర్కొంది. అంతేకాక ప్రొవిజన్లు 53.1 శాతం పెరిగి రూ.21,054.74 కోట్లుగా నమోదైనాయి. రుణాలు ఇవ్వడం ద్వారా బ్యాంకు ఆర్జించిన నికర వడ్డీ ఆదాయం 22 శాతం పెరిగి రూ.17,606.01 కోట్లుగా నమోదైంది. ఇది గతేడాది రూ.14,437.31 కోట్లుగా ఉంది. ఇతర ఆదాయాలు 11.03 శాతం పెరిగి రూ.8,005.66 కోట్లకు చేరాయి. కాగా స్టాక్ మార్కెట్లలో ఎస్‌బిఐ షేర్లు 5 శాతానికి పైగా పతనమయ్యాయి.

బ్యాంక్ ఆఫ్ బరోడా లాభం డౌన్

క్యూ1(ఏప్రిల్–జూన్)లో బ్యాంక్ ఆఫ్ బరోడా(బిఒబి) నికర లాభం 52 శాతం పడిపోయింది. లాభం రూ.203.4 కోట్లుగా నమోదైంది. 2016 ఇదే సమయంలో లాభం రూ. 423.6 కోట్లుగా ఉంది. కేటాయింపులు రూ. 2,004 కోట్లతో పోలిస్తే రూ.2,368 కోట్లతో 18 శాతం పెరిగాయి.

30 శాతం క్షీణించిన యుబిఐ లాభం

జూన్ 30 ముగింపునాటి తొలి త్రైమాసిక ఫలితాల్లో ప్రభుత్వరంగ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యుబిఐ) నికర లాభం 30 శాతం క్షీణించింది. బ్యాంక్ లాభం రూ. 117 కోట్లకు పరిమితమైంది. మొండిబాకీలు, భారీ కేటాయింపులు కారణంగా లాభాలు తగ్గుముఖం పట్టాయి. స్థూల నిరర్థక ఆస్థులు ఏకంగా 10.16 శాతం నుంచి 12.63 శాతానికి పెరిగాయి. నికర నిరర్థక ఆస్తులు 6.16 శాతం నుంచి 7.47 శాతానికి పెరిగాయి. వరుస ప్రాతిపదికన లాభం పెరిగింది. మొండిబాకీలకు కేటాయింపులతో వార్షిక ప్రాతిపదికన చూస్తే 30 శాతం క్షీణించింది.



రూ.30,000 దాటిన పసిడి

ముంబయి: ఓ వైపు ఈక్విటీ మార్కెట్లు పతనమవుతుండగా, మరోవైపు బంగారం ధర పెరుగుతూ వస్తోంది. శుక్రవారం పది గ్రాముల పసిడి ధర రూ.130 పెరిగి రూ.30 వేల మార్కును చేరుకుంది. మూడు నెలల గరిష్ఠానికి చేరింది. అమెరికా, ఉత్తర కొరియాల మధ్య భౌగోళిక రాజకీయ ఉద్రిక్తత వంటి పరిస్థితుల నేపథ్యంలో బంగారం సురక్షితమైనది ఇన్వెస్టర్లు భావిస్తున్నారని విశ్లేషకులు అంటున్నారు. అదే సమయంలో శ్రావణ మాసం సందర్భంగా స్థానికంగా నగల తయారీదారుల నుంచి కొనుగోళ్లు భారీగా పెరడంతో బంగారం ధర పెరిగినట్లు బులియన్ ట్రేడ్ వర్గాలు వెల్లడించాయి. దేశ రాజధానిలో 99.9 శాతం, 99.5 శాతం స్వచ్ఛత కల్గిన బంగారం ధర వరుసగా రూ.30,020, రూ. 29,870కు చేరుకుంది. ఇదే బాటలోనే వెండి ధర కూడా పెరిగింది. కిలో వెండి ధర రూ.60 పెరిగి రూ.40,130కి చేరుకుంది. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి డిమాండ్ రావడంతో వెండి ధర పుంజుకున్నట్టు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. అంతర్జాతీయంగా 0.09 శాతం పెరిగి ఔన్సు బంగారం ధర 1,286.90 డాలర్లు పలికింది. జూన్ 14వ తేదీ తర్వాత ఇదే అత్యంత గరిష్ట స్థాయి.. ప్లాటినం కూడా 1.1 శాతం వృద్ధి చెందింది.


సెన్సెక్స్ నేలచూపులు

• ఈ వారంలో 1100 పాయింట్ల పతనం

ముంబయి: కొద్ది రోజులుగా లాభాలతో పైపైకి ఎగసిపడిన సూచీలు ఇప్పుడు నేలచూపులు చూస్తున్నాయి. డొల్ల కంపెనీలపై సెబీ చర్యలు, భౌగోళిక రాజకీయ పరిస్థితులు, అమెరికా– ఉత్తరకొరియా మధ్య ఉద్రిక్త వాతావరణం వంటివి సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. దీంతో ఈ వారంలో స్టాక్ మార్కెట్లు భారీగా పతనమయ్యాయి. సోమవారం నుంచి ప్రారంభమైన నష్టాలు వారాంతం వరకూ అలాగే కొనసాగాయి. శుక్రవారం కూడా సూచీలు భారీ నష్టాలు చూడగా.. సెన్సెక్స్ 300 పాయింట్లకు పైగా కోల్పోయింది. నిఫ్టీ 9,800 పాయింట్ల దిగువకు పడిపోయింది. మరోవైపు ఎస్‌బిఐ(స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా) తొలి త్రైమాసిక ఫలితాల నేపథ్యంలో షేరు భారీగా పతనమైంది. దీంతో బ్యాంకింగ్ రంగాల షేర్లు నష్టాల బాట పట్టాయి. ఈ పరిస్థితుల మధ్య మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గుచూపారు. అలాగే నష్టాల దిశగా పయనించిన సూచీలు చివరకు 318 పాయింట్లు కోల్పోయి 31,213 వద్ద ముగిశాయి. అటు నిఫ్టీ కూడా 109 పాయింట్ల నష్టంతో 9,711 వద్ద స్థిరపడింది. ఇటీవల సూచీలు జీవనకాల గరిష్ఠాలను తాకగా, ఇదంతా వారం రోజుల్లోనే తుడిచిపెట్టుకుపోయింది. సూచీలు వారం రోజుల్లో భారీగా కుదేలయ్యాయి. సోమవారం నుంచి శుక్రవారం వరకు సెన్సెక్స్ దాదాపు 1100 పాయింట్లు కోల్పోగా, నిఫ్టీ 350 పాయింట్ల వరకు పతనమైంది. ఇక ఎన్‌ఎస్‌ఇలో ఎస్‌బిఐ షేర్లు భారీగా పడిపోయాయి. తొలి త్రైమాసిక ఫలితాలు అంచనాలను దాటినా, మొండిబకాయిలు పెరిగాయి. దీంతో షేరు విలువ 5.5శాతానికి పడిపోయింది. హిందాల్కో, వేదాంతా షేర్లు కూడా 6 శాతానికి పైగా పడిపోయాయి. డాక్టర్ రెడ్డీస్, అరబిందో ఫార్మా, గెయిల్, భారత్ పెట్రోలియం, ఎస్‌బ్యాంక్ షేర్లు స్వల్పంగా లాభాలను చూశాయి.

నిరాశపర్చిన సన్‌ఫార్మా

దేశీయ ఫార్మా దిగ్గజం సన్‌ఫార్మా మార్కెట్ తొలి త్రైమాసిక ఫలితాల్లో అందరినీ నిరాశపర్చింది. ఈ సంస్థ



రూ.425 కోట్ల నికర నష్టాన్ని నమోదు చేసింది. అంచనాలను మించి భారీ నష్టాలను మూటగట్టుకుంది. జూన్ 30తో ముగిసిన త్రైమాసికానికి రూ.424.92 కోట్లు నష్టపోయినట్లు సన్ ఫార్మాస్యూటికల్ ఇండస్ట్రీస్ ప్రకటించింది. దాదాపు వెయ్యి కోట్ల లాభాలను ఆర్జించనుందని విశ్లేషకలు అంచనా వేయగా, అంచనాలను అందుకోలేకపోయింది. ఆదాయం 25శాతం క్షీణించింది. అంతకు ముందు ఏడాది ఇదే కాలంలో రూ.8,256 కోట్లతో పోలిస్తే ఈ త్రైమాసికంలో కంపెనీ మొత్తం ఆదాయం రూ.6,208.79 కోట్లుగా నిలిచింది. ఎబిటా మార్జిన్లు 17. 6 శాతంగా నిలిచాయి. మరోవైపు వన్ టైం లాస్‌గా రూ.950.5 కోట్లను నష్టపోయినట్టు సన్ ఫార్మా ప్రకటించింది. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్‌పై సన్‌ఫార్మా షేరు విలువ 2.67 శాతం పడిపోయి రూ.448.50కు చేరుకుంది.



కరీంనగర్ కేంద్ర సహకార బ్యాంక్‌కు అత్యుత్తమ అవార్డు

మన తెలంగాణ/ హైదరాబాద్ : కరీంనగర్ కేంద్ర సహకార బ్యాంక్ అత్యుత్తమ ప్రదర్శనకు గాను అవార్డు దక్కింది. ఈ అవార్డును తమిళనాడు ఆర్థిక, సహకార శాఖ మంత్రి చేతుల మీదుగా శుక్రవారం టిఎస్క్యాబ్ అధ్యక్షులు కొండూరు రవీందర్‌రావు, సిఇఒ సత్యనారాయణ రావు అందుకున్నారు. నేషనల్ ఫేడరేషన్ ఆఫ్ కో ఆపరేటివ్ బ్యాంక్ (ఎన్ఎఎఫ్ఎస్‌సిఒబి) 2015–16లో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చిన జిల్లా సహకార బ్యాంకులపై సర్వే చేసింది. ఇందులో కరీంనగర్ కేంద్ర సహకార బ్యాంక్ మొదటి స్థానంలో నిలిచింది. అవార్డును అందుకోవడం సంతోషంగా ఉందని కొండూరు రవీందర్‌రావు శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఫార్మాసిటీ, మెడ్ డివైజెస్ పార్కుల్లో పెట్టుబడులకు ఆసక్తి

కెటిఆర్‌తో భేటీలో యుఎఇ పారిశ్రామిక వేత్త బిఆర్ షెట్టి

మన తెలంగాణ / హైదరాబాద్ : ముచ్చెర్లలో నిర్మించనున్న హైదరాబాద్ ఫార్మాసిటి, మెడ్ డివైజెస్ పార్కులో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తిగా ఉన్నట్లు యూఏఈకు చెందిన ప్రముఖ పారిశ్రామిక వేత్త, యుఏఈ ఎక్ఛేంజ్ ఛైర్మన్ బిఆర్ షెట్టి తెలియజేశారు. బేగంపేటలోని సిఎం క్యాంపు కార్యాలయంలో మంత్రి కెటిఆర్‌తో సమావేశం అయిన ఆయన ఈ సందర్భంగా తెలంగాణలో పెట్టుబడులకు సూచన ప్రాయ అంగీకారం తెలిపారు. ఫార్మాసిటి, మెడికల్ డివైజెస్ పార్కుల్లో పెట్టుబడులు పెట్టాలని మంత్రి కెటిఆర్ కోరారు. టిఎస్ ఐపాస్‌ను బిఆర్ షెట్టికి వివరించారు. తెలంగాణలోకి మరిన్ని పెట్టుబడులు వచ్చేందుకు అవసరం అయితే తాను స్వయంగా సహకరిస్తానని ఈ సందర్భంగా బిఆర్ షెట్టి తెలిపారు. ఈ మేరకు దుబాయ్, అబుదాబీల్లోని పారిశ్రామిక వేత్తలతో సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ తదితరులు పాల్గొన్నారు.



స్టాక్ మార్కెట్


ఈరోజు మార్కెట్	ముగింపు	మార్పు	%
సెన్సెక్స్	31213.59	-317.74	1.01%
నిఫ్టీ	9710.80	-109.45	1.11%

కరెన్సీ మారక రేట్లు

అమెరికన్ డాలర్	64.4700
యూరో	70.4270
బ్రిటిష్ పౌండ్	83.4957
ఆస్ట్రేలియన్ డాలర్	47.4050
కెనెడియన్ డాలర్	47.0500
ఎమిరైట్ దిర్హామ్	17.5040
స్విస్ ఫ్రాంక్	64.5500
చైనీస్ యువాన్	9.3344
మలేషియన్ రింగిట్	14.8460
న్యూజిలాండ్ డాలర్	44.4990
హాంగ్‌కాంగ్ డాలర్	8.2824
జపనీస్ యెన్	0.5688
కువైట్ దినార్	212.0888
సౌతాఫ్రికన్ రాండ్	4.7209

బులియన్






బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22క్యారట్	24క్యారట్	మార్పు(%)
చెన్నై	27840	29775.40	1.02%
ముంబై	28410	30385.03	0.18%
ఢిల్లీ	27850	29786.10	0%
కోల్‌కతా	28310	30278.07	1.62%
కేరళ	27200	29090.91	0.93%
బెంగళూరు	26920	28791.44	0%
హైదరాబాద్	27820	29754.01	1.05%
గల్ఫ్	1355.98	1450.25	0.71%

వెండి ధర (రూ./ కిలో)

నగరం	శుక్రవారం	గురువారం	మార్పు (%)
చెన్నై	41100.00	40000.00	2.75
ముంబై	41100.00	40000.00	2.75
ఢిల్లీ	41100.00	40000.00	2.75
కోల్‌కత్తా	41100.00	40000.00	2.75
హైదరాబాద్	41100.00	40000.00	2.75



కోడిగుడ్లు (100కు) నెక్ రేటు

హైదరాబాద్	---	విశాఖపట్నం	348
వరంగల్	337	చిత్తూరు	375
విజయవాడ	343	చెన్నై	382
గోదావరి	343	బెంగళూరు	370

IRCTC


ఈపే లేటర్ ద్వారా రైల్వే ఐఆర్‌సిటిసి బుకింగ్ సౌకర్యం

మన తెలంగాణ / హైదరాబాద్ : రైల్వేలో తత్కాల్ టికెటింగ్ సౌకర్యం మరింత సులభతరం చేసేలా ఐఆర్‌సిటిసి తాజాగా ఈపే లెటర్‌తో భాగస్వామ్యం కుదుర్చుకుంది. బుధవారం పార్లమెంటు సమావేశాల్లో రైల్వేమంత్రి రాజేశ్ గోహైష్ ఈ విషయంపై మాట్లాడుతూ బుక్‌నౌ.. పే లేటర్ సేవతో రైల్వే ప్రయాణికులు టికెటింగ్‌లో మరింత సౌలభ్యం పొందవచ్చన్నారు. ఆన్‌లైన్‌లో ఈపే లేటర్ ద్వారా 3 సెకన్లలోనే రైల్వే టిక్కెట్లు బుక్ చేయనచ్చని రేల్ మంత్రిత్వశాఖ ట్విట్టర్ వేదికగా ఒక ట్విట్‌ను పోస్ట్ చేశారు.

19 శాతం పెరిగిన మహేశ్ బ్యాంకు డిపాజిట్లు

మన తెలంగాణ/ హైదరాబాద్: 2016–17 ఆర్థిక సంవత్సరంలో 16.93 శాతం వృద్ధితో రూ.3,300 కోట్ల పైచిలుకు వాణిజ్యం చేసామని మహేశ్‌బ్యాంకు ప్రకటించింది. తమ వాటాదార్లకు 18 శాతం డివిడెంట్‌ను ప్రకటించింది. ఫ్యాప్సీభవన్‌లో జరిగిన 41వ సర్వసభ్య సమావేశంలో వాటాదార్లను ఉద్దేశించి బ్యాంకు చైర్మన్, పురుషోత్తమ్‌దాస్ మంధానా ప్రసంగిస్తూ బ్యాంకులో డిపాజిట్లు 19.19 శాతం పెరిగాయని, 12.65 శాతం శాతం మేర రుణాలు పెరిగి, రూ. 1109.69 కోట్లకు చేరాయన్నారు. లాభం రూ. 29.82 కోట్ల నుంచి రూ.30.63 కోట్లకు చేరిందన్ని, బ్యాంకు స్వంత నిధులు గత ఏడాదిలో రూ.229.49 కోట్లు ఉండగా, తాజాగా రూ. 244.82 కోట్లకు పెరిగాయన్నారు. రిజర్వ్ బ్యాంకు నిర్దేశించిన 9 శాతంకు మించి, బ్యాంకు మూలధన పర్యావ్తతా నిష్పత్తి 18.50కి చేరిందని వివరించారు. తమ బ్యాంకు వినియోగదారుల కోసం కొత్తగా ప్రవేశపెట్టిన భారత్ బిల్లు చెల్లింపు వ్యవస్థను, వెబ్ పోర్టల్ సేవలను ఇతర వినియోగదారులు కూడా వినియోగించుకునే అవకాశం ఉందని, కరెంటు, గ్యాస్, టెలిఫోన్ బిల్లులు కట్టుకునే అవకాశం ఉందన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో కొత్త రెండు శాఖలు తెరుస్తామని, రూ. 3800 కోట్ల వాణిజ్యంతో రూ. 31 కోట్ల లాభార్జనే లక్ష్యమని మంధానా పేర్కొన్నారు. బ్యాంకు ప్రధాన కార్యనిర్వహణాధికారి, మేనేజింగ్ డైరెక్టర్ ఉమేష్‌చంద్, వైస్‌చైర్మన్ రామ్‌పాల్ అట్టల్ తదితరులు పాల్గొన్నారు.

సవాళ్లను తిప్పికొట్టేందుకు సైన్యం రెడీ : జైట్లీ



న్యూఢిల్లీ: ఎలాంటి అవాంఛనీయ ఘటనలను అయినా ఎదుర్కొనేందుకు సైన్యం సిద్ధంగా ఉందని రక్షణ మంత్రి అరుణ్ జైట్లీ స్పష్టం చేశారు. డోక్లామ్ వద్ద చైనా–భారత్ బలగాల మధ్య ఉద్రిక్తత నెలకొని ఉన్న దశలో జైట్లీ లోక్‌సభలో ప్రకటన చేశారు. చైనాతో ప్రతిష్టంభన, సైనిక చర్య గురించి చైనా వర్గాలు హెచ్చరికలు వెలువరిస్తున్న సమయంలో పరిస్థితి మరింత సంక్లిష్టంగా మారింది. టిబెట్‌లో చైనా సైనిక బలగాల కదలికలపై ప్రభుత్వ స్పందన గురించి శుక్రవారం సభలో ప్రతిపక్షాలు ప్రశ్నించాయి. భారత రక్షణ వ్యవస్థ, రక్షణ రంగం కన్నా పాకిస్థాన్ వ్యవస్థ మెరుగ్గా ఉందని ఇటీవల ఓ సీనియర్ సైనికాధికారి చేసిన వ్యాఖ్యలను కూడా సభ్యులు ప్రస్తావించారు. దీనిపై రక్షణ మంత్రిత్వశాఖ బాధ్యతలను కూడా చూస్తున్న జైట్లీ జవాబిచ్చారు. డోక్లామ్ సంబంధిత అంశాలను ప్రస్తావించకుండా జైట్లీ తమ జవాబులో భారతీయ సైన్యం ఎలాంటి పరిణామాలను అయినా తిప్పికొట్టేందుకు సిద్ధంగా ఉందని, భయాందోళనల అవసరం లేదని భరోసా ఇచ్చారు. యుద్ధం అంటూ జరిగితే భారతీయ సైన్యం వద్ద కేవలం 22 రోజులకు సరిపడా మందుగుండు సామాగ్రే ఉందని ఇటీవల కాగ్ నివేదికలో పేర్కొన్న అంశాలను సభ్యులు ప్రస్తావించారు. దీనికి మంత్రి సమాధానమిస్తూ ఈ విషయంలో గణనీయమైన పురోగతి ఉందని చెప్పారు. ఎక్కువగా దీనిని వివరించలేదు.

సీట్లు నిండని కాలేజీల గేట్లు మూత

న్యూఢిలీ: ప్రవేశాలు తక్కువగా ఉన్న ఇంజనీరింగ్ కళాశాలలను మూసివేయడం జరుగుతుందని సాంకేతిక విద్యా జాతీయ మండలి (ఎఐసిటిఇ) తెలిపింది. దేశవ్యాప్తంగా వివిధ ఇంజనీరింగ్ కాలేజీలలో నిర్ణీత కోటాతో పోలిస్తే 27 లక్షల సీట్లు భర్తీ కాకుండా ఖాళీగా ఉన్నాయి. దీనిని పరిగణనలోకి తీసుకుంటున్నట్లు, ఆయా కాలేజీలలో అడ్మిషన్ల ప్రక్రియను బేరీజు వేసుకుని వాటిని మూసివేయనున్నట్లు సంస్థ ఛైర్మన్ అనిల్ డి సహస్రబుద్ధే శుక్రవారం తెలిపారు. గత ఐదేళ్లలో 30 శాతం కన్నా తక్కువ అడ్మిషన్లు నమోదు అయిన కాలేజీలపై వేటు తప్పదని స్పష్టం చేశారు. దేశంలో సాంకేతిక విద్య నియంత్రణను ఈ జాతీయ మండలినే నిర్వహిస్తుంది. ప్రవేశాలు తక్కువగా ఉండే కాలేజీలు నిరర్థకం అని, వచ్చే విద్యా సంవత్సరం నుంచి వీటిని మూసివేయడం జరుగుతుందని వివరించారు.

భూటాన్ విదేశాంగ మంత్రితో సుష్మా భేటీ




ఖాట్మాండు: సిక్కిం సెక్టార్‌లోని డోక్లాం ప్రాంతంలో భారత్, చైనా సైనిక బలగాల మధ్య ప్రతిష్టంభన నెలకొన్న నేపథ్యంలో శుక్రవారం భూటాన్ విదేశాంగ శాఖ మంత్రి డామ్చో డోర్జితో భారత విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్ సమావేశ మయ్యారు. ఈ సమావేశంలో డోక్లాం వివాదంపై ఉభయలిద్దరూ ఇరుదేశాల మధ్య పలు ద్వైపాక్షిక అంశాలపై చర్చిం చారు. దక్షిణాసియా, ఆగ్నేయాసియాలతో కూడిన మల్టీ సెక్టోరల్ టెక్నికల్ అండ్ ఎకానమిక్ కోఆపరేషన్ (బిఐఎం ఎస్‌టిఇసి) సమావేశంలో సందర్భంగా సుష్మా డోర్జిని కలుసుకున్నారు. బిఐఎంఎస్‌టిఇసిలో బంగ్లాదేశ్, భారత్, మయి న్మార్, శ్రీలంక, థాయిలాండ్, భూటాన్, నేపాల్ సభ్యులుగా ఉన్నాయి. అయితే ఈ సమావేశంలో ఇద్దరు నేతల మధ్య జరిగిన చర్చపై ఎలాంటి అధికారిక ప్రకటన వెల్లడికాలేదు.

జయ మృతిపై మరో పిల్



చెన్నై: తమిళనాడు దివంగత ముఖ్యమంత్రి జయలలిత మృతిపై విచారణకు మద్రాసు హైకోర్టులో తాజాగా మరో పిటిషన్ దాఖలైంది. జయ మృతిపై విచారణ జరపాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఎస్.ఎ.మియాజన్ అనే సామాజిక కార్యకర్త కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. జయ మృతికి అసలు కారణాన్ని గుర్తించేందుకు మళ్లీ పోస్టుమార్టం నిర్వహించాలని ఆయన పిటిషన్‌లో కోరారు. ఈ పిటిషన్‌ను స్వీకరించిన చీఫ్ జస్టిస్ ఇందిరా బెనర్జీ, జస్టిస్ ఎం. సుందర్‌లతో కూడిన తొలి బెంచ్.. ఇప్పటికే కోర్టులో ఇదే అంశంపై దాఖలైన ఇతర పిటిషన్లతో కలిపి అక్టోబర్ 23న విచారించనుంది. గత ఏడాది డిసెంబర్‌లో జయ మృతిపై విచారణ జరపాలంటూ ఆర్‌ఎస్ అధికారి బి.బాల మురగన్, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ కస్టమ్స్, సెంట్రల్ ఎక్సైజ్ అండ్ సర్వీసు టాక్స్ ట్రిబ్యునల్, సామాజిక కార్యకర్త ట్రాఫిక్ రామస్వే పలువురు ఇటీవల మద్రాసు హైకోర్టులో పిటిషన్‌లు దాఖలు చేశారు.

స్వాతంత్ర్యం కోసం ధనిక, బీద అందరూ పోరాడారు : ఆజాద్



న్యూఢిల్లీ: దేశ స్వాతంత్ర్యం కోసం పేదలు, ధనికులు అందరూ కలిసి పోరాటం చేశారని కాంగ్రెస్ నేత గులాం నబీ ఆజాద్ అన్నారు. రాజ్యసభలో ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్యనాయుడుకు సన్మాన సమావేశంలో ప్రధాని నరేంద్ర మోడీ మాట్లాడుతూ స్వాతంత్ర్యం కోసం పేద ప్రజలు పోరాడారని మోడీ అన్నారు. మోడీ ప్రసంగాన్ని ప్రస్తావించకుండా దేశ స్వాతంత్ర్యం కోసం పేదలు, మోతీలాల్ నెహ్రూ వంటి ధనికులు పోరాడినట్లు ఆజాద్ తెలిపారు. పేదలు సైతం అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి అయ్యే అవకాశం రాజ్యాంగం కల్పించిందన్నారు. సీతారాం ఏచూరి, నాయుడు వంటి వారు ఉన్నత పదవుల్లోకి వచ్చారని ఆజాద్ తెలిపారు. దేశ ప్రజలందరూ ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేశారన్నారు. ధనికులు సైతం దేశ స్వాతంత్ర్యం కోసం తమ ధనాన్ని వెచ్చించారని , అనేక సంవత్సరాల్లో జైళ్లల్లో గడిపిన విషయాన్ని మరిచి పోకూడదని ఆజాద్ తెలిపారు.

సైనిక స్కూళ్లలో బాలికలకు ప్రవేశం?

న్యూఢిల్లీ: సైనిక స్కూళ్లలో బాలికలు, నేషన్ డిఫెన్స్ అకాడమీలో మహిళా క్యాడెట్లకు ప్రవేశం కల్పించాలనే ప్రతిపాదన కేంద్ర పరిశీలిస్తోందని ప్రభుత్వం లోక్‌సభకు తెలిపింది. శుక్రవారం కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి సుభాష్ రామ్‌రావు భామ్రే లోక్‌సభలో సమాధానమిస్తూ సైనిక స్కూళ్లు, డిఫెన్స్ అకాడమీలో మహిళా క్యాడెట్ల ప్రవేశంపై పరిశీలిస్తున్నామని తెలిపారు. దేశ వ్యాప్తంగా 26 సైనిక స్కూళ్లు ఉన్నాయన్నారు. 21 స్కూళ్లను ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన పెండింగ్ ఉందని తెలిపారు. ఇందు కోసం ఈ ఏడాది బడ్జెట్‌లో 80 కోట్లు కేటాయించినట్లు ఆయన తెలిపారు. సైనిక, రాష్ట్రీయ మిలిటరీ స్కూళ్లలో తమ ప్రయోజనాన్ని వినియోగించు కోవడంతో నేషనల్ డిఫెన్స్ అకాడమీలో అధిక సంఖ్యలో క్యాడెట్లు చేరుతున్నారని రక్షణ శాఖ మంత్రి అరుణ్ జైట్లీ తెలిపారు.

శశికళ, దినకరన్ పదవులు రద్దు చేయాలి

–ఎన్నికల సంఘానికి పన్నీర్‌సెల్వం వర్గం వినతి

న్యూఢిల్లీ : ఎఐఎడిఎంకెలో శశికళ, దినకరన్‌ల పదవులు చెల్లనివిగా ప్రకటించాలని ఎఐఎడిఎంకె పన్నీర్ సెల్వం వర్గం ఎన్నికల కమిషన్‌ను మరోసారి డిమాండ్ చేసింది. శశికళ తాను జైలుకు వెళ్లడానికి కొన్ని గంటల ముందు ఆమె మేనల్లుడు దినకరన్‌ను డిప్యూటీ పదవిలో నియమించారు. గురువారం ముఖ్యమంత్రి పళనీస్వామి అధ్యక్షతన జరిగిన పార్టీ సమావేశంలో పార్టీ నిబంధనలకు విరుద్ధంగా దినకరన్‌ను ఉన్నత పదవిలో నియమించారని తీర్మానాన్ని ఆమోదించారు. ఎన్నికల కమిషన్‌కు పన్నీర్‌సెల్వం వర్గ ప్రతినిధి బృందం అఫిడవిట్‌తోపాటు ఎఐఎడింకె తీర్మానాన్ని అందజేసింది.

రాందేవ్‌బాబా జీవిత చరిత్ర పుస్తకంపై నిషేధం

న్యూఢిల్లీ: యోగ గురువు రాందేవ్ బాబా జీవితంపై వచ్చినట్లుగా చెబుతున్న పుస్తకాన్ని ముద్రించడం, విక్రయించరాదని పబ్లిషర్, రెండు ఇ కామర్స్ సంస్థలపై ఢిల్లీ కోర్టు నిషేధం విధించింది. 'గాడ్ మ్యాన్ టు టైకూన్' పుస్తకంలోని అంశాలు రాందేవ్‌ను కించపరిచేలా ఉన్నాయని ఫిర్యాదులు రావడంతో తదుపరి ఆదేశాలు వచ్చే వరకు ఆ పుస్తకంపై అడిషనల్ సివిల్ జడ్జి నిపున్ అవస్థి నిషేధం విధించారు. రాందేవ్‌ను సంప్రదించకుండా చుట్టు పక్కల వ్యక్తుల నుంచి తెలుసుకున్న విషయాలతో పుస్తకాన్ని తీసుకురావడం ఆయనకు నష్టం చేకూర్చ వచ్చని న్యాయమూర్తి తెలిపారు. ఆ పుస్తకాన్ని విక్రయించరాదని ఫ్లిప్‌కార్ట్, అమెజాన్ ఆన్‌లైన్ సంస్థలను ఆదేశించారు. కొందరు తమకు ఫోన్ చేసి బెదిరిస్తున్నారని పబ్లిషర్ తెలిపారు. ఎవరైనా న్యాయపరంగా కోర్టుకు వెళ్లొచ్చని ఆయన తెలిపారు. రాందేవ్‌తో సహా 50 మంది ని ఇంటర్వ్యూ చేసి పుస్తకాన్ని ముద్రించినట్లు పబ్లిషర్ తెలిపారు. జర్నలిస్ట్ ప్రియాంకా పాఠక్ నరేన్ ఈ పుస్తకాన్ని రచించి ముద్రించారు.



బిజెపిని ఎదుర్కొనేందుకు

ఉమ్మడి వ్యూహం

16 ప్రతిపక్షాల నిర్ణయం.. సోనియా ఆధ్వర్యంలో సమావేశం

న్యూఢిల్లీ: బిజెపిని సమగ్ర రీతిలో ఎదుర్కొనేందుకు ఉమ్మడి వ్యూహం రూపొందించుకోవాలని ప్రతిపక్షాలు నిర్ణయించాయి. కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీ చొరవతో, ఆమె అధ్యక్షతననే శుక్రవారం జరిగిన సమావేశంలో 16 ప్రతిపక్ష పార్టీల నేతలు ఉమ్మడి వ్యూహరచనకు రంగం సిద్ధం చేయాలని సంకల్పించారు. బిజెపి విధానాలను ప్రజలలో తగు రీతిలో ఎండగట్టేందుకు,ప్రత్యామ్నాయ గళంగా మారేందుకు సరైన విధివిధానాలను రూపొందించుకోవాలని నిర్ణయించారు. పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న సమయంలోనే ఈ ప్రతిపక్ష కీలక సమావేశం జరగడం గమనార్హం. బిజెపి అనుసరిస్తోన్న విధానాలు ప్రజా వ్యతిరేకంగా, కంటకంగా మారుతున్న వైనాన్ని తగురీతిలో ప్రజల వద్దకు తీసుకువెళ్లాల్సి ఉందని, ఇందుకు ప్రతిపక్షాలు ఉమ్మడిగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని నిర్ణయించారు. ప్రజలకు ప్రతిపక్షం బలమైన నిజమైన గళంగా మారాల్సి ఉందని ఈ భేటీలో సంకల్పించారు. బిజెపిని అన్ని స్థాయిలలో సరైన రీతిలో ప్రతిఘటించేందుకు వీలుగా సరైన వ్యూహరచనకు ఒక ఉప బృందాన్ని ఏర్పాటు చేయాలని ప్రతిపక్షాలు నిర్ణయించాయి. ఈ సబ్ గ్రూప్ ఏర్పాటుపై నిర్ణయాధికారాన్ని సోనియాకు అప్పగించారు. ప్రజల తక్షణ సమస్యలపై ప్రతిపక్షాలు తగు రీతిలో స్పందించడం, పార్లమెంట్ శీతాకాల సమావేశాలకు ముందుగానే ఉమ్మడిగా ప్రజలలోకి వెళ్లే అంశాన్ని పరిశీలించడం వంటివి ఈ ఉప బృందం ఖరారు చేస్తుంది, కీలక సమావేశం తరువాత వివరాలను కాంగ్రెస్ నేత గులాం నబీ ఆజాద్ విలేకరులకు తెలిపారు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమత బెనర్జీ, వామపక్ష నేతలు, జెడియూ ఎంపి అలీ అన్వర్ అన్సారీ ఇతరులు కూడా సమావేశానికి హాజరయ్యారు. అయితే శరద్ పవార్ నాయకత్వంలోని ఎన్‌సిపికి ఆహ్వానం పంపినా భేటీకి రాలేదు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్, రాహుల్ గాంధీ, అహ్మద్ పటేల్, ఎకె ఆంటోనీ, సిపిఐ నేత డి రాజా, సిపిఎం నాయకులు సీతారాం ఏచూరి, ఆర్‌ఎల్‌డి నుంచి అజిత్‌సింగ్, డిఎంకె నేత తిరుచ్చి శివ, బిఎస్‌పి నుంచి సతీష్ మిశ్రా, ఎస్‌పి నుంచి నరేష్ అగర్వాల్ సమావేశానికి హాజరయిన వారిలో ఉన్నారు. ఇక నేషనల్ కాన్ఫరెన్స్, జెఎంఎం, జెడిఎస్, ఎఐయుడిఎఫ్, ఆర్‌ఎస్‌పి , ఐయుఎంఎల్ నేతలు కూడా సమావేశానికి వచ్చారు. ప్రతిపక్షాలు ఇప్పటికే అధికార పక్షం వైఖరిని ప్రతిఘటించేందుకు ఉమ్మడిగా వ్యవహరిస్తున్నాయని, పార్లమెంట్ వర్షాకాల సమావేశాల సందర్భంగా సభలలో సరైన రీతిలో సమన్వయం కనబడిందని ఆజాద్ చెప్పారు. వచ్చే మూడు నెలలు కీలకమైనవని, ఈ సమయంలో ప్రజా సమస్యలను సరైన రీతిలో పార్లమెంట్‌లో వెలుపల బలంగా విన్పించేందుకు ఉమ్మడి వ్యూహం రూపొందించుకోవడం జరుగుతుందని ఆజాద్ వెల్లడించారు. వ్యవసాయ, కార్మిక సంక్షోభం, దైనందిన సమస్యలపై ప్రజల పక్షాన మరింత బలంగా నిలబడేందుకు, ప్రధాని మోడీ , బిజెపి వైఖరిని ప్రతిఘటించేందుకు ప్రతిపక్షాలు బలీయమైన వివరణాత్మక ప్రత్యామ్నాయ వేదికగా మారాల్సి ఉందని సిపిఎం నేత సీతారాం ఏచూరి తెలిపారు. క్షేత్రస్థాయిలో బిజెపిని తిప్పికొట్టేందుకు అన్నివిధాలుగా ఉమ్మడి వ్యూహాన్నిరూపొందించుకోవల్సి ఉందని స్పష్టం చేశారు. దేశంలో దళితులు,మైనార్టీలపైదాడులు వంటి వాటిని దేశవ్యాప్తంగా ప్రస్తావిస్తామని ఆజాద్ తెలిపారు. అనారోగ్యం కారణంగానే శరద్ పవార్ ఈ సమావేశానికి రాలేదని వెల్లడించారు.

సీనియర్ ఐఎఎస్ అధికారి

ఆత్మహత్య

• ఘటనాస్థలిలో సూసైట్ నోట్ లభ్యం • బీహార్ సిఎం నితీశ్ విచారం



ఘజియాబాద్ (యుపి) : బీహార్‌లోని బక్సర్ జిల్లాకి చెందిన ఒక సీనియర్ ఐఎఎస్ అధికారి మృతదేహాన్ని ఇక్కడ రైల్వే పట్టాలకు సమీపంలో గురువారం రాత్రి పొద్దుపోయాక గుర్తించామని పోలీసులు తెలిపారు. ఘటనాస్థలి వద్ద సూసైట్ నోట్ కూడా లభించిందని వారు చెప్పారు. పోలీసులు చెప్పిన వివరాల్లోకెళితే...రాష్ట్రంలోని బక్సర్ జిల్లా మెజిస్ట్రేట్ ముకేశ్ పాండే మృత దేహం స్థానిక రైల్వే స్టేషన్‌కి దాదాపు కిలో మీటర్ దూరంలో పట్టాలపై కన్పించింది. అక్కడే ఒక సూసైడ్ నోట్ కూడా లభించింది. ఈ ఘటనపై బీహార్ రాష్ట్ర సిఎం నితీశ్ కుమార్ విచారం వ్యక్తం చేశారు. పాండే ఒక సమర్థవంతమైన, సున్నితమైన అధికారి అని ఆయన కొనియాడారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని నితీశ్ ట్వీట్ చేశారు. 2012 బ్యాచ్ ఐఎఎస్ అధికారి పాండే తన సూసైడ్ నోట్‌లో..జీవితంపై విరక్తి చెందానని, మనిషి మనుగడపై విశ్వాసం కోల్పోయానని పేర్కొన్నారు. 'నేను పశ్చిమ ఢిల్లీలోని జనక్‌పురి ప్రాంతంలో ఉన్న ఒక భవంతి 10వ అంతస్థు నుండి దూకి ఆత్మహత్య చేసుకుంటున్నాను. జీవితంపై విరక్తి చెందాను. మనిషి మనుగడపై నాకు విశ్వాసం పోయింది. నా సూసైడ్ నోట్ ఢిల్లీలోని ఒక ఐదు నక్షత్రాల హోటల్‌లో 742 నంబరు గదిలో ఉన్న నైక్ బ్యాగులో ఉంచాను. నన్ను క్షమించండి' అని పాండే రాసిన సూసైడ్ నోట్‌లో ఉందని సీనియర్ ఎస్‌పి హెచ్‌ఎన్ సింగ్ తెలిపారు. మరోవైపు ఇక్కడ కొత్గావ్‌కి సమీపంలో ఘటనాస్థలికి చేరుకున్న ప్రభుత్వ రైల్వే పోలీసు (జిఆర్‌పి) అధికారులు విచారణ చేపట్టకుండానే పాండేది ఆత్మహత్య కావొచ్చనే అభిప్రాయాన్ని ప్రాథమికంగా వ్యక్తం చేశారు.

లోక్‌సభలో 'నో–డిటెన్షన్' పాలసీ బిల్లు

న్యూఢిల్లీ : విద్యా హక్కు చట్టం (ఆర్‌టిఇ) చట్టం కింద పాఠశాలల్లో ఎనిమిదో తరగతి వరకు నోడిటెన్షన్ పాలసీ రద్దుకు ఉద్దేశించిన బిల్లును లోక్‌సభలో శుక్రవారం ప్రవేశపెట్టారు. దీనికి సంబంధించిన పిల్లల స్వేచ్ఛా, నిర్బంధ విద్య (సవరణ) బిల్లు, 2017ని మానవ వనరుల అభివృద్ధి శాఖ సహాయ మంత్రి ఉపేంద్ర కుష్వాహ సభలో ప్రవేశపెట్టారు. ఈ నెల 3న ఈ బిల్లుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపిన సంగతి విదితమే. బిల్లులోని ప్రతిపాదనల ప్రకారం, ఐదో తరగతి, ఎనిమిదో తరగతి విద్యార్థులు తమ వార్షిక పరీక్షల్లో ఉత్తీర్ణులు కాకపోతే వారిని అదే తరగతిలోనే నిర్బంధించే అధికారం సంబంధిత రాష్ట్రాలకుంటుంది. అయితే నిర్బంధంలో ఉంచడానికి ముందుగా వారికి మరో అవకాశం ఇస్తారు. ఆర్‌టిఇ చట్టంలోని ప్రస్తుత నిబంధనల ప్రకారం, ఉత్తీర్ణతతో సంబంధం లేకుండా విద్యార్థులను ఎనిమిదో తరగతి వరకు పాఠశాలలు నిరాటంకంగా ప్రమోట్ చేస్తున్నాయి. కాగా, ఏప్రిల్ 1, 2010న అమల్లోకి వచ్చిన ఈ చట్టంలోని కీలక నిబంధనల్లో ఇదొకటి కావడం గమనార్హం.

లోక్‌సభలో 14, రాజ్యసభలో 9

• 23 బిల్లులకు పార్లమెంట్ ఆమోదం • ఉభయసభలు నిరవధిక వాయిదా • గోరక్షకుల దాడులు, వ్యవసాయ సంక్షోభం సహా పలు అంశాలపై దద్దరిల్లిన సభలు




న్యూఢిల్లీ: పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు శుక్రవారం నిరవధికంగా వాయిదా పడ్డాయి. ఉభయసభలు 26 రోజుల్లో మొత్తం 19 సార్లు సమావేశమయ్యాయి. నిర్దేశిత పని గంటల పరంగా రాజ్యసభ 79.95 శాతం, లోక్‌సభ 77.94 శాతం పనిచేశాయని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి అనంత్ కుమార్ వెల్లడించారు. బ్యాంకింగ్ (సవరణ) బిల్లు సహా లోక్‌సభలో ప్రవేశపెట్టిన మొత్తం 17 బిల్లులకు గాను 14 ఆమోదం పొందాయి. అత్యంత ఆక్షేపణీయ ప్రవర్తనకు గాను ఆరుగురు కాంగ్రెస్ సభ్యులను స్పీకర్ సుమిత్రా మహాజన్ ఐదు రోజుల పాటు సస్పెండ్ చేశారు. మరోవైపు ఈ సమావేశాలు జరుగుతున్న సమయంలోనే ప్రతిష్టాత్మకమైన రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి ఎన్నికలు కూడా జరిగాయి. గోగూండాల దాడులు, హత్యలు, వ్యవసాయ సంక్షోభం, గుజరాత్‌లో కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీపై రాళ్ల దాడి ఘటన లాంటి కీలక అంశాలు, సమస్యలపై అధికార, విపక్ష నాయకుల మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదాలు చోటుచేసుకున్నాయి. క్విట్ ఇండియా ఉద్యమం 75వ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక చర్చను కూడా నిర్వహించారు. ఈ సమావేశాల్లో సభ మొత్తం 71 గంటల పాటు సమావేశమయిందని స్పీకర్ తెలిపారు. సభలో గందరగోళ పరిస్థితుల వల్ల 29.58 గంటల సమయం వృధా అయిందని ఆమె పేర్కొన్నారు. కానీ అదనంగా మరో 10.36 గంటలు సభను నిర్వహించడం ద్వారా ఆ వృధా సమయాన్ని భర్తీ చేశామని ఆమె అన్నారు. విపక్ష సభ్యులడిగిన 63 ముఖ్యమైన ప్రశ్నలకు మౌఖికమైన, 4370 అప్రధాన ప్రశ్నలకు రాతపూర్వకమైన సమాధానాలను ప్రభుత్వమిచ్చిందని ఆమె చె ప్పారు. ఈ సమావేశాల్లో మంత్రులు 1270 ప్రకటనలు చేశారని, సభ్యులు సైతం 28 ప్రైవేట్ మెంబర్స్ బిల్లులను ప్రవేశపెట్టారని ఆమె తెలిపారు. కంపెనీ (సవరణల) చట్టం–2016, నాబార్డ్ (సవరణ) చట్టం–2017 లాం టి కీలకమైన చట్టాలను కూడా లోక్‌సభ ఆమోదించింది. సభాపతిపై కాగితాలు చింపి విసిరినందుకు ఆరుగురు కాంగ్రెస్ ఎంపిలు గౌరవ్ గొగొయ్, కె.సురేష్, అధీర్ రాజన్ చౌదరీ, రంజీత్ రాజన్, సుస్మితా దేవ్, ఎంకె రాఘవన్‌లు ఐదు రోజుల పాటు సస్పెండ్‌కు గురయ్యారు.

రాజ్యసభ విషయానికొస్తే..

రాజ్యసభ 19 సార్లు సమావేశమయింది. 80 గంటలకు పైగా చర్చలు జరిపినప్పటికీ, పలు అంశాలపై అధికార, విపక్ష సభ్యుల మధ్య వాగ్వాదాల కారణంగా సుమారు 25 గంటలు వృధా అయ్యాయి. అంతేకాక చట్టపరమైన, ఇతర కార్యకలాపాలను పూర్తి చేయడం కోసం మరో తొమ్మిది గంటల పాటు సభ అదనంగా నిర్వహించబడింది. మొత్తం 15 బిల్లులకు గాను తొమ్మిది ఆమోద ముద్ర వేసుకున్నాయి. జిఎస్‌టిని జమ్ము–కశ్మీర్‌కు కూడా వర్తింపజేయడం చారిత్రక విజయంగా మంత్రి అనంత్ కుమార్ అభివర్ణించారు. దేశవ్యాప్తంగా కొనసాగుతోన్న గోసంరక్షకుల దాడులు, వ్యవసాయ సంక్షోభం లాంటి కీలక సమస్యలను విపక్షాలు సభలో లేవనెత్తాయి. సమావేశాల ఆఖరి రోజున కొత్త ఛైర్మన్‌గా ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు ప్రమాణం చేయడం చెప్పుకొదగ్గ విశేషం. రాజ్యసభను నిరవధికంగా వాయిదా వేయడానికి ముందుగా జులై 17న మొదలైన ఈ వర్షాకాల సమావేశాల సందర్భంగా జరిగిన చర్చల తీరుతెన్నులను వెంకయ్య స్థూలంగా వివరించారు. ఈ సమావేశాల్లో క్విట్ ఇండియా ఉద్యమం 75వ వార్షికోత్సవం సందర్భంగా సభ్యులు తమదైన శైలిలో ప్రసంగించారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకున్నారు. వారు కలలు గన్న భారతదేశ నిర్మాణానికి కృషి చేస్తామని ప్రతినబూనారు. పటిష్ట భారత్ నిర్మాణం కోసం ఒక తీర్మానాన్ని కూడా ఆమోదించారు. కొత్తగా ఎన్నికైన సభ్యులు వినయ్ దిను టెండూల్కర్, సంపతియయుకీ ప్రమాణస్వీకారం ద్వారా సభలో అడుగుపెట్టారు. మరోవైపు బిఎస్‌పి నాయకురాలు మాయావతి, బిజెపి సీనియర్‌నేత, కేంద్ర మంత్రి వెంకయ్యనాయుడు తమ పదవులకు రాజీనామా చేశారు. దివంగతులైన కేంద్ర మంత్రి అనిల్ మాధవ్ దవే, సిట్టింగ్ ఎంపి పాల్వాయి గోవర్ధన్ రెడ్డితో పాటు మరో 11 మంది మాజీ సభ్యులకు సభ సంతాపం ప్రకటించింది. ఈశాన్య ప్రాంతం సహా దేశంలోని పలు ప్రాంతాల్లో కురుస్తున్న కుండపోత వర్షాలు, జమ్ము, కశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లాలో ఉగ్రవాదుల అమానవీయ దాడి ఘటన గురించి కూడా సభలో ప్రస్తావించారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ టెక్నాలజీ, సైన్స్, ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (సవరణ) బిల్లు, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ప్రభుత్వ–ప్రైవేటు భాగస్వామ్యంతో) బిల్లు, పిల్లల స్వేచ్ఛా, నిర్బంధ విద్యా హక్కు బిల్లు సహా తదితర ముఖ్యమైన బిల్లులు ఈ సమావేశాల్లోనే ఆమోదం పొందాయి. మోటారు వాహనాల (సవరణ) బిల్లును ఎంపిక కమిటీకి, ఫైనాన్స్ రిజల్యూషన్, డిపాజిట్ ఇన్సూరెన్స్ బిల్లును జాయింట్ కమిటీకి నివేదించారు. 87 ప్రత్యేక చర్చలతో పాటు 17 గంటల పాటు స్వల్పకాలిక చర్చలు కూడా జరిగాయి. ఈ సమావేశాల్లో 285 ముఖ్యమైన ప్రశ్నలు, 3040 అప్రధాన ప్రశ్నలను అనుమతించగా వాటిలో 46 ముఖ్యమైన ప్రశ్నలకు మౌఖిక సమాధానాలు లభించాయి. మూడు రోజుల పాటు ప్రశ్నోత్తరాలను చేపట్టలేదు. వివిధ కమిటీలు విడుదల చేసినవి సహా పలు నివేదికలను కూడా సభకు సమర్పించారు.

ఆశ్రమాల్లో అనాథ వితంతువులకు తగిన గౌరవం లేదు



న్యూఢిల్లీ: సామాజిక నిరాధారణకు గురైన అనాథ వితంతువులకు ఆశ్రయం కల్పించే బృందావన్, ఇతర సంస్థలు వారిని తగిన విధంగా గౌరవించడం లేదని సుప్రీంకోర్టు పేర్కొంది. ఆశ్రయ సంస్థల్లో ఉండే హక్కు వారికి ఉందని పేర్కొంది. వితంతు పునర్ వివాహాలు ప్రోత్సహించడంతో సమాజం దృక్పథంలో మార్పు రావడానికి దోహదం చేస్తుందని ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై విచారణ జరిపిన జస్టిస్ మదన్ బి లోకూర్, జస్టిస్ దీపక్ గుప్తాలతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం పేర్కొంది. వితంతువుల గురించి అధ్యయనం చేసేందుకు ఆరుగురు సభ్యుల కమిటిని ఏర్పాటు చేసిన ధర్మాసనం నవంబర్ 30 లోగా నివేదిక సమర్పించాలని ఆదేశించింది. వితంతు పునర్ వివాహాలు ప్రోత్సహిస్తే సమాజంలో వారి పట్ల చిన్న చూపు తగ్గుతుందని ధర్మాసనం తెలిపింది. సామాజిక వివక్షకు గురవుతున్నవారికి అండగా నిలవాల్సిన అవసరం ఉందని పేర్కొం ది. తమ సమస్యలు చెప్పుకోలేని వారికి కోర్టులు అండ గా నిలుస్తాయని, ఇలాంటి అంశాలలో జోక్యం చేసుకోవడం తమ రాజ్యాంగ పరమైన హక్కు అని ధర్మాసనం తెలిపింది. వితంతువుల స్థితిగతులపై విచారించనున్న కమిటీకి జాతీయ మహిళా కమిషన్ సహకారం అందించాలని కోరింది. వితంతువులకు మెరుగైన పరిస్థితులు కల్పించే కార్యాచరణను ధర్మాసనం సొలిసిటర్ జనరల్ రంజిత్ కుమార్‌కు అప్పగించింది

ఢిల్లీలో ప్రధాని మోడీతో పళనిస్వామి భేటీ

నీట్‌పై అధికారిక చర్చలు... చాటుగా విలీన అంశం

న్యూఢిల్లీ: తమిళనాడులో అన్నాడిఎంకె వర్గాల విలీన ప్రక్రియ మరింత జోరందుకుంది. రాష్ట్ర ముఖ్యమంత్రి అన్నాడిఎంకె (అమ్మ) వర్గం నేత పళనిస్వామి శుక్రవారం దేశ రాజధానిలో ప్రధాని నరేంద్ర మోడీని కలుసుకున్నారు. రెండు వర్గాల మధ్య విలీనం అంశంపైనే ఆయన ప్రధానితో చర్చించినట్లు తెలిసింది. అయితే తాను ప్రధానిని కలిసి కేవలం అధికారిక అంశాలపైనే అని పళనిస్వామి చెప్పారు. రాష్ట్రాన్ని నీట్ పరిధి నుంచి తప్పించాలనే అంశంపై చర్చించేందుకు వచ్చినట్లు వెల్లడించారు. రాష్ట్రంలో పళనీ–పన్నీరు వర్గాల విలీనం జరుగుతుందని, అధికార పార్టీపై శశికళ, దినకరన్‌ల ప్రాబల్యంపై వేటుపడుతుందని చర్చలు జరుగుతున్నాయి. ఈ దశలోనే పళనిస్వామి ఢిల్లీకి వచ్చారు. గత నెల నుంచి చూస్తే ప్రధానితో పళని చర్చలు జరపడం ఇది రెండోసారి. లోక్‌సభ డిప్యూటీ స్పీకర్ తంబిదురైతో కలిసి ముఖ్యమంత్రి ప్రధాని వద్దకు వెళ్లారు. పార్లమెంట్ హౌజ్‌లోని పిఎం కార్యాలయంలోనే భేటీ జరిగిందని చెన్నైలో అధికారిక ప్రకటన వెలువడింది. ముఖ్యమంత్రి ఢిల్లీ పర్యటన సందర్భంగా ఆర్థిక మంత్రి జైట్లీ, హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఇతరులను కూడా కలుసుకున్నారు. ఇది ఇలా ఉండగా పార్టీకి ఉప ప్రధాన కార్యదర్శిగా దినకరన్ నియామకం చెల్లనేరదని పార్టీ ఆమోదించిన తీర్మానాన్ని పళనిస్వామి, పన్నీరుసెల్వం వర్గీయులు ఎన్నికల సంఘానికి అందిస్తారని తెలిసింది. ఇక మరో వైపు పన్నీరు సెల్వం కూడా ఢిల్లీకి వచ్చారు.



బంగ్లా ఎయిర్‌పోర్టులో అగ్నిప్రమాదం


ఢాకా: బంగ్లాదేశ్ అంతర్జాతీయ విమానశ్రయంలోని ఎయిర్ ఇండియా కార్యాలయంలో శుక్రవారం అగ్ని ప్రమాదం సంభవించింది. దేశంలోనే విమాన సౌకర్యం ఉన్న ప్రధాన హజ్రత్ షహజలాల్ అంతర్జాతీయ విమానశ్రయంలో మధ్యాహ్న సమయంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో అప్రమత్తమైన విమానశ్రయ అగ్నిమాపక సిబ్బంది విభాగాలు రెండు గంటలపాటు శ్రమించినంతరం మంటలను అదుపులోకి వచ్చాయని పౌరవిమానయాన అధికార ప్రతినిధి రిజౌల్ కరీం వెల్లడించారు. ఈ ఘటనకు గల కారణాలపై విచారణకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినట్టు ఆయన తెలిపారు. విమాన సర్వీసులు సాయంత్రం 4 గంటల తరువాత పునఃప్రారంభమయ్యాయని చెప్పారు. ఈ ఘటనకు వెనక గల కారణాలను కనుగొనేందుకు ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీతో అంతర్గత విచారణకు అధికారులు ఆదేశించారు. విచారణపై ఏడు రోజుల్లోగా కమిటీ నివేదిక సమర్పించాల్సిందిగా ఆదేశించినట్టు పౌరవిమానయాన మంత్రిత్వశాఖ ప్రతినిధి పేర్కొన్నారు. అయితే అగ్నిప్రమాదంతో విమానాల రాకపోకల షెడ్యూల్‌కు అంతరాయం ఏర్పడ లేదన్నారు. నిజానికి ఎయిర్‌ఇండియా కార్యాలయంలోని రెండవ అంతస్తు విమానశ్రయ టెర్మినల్1, ఖతార్ ఎయిర్‌వేస్ కార్యాలయాలకు మంటలు వ్యాపించాయని అధికారులు వెల్లడించారు.

లోడ్ అయి దాడికి రెడీ

ఉ. కొరియాకు ట్రంప్ తాజా హెచ్చరిక

వాషింగ్టన్ : ఉత్తర కొరియా ఇకనైనా విజ్ఞతతో వ్యవహరించకపోతే ఏ క్షణంలో అయినా సైనిక చర్య తప్పదని అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. సైనిక చర్య తప్పదని పేర్కొంటూ, అణ్వాయుధ దేశంపై మిలిటరీ చర్య అంశం లాక్ చేసుకుని లోడ్ అయి సిద్ధంగా ఉందని , ఉత్తర కొరియా దారికి రాకపోతే ఇక ప్రయోగమే తరువాతి ఘట్టం అని ట్రంప్ మరోమారు స్పష్టం చేశారు. ఉత్తర కొరియాపై దాడికి సిద్ధంగా ఉన్న అమెరికా ఎయిర్‌ఫోర్స్ బాంబర్ల ఫోటోలను ట్వీట్ చేసిన యుఎస్ పసిఫిక్ కమాండ్ సందేశాన్ని ట్రంప్ తమ ట్విట్టర్‌లో పొందుపర్చారు. సైనిక పరిష్కారమే మంచిదన్పిస్తోందని, అయితేఇప్పటికీ కిమ్ జాంగ్ తెలివిగా వ్యవహరించి దారి మార్చుకుంటాడని భావిస్తున్నట్లు ట్రంప్ తెలిపారు.

చైనాలో ఘోర రోడ్డు ప్రమాదం, 36 మంది మృతి



న్యూఢిల్లీ: చైనాలోని షాగ్జిం ప్రావిన్స్‌లో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 36 మంది మృతి చెందారు. 13 మందికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను సహాయక సిబ్బంది ఆస్పత్రికి తరలించారు. శుక్రవారం ఎక్స్‌ప్రెస్ రహదారిలో మిని బస్సు అదుపు తప్పి'సొరంగంలోకి దూసుకెళ్లడంతో ప్రమా దం చోటు చేసుకుంది. 49 మంది ప్రయాణికులతో వెళ్తున్న బస్సు కిన్‌లిన్ టన్నెల్‌ను బలంగా ఢీకొట్టినట్లు చైనా అధికారిక పత్రికా జినూహ పేర్కొంది. బస్సు దక్షిణ సిచువన్ ప్రావిన్స్ రాజధాని చెంగ్డూ నగరం నుంచి దక్షిణ హెనాన్ ప్రావిన్స్ రాజధాని లుయాంగ్ నగరానికి వెళ్తుండ గా ఘటన జరిగింది. సహాయక చర్యలను పర్యవేక్షించేందుకు ప్రజా భద్రత మంత్రిత్వ శాఖ తమ సిబ్బందిని ఘటనా స్థలానికి పంపించింది. ఈ ఘటనకు సంబంధించి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారులు తెలిపారు.

పట్టణాల్లో ఇంటింటికీ పూలు, పండ్ల మొక్కల పంపిణీ : సిఎస్ ఎస్‌పి సింగ్

మన తెలంగాణ / హైదరాబాద్ : పట్టణ ప్రాంతాల్లో ఇంటింటికీ పండ్లు, పూల మొక్కలను పంపిణీ చేయనున్నట్లు చీఫ్ సెక్రటరీ ఎస్‌పి సింగ్ అన్నారు. ఈ మేరకు మొక్కల పంపిణీకి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లను ఆయన హైదరాబాద్ నుండి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆదేశించారు. ఇంట్లో.. పెరట్లో.. అన్ని చోట్ల మొక్కలు నాటాలని సిఎం కెసిఆర్ ఇచ్చిన పిలుపులో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు. ఇదేదో ప్రభుత్వ కార్యక్రమం అని కాకుండా ప్రతి ఒక్కరూ సామాజిక ఉద్యమంగా కొనసాగించాలన్నది ముఖ్యమంత్రి కెసిఆర్ ఆలోచన అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మొక్కలు నాటడం విజయవంతంగా కొనసాగిందని, ఇదే స్ఫూర్తితో పట్టణాల్లోనూ మొక్కలు నాటుదామన్నారు. ఉద్యానశాఖ అన్ని పట్టణాలకు పండ్లు, పూల మొక్కలు సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉందని ఈ సందర్భంగా ఎస్‌పి సింగ్ వెల్లడించారు. మూడో విడత హరితహారం కోసం 2900 నర్సరీలలో 42 కోట్ల మొక్కలను సిద్ధం చేశారన్నారు. స్థానిక సంస్థలు, పారిశ్రామిక వాడలు, స్వచ్ఛంద సంస్థలు, ఇతర పౌర సంస్థల సహకారాన్ని ఇందుకోసం తీసుకోవాలని చీఫ్ సెక్రటరీ సూచించారు.

జగన్‌కేసులో శాంబాబ్‌పై చార్జిషీట్ కొట్టివేత


మన తెలంగాణ/ హైదరాబాద్: ఎపి ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అక్రమాస్తుల కేసులో రిటైర్డు ఐఎఎస్ అధికారి శాంబాబ్‌పై సిబిఐ నమోదు చేసిన చార్జిషీట్‌ను హైకోర్టు కొట్టివేస్తూ శుక్రవారం తీర్పు వెలువరించింది. శాంబాబ్ సర్వీసులో ఉండగా సిబిఐ విచారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుమతి నిరాకరించిన నేపథ్యంలో ఆయనపై సిబిఐ పెట్టిన చార్జిషీటు చెల్లదని న్యాయమూర్తి ఎం.సీతారామమూర్తి తీర్పు చెప్పారు. లేపాక్షి నాలెడ్జ్ హబ్‌కు భూ కేటాయింపుల కేసులో సిబిఐ పెట్టిన కేసును కొట్టేయాలంటూ శాంబాబ్ వేసిన వ్యాజ్యంపై ఈ తీర్పు వెలువడింది. సిబిఐ పెట్టిన కేసులో అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 19 కింద దర్యాప్తునకు నిరాకరిస్తూ ఎపి ప్రభుత్వం 2014 ఫిబ్రవరిలో జిఒ 604 జారీ ఇచ్చింది. ఆ తర్వాత సిబిఐ కేంద్ర అనుమతి కోరితే గత ఏడాది మార్చిలో కేంద్రం కూడా నిరాకరిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. పైగా శాంబాబ్‌పై ఆరోపణల పత్రాల్ని పరిశీలించిన కేంద్రం.. తగిన ఆధారాలు లేవంటూ విచారణకు నిరాకరించింది. వీటిని సిబిఐ కోర్టులో సవాలు కూడా చేయలేదు. కాబట్టి కేంద్రం ఇచ్చిన నిరాకరణ ఉత్తర్వులే చెల్లుబాటు అవుతాయి. పైగా కేంద్ర, రాష్ట్రాలు అనుమతి నిరాకరణ ఉత్తర్వులు ఇచ్చిన ఈ పరిస్థితుల్లోనే శాంబాబ్ రిటైర్డు అయ్యారు. పదవీ విరమణ చేసిన అధికారిని అవినీతి నిరోధక చట్టం కింద విచారణ చేసేందుకు వీల్లేదు. ఈ కారణంగా శాంబాబ్‌పై సిబిఐ చార్జిషీటు చెల్లదు. ఇదే విధమైన తీర్పును గతంలో సుప్రీంకోర్టు వెలువరించింది. కాబట్టి శాంబాబ్‌పై సిబిఐ చార్జిషీటు దాఖలు చేయడం చెల్లదు.. అని న్యాయమూర్తి తన తీర్పులో పేర్కొన్నారు.

ప్రగతి నివేదిక తెలుగు నివేదిక ఆవిష్కరణ

మన తెలంగాణ/హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర సామాజిక,ఆర్థిక ప్రగతి నివేదిక 2017 తెలుగు అనువాదం ''బంగారు తెలంగాణ దిశగా నిన్న నేపథ్యం, రేపటి సంకల్పం'' ప్రతిని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు ఎస్.నిరంజన్ రెడ్డి ఆవిష్కరించారు. ఖైరతాబాద్‌లోని గణాంక భవన్, అన్ని జిల్లాల జిల్లా ప్రణాళిక అధికారి (సిపిఒ) కార్యాల యంలో తెలుగు ప్రతులు అందుబాటులో ఉంటాయని ప్రణాళిక శాఖ ఒక ప్రకటనలో తెలియచేసింది. ఈనెల 18వ తేదీ నుంచి అందుబాటులో ఉంటుందని, రూ.150కి ఒకటి చొప్పున విక్రయిస్తారని, టిఎస్‌పిఎస్‌సి పోటీ పరీక్షలకు ఉపయోగంగా ఉంటుందని తెలిపారు.

రైల్వే పరిరక్షణకు పోరాటాలు

ఎస్‌సిఆర్‌ఎంయు జిఎస్ శంకరరావు



మన తెలంగాణ / హైదరాబాద్: ప్రజా రవాణ వ్యవస్థ రైల్వేను కాపాడుకునేందుకు కార్మికులు, ప్రజలు సన్నద్ధం కావాలని దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ (ఎస్‌సిఆర్‌ఎంయు) ప్రధాన కార్యదర్శి సిహెచ్.శంకరరావు అన్నారు. ప్రభుత్వ రంగంలోని ఎయిర్ ఇండి యా, రక్షణ రంగం, చివరకు రైల్వేను కూడా అమ్మేందుకు బిజెపి ప్రభు త్వం కుట్ర చేస్తుందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం రైల్వేలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు, పిపిపి విధానాలను, కార్మిక చట్టాల సవరణను ఉపసంహరించుకోవాలని, 7వ వేతన సంఘం సిఫార్సుల్లోని అన్యాయాలను సరిచేయాలని డిమాండ్ చేస్తూ రైల్ నిలయం ఆడిటోరియంలో శుక్రవారం జరిగిన ఎస్‌సిఆర్ ఎంయు జనరల్ కౌన్సిల్ ప్రతినిధుల సభ పలు తీర్మానాలను ఆమోదించింది. చర్చల్లో ఎస్‌సిఆర్‌ఎంయు వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ.వి.సు బ్బారావు, అదనపు ప్రధాన కార్యదర్శి జి.ఉదయ్‌భాస్కర్‌రావు, ఎఐఆర్‌ఎఫ్ జోనల్ కార్యదర్శి పి.యుగంధర్, సికింద్రాబాద్ డివిజన్ ఉపాధ్యక్షులు కె.యాదవ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె.శివకుమార్, హైదరాబాద్ డివిజన్ ఉపాధ్యక్షులు కె.రవీందర్‌రాజ్, ప్రధాన కార్యదర్శి డి.శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

ఫీజు చెల్లించే నాటికి అఫిలియేషన్ లేని కాలేజీల

అంతు తేలుస్తాం

- వాసవి కళాశాల ఉదంతం నేపథ్యంలో ముందుజాగ్రత్త చర్యలు చేపడుతున్నాం
- ప్రభుత్వ కళాశాలల్లో 30 శాతం పెరిగిన ఎన్‌రోల్‌మెంట్
- మంత్రి కడియం శ్రీహరి

మన తెలంగాణ/హైదరాబాద్ : విద్యార్థులు ఇంటర్ వార్షిక పరీక్షల ఫీజులు చెల్లించే గడువు నాటికి రాష్ట్రంలో అఫిలియేషన్ లేని కళాశాలల వివరాలు ఇంటర్ బోర్డు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతామని ఉపముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి తెలిపారు. గత ఏడాది వాసవి కళాశాల ఉదంతం నేపథ్యంలో ముందు జాగ్రత్తగా ఈ చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. శుక్రవారం సచివాలయంలో జూనియర్ కళాశాలల అఫిలియేషన్లపై అధికారులతో మంత్రి సమీక్షించారు. అనంతరం కడియం శ్రీహరి విలేకరులతో మాట్లాడుతూ, జూనియర్ కళాశాలల అఫిలియేషన్ ప్రక్రియ పూర్తిగా ఆన్‌లైన్‌లోనే చేపడుతున్నామని చెప్పారు. ఈ విద్యాసంవత్సరం మొత్తం 1,600 ప్రైవేట్ జూనియర్ కళాశాలలు అఫిలియేషన్ కోసం దరఖాస్తు చేసుకోగా, అందులో 1,250 కళాశాలలకు మంజూరు చేశామని తెలిపారు. వివిధ కారణాల వల్ల మిగతా 350 కళాశాలలకు అఫిలియేషన్ ఇవ్వలేదని అన్నారు. ఆ కళాశాలలు అఫిలియేషన్‌కు అవసరమైన ధృవపత్రాలు సమకూర్చుకోవడానికి కొంత సమయం ఇవ్వాలని భావిస్తున్నట్లు చెప్పారు. కొన్ని కళాశాలల యాజమాన్యాలు ఎలాంటి అఫిలియేషన్ లేకుండానే ప్రవేశాలు చేసుకుని పరీక్షల సమయంలో విద్యార్థులను అడ్డం పెట్టి ఇంటర్ బోర్డును బ్లాక్ మెయిల్‌కు పాల్పడుతున్నారని, ఇలాంటివి పునరావృతం కాకుండా ఈ ఏడాది పరీక్ష ఫీజులు చెల్లించడం కంటే ముందుగానే అఫిలికేషన్ లేని కళాశాలల వివరాలు వెల్లడిస్తామని అన్నారు. శ్రీచైతన్య, నారాయణ కళాశాలలకు ఇంటర్ బోర్డు విధించిన జరిమానాలు చెల్లించాయని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించినందుకు ఇంటర్ బోర్డ్, శ్రీచైతన్య కళాశాలకు రూ.1.30 కోట్లు, నారాయణ కళాశాలకు రూ.62 లక్షల జరిమానా విధించిందని, ఆ జరిమానా చెల్లిస్తేనే ఆ కళాశాలల ఆన్‌లైన్ అఫిలియేషన్ ప్రక్రియ ప్రారంభమయ్యే పరిస్థితి ఉంటుందని అన్నారు. దాంతో ఆయా కళాశాలల యాజమాన్యాలు ఈ ఏడాది మొత్తం జరిమానాలను చెల్లించిందని మంత్రి వెల్లడించారు. ప్రభుత్వ జూ.కళాశాలల్లో 30 శాతం పెరిగిన ఎన్‌రోల్‌మెంట్ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 30 శాతం ఎన్‌రోల్‌మెంట్ పెరిగినట్లు కడియం శ్రీహరి తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఉచిత విద్య, ఉచిత పుస్తకాలు అందించడంతోపాటు సొంత భవనాలు నిర్మించడం, పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించడం, ల్యాబ్ సౌకర్యం, సిసి కెమెరాలు ఏర్పాటు చేయడం ద్వారా విద్యార్థులు ప్రభుత్వ కళాశాలల్లో చేరుతున్నారని అన్నారు. ఈ ఏడాది ప్రథమం లక్ష మంది విద్యార్థులు ప్రవేశాలు పొందినట్లు చెప్పారు. ప్రభుత్వ కళాశాలల్లో ప్రథమ, ద్వితీయ సంవత్సరాలలో మొత్తం 1.90 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారని పేర్కొన్నారు.

బతుకుదెరువును నేర్పిన భాగ్యనగరం



మన తెలంగాణ /హైదరాబాద్ : ఏ తండ్రి అయినా తన బిడ్డ తనకు తానుగానే సమాజంలో ఉన్నతంగా జీవించే విధంగా నేర్చుకోవాలని కోరుకుంటారు. అది కూడా అనుభవ పూర్వకంగా అతను డబ్బు, సంపాదన తదితర అంశాలను తెలుసుకునేలా చేస్తారు. గుజరాత్‌కు చెందిన వజ్రాల వ్యాపారి ఘన్‌శ్యామ్ డొలాకియా కూడా తన బిడ్డలకు జీవన గమనం గురించి స్వతహాగా తెలుసుకునేలా ఒక పరీక్ష పెట్టారు. కోటీశ్వరుడైన ఆ వజ్ర వ్యాపారి తన కొడుకు హిత్‌రత్‌కు ఒక పరీక్ష పెట్టారు. ఎంబిఎ చదివిన ఈ 23 ఏళ్ల కుర్రాడిని హైదరాబాద్‌కు కేవలం రూ. 500 నోటు ఇచ్చి పంపారు. గుజరాత్ నుండి హైదరాబాద్‌కు విమానంలో వచ్చేందుకు తండ్రే ప్రయాణ ఖర్చులు భరించారు. హైదరాబాద్‌కు చేరుకున్న ఆ కుర్రాడు ఐదు వందలతోనే హైదరాబాద్‌లో నెల రోజుల్లో హోటళ్లు, రెస్టారెంట్లు, స్మాష్ వస్త్రదుకాణం, ఆడిదాస్ షూ కంపెనీలోనూ పని చేశారు. రుద్రగుప్త అనే రిక్షావాల తనకు తొలి సారిగా పరిచయం అయి హైదరాబాద్ గురించిన విషయాలు చెప్పారని హిత్‌రత్ వెల్లడించారు. నెల రోజుల తర్వాత కుమారుడిని తిరిగి గుజరాత్‌కు తీసుకెళ్లేందుకు హైదరాబాద్ వచ్చిన తండ్రి ఈ సందర్భంగా తన కుమారుడి అనుభవాలను మీడియాకు వెల్లడింపజేశారు. జీవితం పూలపాన్పు కాదని, కష్టపడితేనే ఏదైనా తట్టుకుని నిలబడగల్గుతారనే తాను ఈ పరీక్ష పెట్టానని ఈ సందర్భంగా తండ్రి ఘన్‌శ్యామ్ డొలకియా వెల్లడించడం విశేషం.

ముత్తూట్ కేసులో ప్రధాన నిందితుడి అరెస్టు

రెండు పిస్తోళ్లు స్వాధీనం

మన తెలంగాణ/హైదరాబాద్/సిటీబ్యూరో: మైలార్‌దేవ్‌పల్లి ముత్తూట్ ఫైనాన్స్ కార్యాలయంలో దోపిడీ యత్నం కేసులో ప్రధాన నిందితుడు ముంబాయికి చెందిన మహ్మద్ షరీఫ్ అబ్దుల్ ఖాదర్ ఖాద్రీని సైబరాబాద్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఇతని నుంచి రెండు పిస్తోళ్లు, 15 బుల్లెట్లు, నాలుగు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలు మీడియా సమావేశంలో సందీప్ శాండిల్యా వెల్లడించారు. మైలార్‌దేవ్‌పల్లి ముత్తూట్ ఫైనాన్స్‌లోకి జూలై 4న ఆరుగురు దుండగులు ప్రవేశించి దోపిడీకి యత్నించిన విషయం తెలిసిందే. కేసును దర్యాప్తు చేసిన పోలీసులు అర్షద్, సఫీయుద్దీన్‌నవాబుద్దీన్, సతోష్‌దశరత్, మహ్మద్ దనగిరిలను జూలై 21న అరెస్టు చేశారు. ప్రధాన నిందితుడు మహ్మద్ షరీఫ్ పరారీలోనే ఉన్నాడు. కేసులో ఇతడే కీలకంగా మారడంతో పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలించారు. ఎట్టకేలకు శుక్రవారం తెల్లవారు జామున మహారాష్ట్రలోని ఉస్మానాబాద్‌లో అదుపులోకి తీసుకున్నారు.ఈ కేసులో మరో ముగ్గురు పరారీలో ఉన్నారు.

జైలులో కలుసుకున్నారు : ఉత్తరప్రదేశ్ సిద్ధార్థ్ నగర్ జిల్లాకు చెందిన మహ్మద్ షరీఫ్ ఒక సెలూన్‌లో హెయిర్ కిటింగ్ చేస్తూ జీవనం కొనసాగించాడు. సెలూన్‌కు వచ్చేవారిలో కొందరు స్క్రాప్ బిజినెస్‌లో భారీగా లాభాలు గడించవచ్చని ఆశ చూపారు. ఆర్థిక సమస్యలు తలెత్తడంతో..ఈజీ మనీ కోసం దోపిడీలు చేయాలని ప్లాన్ చేశాడు. థానే కమిషనరేట్‌లోని మీరా రోడ్‌ఠాణా పరిధిలో ఒక దోపిడీ చేసి పోలీసులకు చిక్కాడు. ఆ సమయంలో జైలులో ఉన్న ఫిరోజ్‌తో పరిచయం ఏర్పడింది. ఫిరోజ్ మైలార్‌దేవ్‌పల్లి ముత్తూట్ కేసులో నిందితుడు. ఇద్దరు థానే సెంట్రల్ జైలు నుంచి బయటికి వచ్చిన తర్వాత దోపిడీలు ఎలా చేయాలో ప్రణాళికలు రచించారు. ఆ తర్వాత షరీఫ్, ఫిరోజ్‌లు ఆయుదాల వ్యాపారి సర్దార్ సింగ్‌ను కలిశారు. అంతేకాదు, మహారాష్ట్ర ఉస్మానాబాద్‌కు చెందిన అర్షద్‌ను గ్యాంగ్ సభ్యుడిగా చేర్చుకున్నాడు. ఈ ముగ్గురు 2008లో మహారాష్ట్ర నందుర్‌బర్ ఠాణా పరిధిలో జువెలరీ షాప్‌లో ఒక కేజీ బంగారాన్ని దోచేసి, ఏడేళ్ల శిక్ష కూడా అనుభవించారు. ఆ సమయంలో సఫీయుద్దీన్ నవబుద్దీన్‌తో షరీఫ్‌కు పరిచయమైంది. వీరంతా ఒక ముఠాగా ఏర్పడి దూలే జైలులో తోటి ఖైదీలను ఇబ్బంది పెట్టారు. షరీఫ్, ఫిరోజ్, అర్షద్, సఫీయుద్దీన్‌లు 2014లో జైలు నుంచి బయటికి వచ్చారు. షరీఫ్ మళ్లీ స్క్రాప్ బిజినెస్ మొదలు పెట్టాడు. అయిన అతని బుద్ధి మారడంలేదు. దోపిడీలు చేయాలని ముఠా సభ్యులకు తరచూ చెప్పేవాడు. అందులో భాగంగా ఉత్తరప్రదేశ్‌లోని షేర్‌ఖాన్ అలియాస్ షేరును కలిసి రెండు తుపాకులను కొనుగోలు చేశాడు. ఒక్కోదానికి రూ.35 వేలు చెల్లించాడు. ఒక్కో బుల్లెట్‌కు రూ.500 చెల్లించి 15 బుల్లెట్లు విక్రయించాడు. రెండు రౌండ్లు కాల్చి ఆ తుపాకులను పరీక్షించుకున్నాడు. వాటి సహాయంతో కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణలోని ముత్తూట్, మణప్పరం గోల్డ్‌లోన్ కార్యాలయాలను కొల్లగొట్టాలని పథకం పన్నారు. మొదటి సారిగా మైలాదేవ్‌పల్లిని ఎంచుకుని స్కెచ్ వేశారు. అయితే సిబ్బంది అల్లారం మ్రోగించడంతో వీరి కుట్ర భగ్నమైంది. చివరకు వీరంతా కటకటాలపాలయ్యారు. మీడియా సమావేశంలో జాయింట్ పోలీసు కమిషనర్ షానవాజ్ ఖాసీంఖాన్, క్రైమ్ డిసిపి జానకీ షర్మిల పాల్గొన్నారు.

మోడీ, అమిత్ షాతో నితీశ్ భేటీ



న్యూఢిల్లీ: బీహార్‌లో అధికార జెడి(యు) ఎన్‌డిఎలో చేరేందుకు సిద్ధమవుతోంది. అందులో భాగంగా శుక్రవారం ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి, జెడి(యు) చీఫ్ నితీశ్ కుమార్ ప్రధాని నరేంద్రమోడీ, బిజెపి అధ్యక్షుడు అమిత్ షాతో భేటీ అయ్యారు. జెడి(యు) ఇటీవల మహాకూటమి నుంచి బయటకు వచ్చి కాషాయ పార్టీతో చేతులు కలిపి తిరిగి రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఆర్‌జెడి, కాంగ్రెస్ తదితర పార్టీలతో తెగతెంపులు చేసుకున్న తరువాత నితీశ్ కుమార్ దేశ రాజధానికి వెళ్లడం ఇదే మొదటిసారి. ముందుగా ప్రధానితో సమావేశమై అనంతరం అమిత్ షాతో భేటీ అయ్యారు. ఎన్‌డిఎలో చేరే అంశం, రాష్ట్రంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, ఇతర సమస్యలపై వారిరువురి మధ్య చర్చకు వచ్చినట్లు సమాచారం. కాగా, జులై 19న పాట్నాలో జరిగిన ఎగ్జిక్యూటివ్ సమావేశం అనంతరం బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎలో జెడి(యు) చేరుతున్నట్లు అధికారికంగా ప్రకటిస్తారని తామంతా అనుకున్నామని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. అయితే మోడీ, అమిత్ షాతో నితీశ్ భేటీ కావడంతో త్వరలోనే ఎన్‌డిఎలో చేరుతున్నట్లు ప్రకటించే అవకాశముందని భావిస్తున్నారు. ఇదిలా ఉండగా, మోడీతో భేటీ అనంతరం బీహార్ సిఎం మీడియాతో మాట్లాడారు. తాను మర్యాదపూర్వకంగానే ప్రధానిని కలిశానని, ఈ నెలాఖరుకల్లా మరోసారి ఢిల్లీ వచ్చి రాష్ట్రాభివృద్ధిపై ప్రధానితో మాట్లాడుతానన్నారు.

పార్టీలో కొనసాగే నిర్ణయంపై శరద్‌కే పూర్తి స్వేచ్ఛ

మహాకూటమి నుంచి వైదొలిగి బిజెపితో చేతులు కలపడాన్ని పార్టీ పూర్తిగా అంగీకరించిందని నితీశ్ పేర్కొన్నారు. ఈ విషయంపై పూర్తిగా విభేదిస్తున్న పార్టీ అసమ్మతి నేత శరద్ యాదవ్ పార్టీలో కొనసాగాలా, లేదా అనే నిర్ణయం తీసుకోవడాన్ని పూర్తిగా ఆయనకే వదిలేసినట్లు సిఎం స్పష్టం చేశారు. బిజెపితే చేతులు కలిపే నిర్ణయం తానొక్కడిని తీసుకున్నది కాదని, పార్టీ నాయకులు, కారకర్తల సమ్మతితోనే జరిగిందన్నారు. దీనిపై శరద్ నిర్ణయం వేరేలా ఉంటే సొంత నిర్ణయం తీసుకునే స్వేచ్ఛ ఆయనకు ఉందని నితీశ్ తెలిపారు.

మజ్లిస్ ఒత్తిళ్లకు లొంగిపోయారు

విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించకపోవడంపై బిజెపి విమర్శ



మన తెలంగాణ/న్యూఢిల్లీ: తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించడంలో టిఆర్‌ఎస్ ప్రభుత్వం మజ్లిస్ ఒత్తిళ్ళకు లొంగి విస్మరిస్తోందని తెలంగాణ బిజెపి నేతలు ఆరోపిస్తున్నారు. ఉద్యమ సమయంలో సెప్టెంబర్ 17ను ఘనంగా నిర్వహిస్తామని చెప్పిన కెసిఆర్ ఇప్పుడు మాటమార్చి విస్మరిస్తున్నారని,సెప్టెంబర్ 17న హైదరాబాద్ లో తెలంగాణ బిజెపి పెద్ద ఎత్తున సభ నిర్వహించేసభకు హోంమంత్రి రాజ్ నాథ్ వస్తానని హామీ ఇచ్చారని తెలంగాణ బిజెపి అధ్యక్షుడు లక్ష్మణ్ స్పష్టం చేస్తున్నారు. రెండు రోజుల ఢిల్లీ పర్యటన పూర్తిచేసుకున్న సందర్భంగా శుక్రవారం తెలంగాణభవన్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... తమ రెండు రోజుల ఢిల్లీ పర్యటనలో తెలంగాణా రాష్ట్ర అభివృద్ధి కోసం పలు ప్రాజెక్టులకు అనుమతుల కోసం కేంద్రమంత్రులను కలిసి చర్చించామని అన్నారు. తెలంగాణాలో రైల్వే ప్రాజెక్టులు ముందుకు సాగడానికి రాష్ట్ర ప్రభుత్వం సహకరించకపోవడమే కారణమని ఈ సందర్భంగా డా.లక్ష్మణ్ ఆరోపించారు.రైల్వేశాఖ నుండి కేంద్ర నిధులు వస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నుండి అవసరమైన సహకారాలు అందట్లేదని, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణానికి కేంద్రం అడిగిన భూమి సమకూర్చలేకపోయిందంటూ విమర్శలు గుప్పించారు. ముఖ్యమంత్రిగారు సచివాలయానికి వచ్చేది లేనప్పుడు, కొత్త సచివాలయం ఎందుకని ప్రశ్నించారు. జీఎస్టీ వల్ల రైతులకు మేలు జరుగుతుందంటే మేం స్వాగతిస్తాం కానీ, కాంట్రాక్టర్లకే మేలు జరుగుతుందంటే మాత్రం మేం అడ్డు చెబుతామని స్పష్టం చేశారు. జిఎస్టీ పన్నులు కేంద్రం నిర్ణయం కాదు, జిఎస్టీ మండలి నిర్ణయిస్తుందని, అన్ని రాష్ట్రాలు ఇందులో సభ్యులే అని స్పష్టంచేశారు. ప్రాజెక్టులు, పేదలకు ఇళ్లు, బీడీలపై పన్ను తగ్గించే అంశంలో కేంద్రంపై ఒత్తిడి తెస్తున్నామన్నారు. జీఎస్టీ మండలి కి ఈటెల రాజేందర్ రాకుండా కేటీఆర్ ఎందుకు వస్తున్నారని డా.లక్ష్మణ్ ప్రశ్నించారు.జీఎస్టీ అమలు విషయంలో కెసిఆర్ ప్రభుత్వం రాజకీయం చేయడం సరికాదన్న తెలంగాణ బిజెపి అధ్యక్షుడు లక్ష్మణ్ , కెసిఆర్ ప్రజలను పక్కదోవ పట్టించే విధంగా మాట్లాడకూడదని కోరుతున్నామన్నారు. తెలంగాణ ప్రభుత్వం లేవనెత్తిన అభ్యంతరాలపై జీఎస్టీ కౌన్సిల్ లో చర్చిస్తామని చెప్పిన తర్వాత మళ్ళీ రచ్చ చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. తెలంగాణా ప్రజలు అమాయకులు కాదన్న ఆయన, జీఎస్టీ విషయంలో ఎవరు ఏం మాట్లాడుతున్నారో అంతా గమనిస్తున్నారని అన్నారు. రామగుండం ఎరువుల ఫ్యాక్టరీ ద్వారా ఉత్పత్తి అయ్యే ఎరువులను తెలంగాణా రైతులకే కాకుండా ఇతర రాష్ట్రాలకు ఇచ్చే అవకాశం ఉంది కాబట్టి ఈ విషయాన్ని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకువెళ్లామని, దీనిపై స్పందించిన కేంద్రమంత్రి త్వరలోనే పరిశీలిస్తానని హామీఇచ్చారన్నారు.తెలంగాణాలో 18లక్షల హెక్టార్లలో పత్తి పంట వేశారు కాబట్టి దిగుబడికి తగ్గట్లుగానే కొనుగోలు కేంద్రాలు పెంచాలని కేంద్ర జౌళిశాఖ మంత్రి స్మృతి ఇరానిని కోరామని, దానికి మంత్రి స్పందిస్తూ.... వెంటనే కొత్తగా 54కొనుగోలు కేంద్రాలు నెలకొల్పుతామని హామీ ఇచ్చారని లక్ష్మణ్ వెల్లడించారు. తమ రెండు రోజుల పర్యటనలో హైదరాబాద్ లో భాగ్యనగర్ పైప్ గ్యాస్ కు కేంద్ర పెట్రోలియం శాఖ నుండి 500కోట్లు విడుదల, కేంద్ర ఎరువులు,రసాయనాల మంత్రిత్వ శాఖ నుండి తెలంగాణాలో 500జనరిక్ మందుల దుకాణాలు నెలకొల్పేందుకు అనుమతులు సాధించామన్నారు. 2019ఎన్నికలే లక్ష్యంగా పనిచేస్తున్న మాకు, కేంద్రంలోని నాయకుల అండదండలున్నాయని, దాని ద్వారా టిఆర్‌ఎస్ కు ప్రత్యామ్నాయ శక్తిగా ఎదుగుతామని ధీమావ్యక్తం చేశారు.

ఎస్సీ, ఎస్టీ పథకాలు సక్రమంగా అమలు

మన తెలంగాణ/హైదరాబాద్: దళిత, గిరిజన అభివృద్ధికి వివిధ శాఖల ద్వారా అమలు చేస్తున్న పథకాలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని ప్రభుత్వ సలహాదారులుఎ.రామలక్ష్మణ్ అన్నారు. సచివాలయంలో శుక్రవారం ఆయన వివిధ శాఖాధిపతులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో ఎస్‌సి అభివృద్ధి సంస్థ డైరక్టర్ పి.కరుణాకర్, ఎస్‌టి సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్. లక్ష్మణ్, ఎస్‌సి గురుకులాల కార్యదర్శి ఆర్. ఎస్.ప్రవీన్‌కుమార్, ఎస్‌సి కార్పొరేషన్ ఎండి. బి. లచ్చిరాం తదితర శాఖాధికారులు పాల్గొన్నా రు. ఎస్‌సి,ఎస్‌టి ప్రత్యేక అభివృద్ధి నిధులపై ఆరా తీశారు. జులై నెలాఖరు వరకు వివిధ శాఖలకు కేటాయించిన నిధులలో ఎస్‌సి అభివృద్ధికి రూ. 3,574 కోట్లు, ఎస్‌టిల అభివృద్ధికి రూ. 1,589 కోట్లు ఖర్చు చేసినట్లు అధికారులు వివరించారు. అనంతరం రామలక్ష్మణ్ మాట్లాడుతూ వివిధ శాఖలలో దళి త,గిరిజను అభివృద్ధికి కేటాయించిన నిధులను సక్రమంగా అమలు చేయాలన్నారు.వివిధ శాఖాలలో దళితులు, గిరిజనుల లబ్ధిదారుల జాబితా ను ఎస్‌సి,ఎస్‌టి శాఖ వెబ్‌సైట్‌లో పెట్టాలన్నారు.

బిసి ఓవర్‌సీస్ విద్యానిధికి దరఖాస్తుల ఆహ్వానం

మన తెలంగాణ/హైదరాబాద్: మహాత్మాజ్యోతిభ పూలే బిసి ఓవర్ సీస్ విద్యానిధి పథకానికి ఈనెల 15 నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని బిసి సంక్షేమ శాఖ తెలిపింది. ఆసక్తి ఉన్న బిసి అభ్యర్థులు సెప్టెంబర్ 30వ తేదీలోపు దరఖాస్తులు చేసుకో వాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రూ.1,50,000, పట్టణాల్లో రూ. 2లక్షల వార్షిక కుటుంబ ఆదాయం కలిగిన బిసి అభ్యర్థులు అర్హులని తెలిపింది.

ఏడుగురు బహిష్కృత ఎమ్మెల్యేల రాజీనామా

అహ్మదాబాద్: గుజరాత్‌లో ఇటీవల కాంగ్రెస్ బహిష్కరించిన ఏడుగురు ఎమ్‌ఎల్‌ఎలు తమ శాసనసభ్యత్వానికి రాజీనామా చేశారు. వారి రాజీనామా లేఖలు తనకు అందినట్టు అసెంబ్లీ స్పీకర్ రామన్‌లాల్ వోరా శుక్రవారం వెల్లడించారు. ఇటీవల జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో ప్రత్యర్థి పార్టీ అభ్యర్థి అహ్మద్ పటేల్‌కు ఎనిమిది మంది ఎమ్‌ఎల్‌ఎలు ఓటు వేయడంపై ఆగ్రహించిన కాంగ్రెస్ అధిష్టానం వారిలో ఏడుగురిని ఈ నెల 9న పార్టీ నుంచి బహిష్కరించిన సంగతి తెలిసిందే. కాంగ్రెస్ మాజీ నేత శంకర్‌సిన్హ్ వాఘేలా కుమారుడు మహేందర్‌సిన్హ్ సహా ఏడుగురు నేతలు రాజ్యసభ ఎన్నికల్లో పార్టీకి వ్యతిరేకంగా ఓటు వేశారు. వారిలో ఇద్దరు రెబల్ ఎమ్‌ఎల్‌ఎలైన రాఘవ్‌జీ పటేల్, భోలాభాయ్ గోహెల్ వేసిన ఓట్లు చెల్లవంటూ ఎన్నికల కమిషన్ ప్రకటించింది. వీరద్దరూ కూడా తమ శాసనసభ్యత్వాలకు రాజీనామా లేఖలను స్పీకర్‌కు సమర్పించారు.

మన తెలంగాణ
12
హైదరాబాద్
శనివారం
12, ఆగస్టు 2017
www.manatelangana.news

అమెరికాలో మహిళా టీ-20 ప్రపంచకప్

దుబాయి: 2018లో జరిగే మహిళల ట్వంటీ–20 ప్రపంచకప్‌కు అమెరికా, వెస్టిండీస్‌లు సంయుక్తంగా ఆతిథ్యం ఇవ్వనున్నాయి. ఈ విషయాన్ని అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసిసి) ఒక ప్రకటనలో వెల్లడించింది. వచ్చే ఏడాది నవంబరులో ఈ పోటీలు జరుగనున్నాయి. అమెరికాలోని ఫ్లోరిడా నగరంలో ఎక్కువ మ్యాచ్‌లు నిర్వహించేందుకు ప్రయత్నిస్తున్నట్టు ఐసిసి ప్రతినిధులు ఫరా గోర్సి, జానీ గ్రేవ్‌లు తెలిపారు. ఫ్లోరిడాలోని లాడెర్‌హిల్ మైదానంలో ఎక్కువ మ్యాచ్‌లు జరిగే అవకాశాలున్నాయని వారు తెలిపారు. గతంలో కరేబియన్ ప్రీమియర్ లీగ్, 2016 భారత్–వెస్టిండీస్ ట్వంటీ–20 మ్యాచ్‌తో పాటు ఎన్నో అంతర్జాతీయ పోటీలకు ఈ స్టేడియం వేదికగా నిలిచిందన్నారు. కాగా, దీనికి సంబంధించి త్వరలోనే పూర్తి వివరాలను వెల్లడిస్తామని వారు వివరించారు. అమెరికాలో క్రికెట్‌ను విస్తరించాలనే ఉద్దేశంతో ఇక్కడ టీ–20 ప్రపంచకప్ నిర్వహించేందుకు ఐసిసి ముందుకు వచ్చిందన్నారు. అభిమానుల నుంచి మంచి ఆదరణ లభిస్తుందనే నమ్మకం తమకుందని ఐసిసి ప్రతినిధులు అన్నారు.

International Cricket Council



అశోక వనంలో భారత ఆటగాళ్ల సందడి

క్యాండి: టీమిండియా ఆటగాళ్లు శుక్రవారం క్యాండి సమీపంలోని అశోక వనాన్ని సందర్శించారు. రావణసురుడు సీతమ్మను అపహరించి ఇక్కడి అశోక వనంలో ఉంచాడని పురాణాల్లో ఉంది. ఈ ప్రదేశాన్ని భారతీయులు వేలాది సంఖ్యలో సందర్శిస్తుంటారు. కాండి సమీపంలో ఈ క్షేత్రం ఉంది. కాగా, టీమిండియా ఆటగాళ్లు మహ్మద్ షమి, ఉమేశ్ యాదవ్, కుల్దీప్ యాదవ్, ఇషాంత్ శర్మ, కెఎల్.రాహుల్, వృద్ధిమాన్ సాహా తదితరులు ఈ అశోక వనాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఇక్కడ దిగిన ఫొటోలను షమి, ఉమేశ్ యాదవ్‌లు సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. కాగా, వనం నిర్వాహకులు భారత ఆటగాళ్లకు ఇక్కడి విశేషాలను వివరించారు. ఈ వనంలో హనుమంతుడి విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ఇదిలావుండగా మూడో టెస్టుకు వేదికగా నిలుస్తున్న కాండి నగరానికి సమీపంలో ఈ అశోక వనం ఉంది. సీత ఎలియా గ్రామంలో ఉన్న ఈ క్షేత్రాన్ని ప్రతి రోజుల వందలాది మంది భక్తులు సందర్శిస్తుంటారు.



దావీందర్ సింగ్ సంచలనం

లండన్: లండన్‌లో జరుగుతున్న ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో భారత జావెలిన్ త్రోయర్ దావీందర్ సింగ్ కంగ్ ఫైనల్స్‌కు చేరి చరిత్ర సృష్టించాడు. గురువారం అర్ధరాత్రి జరిగిన ఈ విభాగం అర్హత పోటీల్లో దావీందర్ సింగ్ 83 మీటర్ల దూరాన్ని విసిరి ఫైనల్స్‌కు అర్హత సాధించాడు. కాగా, ప్రపంచ చాంపియన్‌షిప్‌లో ఓ భారత అథ్లెట్ జావెలిన్ త్రో విభాగంలో ఫైనల్‌కు చేరడం ఇదే ప్రథమం. గతంలో ఏ భారత అథ్లెట్ కూడా ఈ ఘనతను సాధించలేదు. తొలి రెండు ప్రయత్నాల్లో దావీందర్ సింగ్ విఫలమయ్యాడు. తొలి ప్రయత్నంలో 82.22, 82.14 మీటర్లు విసిరి అర్హత సాధించడంలో విఫలమయ్యాడు. అయితే మూడో ప్రయత్నంలో మాత్రం 83 మీటర్ల దూరాన్ని విసిరి ఫైనల్‌కు దూసుకెళ్లాడు. శుక్రవారం అర్ధరాత్రి ఫైనల్ పోటీలు జరుగనున్నాయి. కాగా, భారత్‌కు చెందిన నీరజ్ చోప్రా మాత్రం ఫైనల్‌కు అర్హత సాధించడంలో విఫలమయ్యాడు. కాగా, ఫైనల్లో మెరుగైన ప్రదర్శన కనబరుస్తాననే నమ్మకాన్ని దావీందర్ సింగ్ వ్యక్తం చేశాడు.

హార్ధిక్‌పాండ్యాకు ఆ సత్తా ఉంది: కపిల్

ముంబయి: రానున్న రోజుల్లో అగ్రశ్రేణి ఆల్‌రౌండర్‌గా ఎదిగే సత్తా భారత యువ ఆటగాడు హార్ధిక్ పాండ్యాకు ఉందని టీమిండియా మాజీ దిగ్గజం కపిల్‌దేవ్ జోస్యం చెప్పాడు. ప్రస్తుతం టీమిండియా ఫాస్ట్ బౌలింగ్ విభాగం చాలా బలంగా ఉందన్నాడు. ప్రపంచ శ్రేణి బౌలర్లతో భారత ఫాస్ట్ బౌలింగ్ లైనప్ చాలా బలంగా తయారైందన్నాడు. గతంలో భారత్ ఫాస్ట్ బౌలింగ్ విభాగంలో చాలా బలహీనంగా ఉండేదన్నాడు. ఇప్పుడు పరిస్థితి మారి పోయిందన్నాడు. ఇతర జట్లకు దీటుగా టీమిండియా ఫాస్ట్ బౌలింగ్ విభాగం చాలా బలంగా తయారైందన్నాడు. ఉమేశ్ యాదవ్, మహ్మద్ షమి, ఇషాంత్ శర్మ, భువనేశ్వర్ కుమార్, జస్‌ప్రిత్ బుమ్రా తదితరులతో ఈ విభాగం చాలా పటిష్టంగా తయారైందన్నాడు. ఇక, హార్ధిక్ పాండ్యా రూపంలో భారత్‌కు పదునైన అస్త్రం లభించిందని కపిల్ అభిప్రాయపడ్డాడు. రానున్న రోజుల్లో ఫాస్ట్ బౌలింగ్ ఆల్‌రౌండర్‌గా హార్ధిక్ టీమిండియాలో కీలకపాత్ర పోషించడం ఖాయమన్నాడు. స్వదేశంతో పాటు విదేశాల్లో కూడా అతనికి అవకాశాలు కల్పిస్తే రానున్న రోజుల్లో మెరుగైన ఆల్‌రౌండర్‌గా ఎదగడం తథ్యమన్నాడు. ఈ దిశగా కెప్టెన్, కోచ్‌లు దృష్టి సారించాలన్నాడు. కాగా, శ్రీలంకతో జరిగే టెస్టు సిరీస్‌లో టీమిండియా క్లీన్‌స్వీప్ చేస్తుందనే నమ్మకం తనకుందన్నాడు. ప్రస్తుత పరిస్థితుల్లో భారత్‌ను ఓడించడం లంకు శక్తికి మించిన పనిగా కపిల్‌దేవ్ అభివర్ణించాడు.



పాక్ జట్టంటే ఇష్టం

• ఉసెన్ బోల్ట్

లండన్: తనకు పాకిస్థాన్ క్రికెట్ జట్టంటే చాలా ఇష్టమని దిగ్గజ అథ్లెట్ ఉసెన్ బోల్ట్ తెలిపాడు. ప్రపంచ క్రికెట్‌లో తాను అభిమానించే జట్లలో పాకిస్థాన్‌కే అగ్రస్థానం దక్కుతుందన్నాడు. ఆ జట్టు ఆటంటే తనకు ఎంతో ఇష్టమన్నాడు. దూకుడుగా ఆడడంలో వారికి ఎవరు సాటిరారని బోల్ట్ అభిప్రాయపడ్డాడు. చిన్నప్పటి నుంచి తాను పాక్ ఆడే అన్ని మ్యాచ్‌లను ఆసక్తిగా చూసే వాడినని వివరించాడు. ఇమ్రాన్ ఖాన్ తన ఆరాధ్య క్రికెటర్లలో ఒకడని బోల్ట్ అన్నాడు. మరోవైపు పాకిస్థాన్ జట్టు ఫీల్డింగ్ చేస్తుండగా చూడడమంటే తనకు చాలా ఇష్టమన్నాడు. పాక్ మాజీ స్పీడ్‌స్టర్ వకార్ యూనిస్‌కు తాను వీరాభిమాని అని బోల్ట్ అన్నాడు. అతని బౌలింగ్ తనను ఎంతో ఆకట్టుకునేదని చెప్పాడు. తన అభిమాన జట్టు ఛాంపియన్స్ ట్రోఫీని సాధించడంతో తన ఆనందానికి అవధులు లేకుండా పోయిందని బోల్ట్ అన్నాడు.



ఈసారి మెరుగ్గా ఆడతాం: చండీమల్

పల్లెకెలె : భారత్‌తో శనివారం ప్రారంభమయ్యే చివరి టెస్టులో మెరుగైన ప్రదర్శన ఇస్తామని శ్రీలంక కెప్టెన్ దినేష్ చండీమల్ అన్నాడు. రెండు మ్యాచుల్లో ఓటమి పాలైన తమకు చివరి టెస్టు సవాలు వంటిదే అన్నాడు. అయితే భారత్‌కు గట్టి పోటీ ఇచ్చే సత్తా తమకుందన్నాడు. రవీంద్ర జడేజా దూరం కావడం తమకు కలిసి వచ్చే అంశమేనన్నాడు. అశ్విన్, జడేజాలతో కూడిన బౌలింగ్ లైనప్ తొలి రెండు టెస్టుల్లో తమకు సమస్యలు సృష్టించదన్నాడు. దీంతో భారత్‌కు ఆఖరి మ్యాచ్‌లో కష్టాలు ఖాయమని, చివరి టెస్టును తాము ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నామన్నాడు.

క్లీన్‌స్వీప్ లక్ష్యం

• సమరోత్సాహంతో కోహ్లి సేన • పరువు కోసం లంక • నేటి నుంచి చివరి టెస్టు





పల్లెకెలె: శ్రీలంకతో శనివారం ప్రారంభమయ్యే చివరి టెస్టుకు టీమిండియా సమరోత్సాహంతో సిద్ధమైంది. ఈ మ్యాచ్‌లోనూ గెలిచి సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేయాలనే పట్టుదలతో విరాట్ సేన ఉంది. 85 ఏళ్ల భారత టెస్టు క్రికెట్ చరిత్రలో భారత్ ఎప్పుడూ మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేయలేదు. అయితే ఈసారి భారత్‌కు ఈ అరుదైన రికార్డును సొంతం చేసుకునే ఛాన్స్ కనిపిస్తోంది. పూర్తి సామర్థ్యం మేరకు ఆడితే ఈ రికార్డును అందుకోవడం భారత్‌కు కష్టమేమి కాదని చెప్పవచ్చు. ఇదిలావుండగా ఆతిథ్య శ్రీలంక జట్టుకు ఈ మ్యాచ్ చావోరేవోగా మారింది. ఇప్పటికే సిరీస్‌ను కోల్పోయిన లంక కనీసం చివరి టెస్టులోనైనా గెలిచి కాస్తయిన పరువు దక్కించుకోవాలనే లక్ష్యంతో ఉంది. అయితే టీమిండియాను ఓడించడం లంకకు అంత సులువేమి కాదని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అసాధారణ ఆటను కనబరిస్తే తప్ప ప్రస్తుతం కోహ్లి సేన జోరును ఆపడం లంకకు కష్టమేనని వారంటున్నారు. కాగా, రెండు జట్లు కూడా విజయమే లక్ష్యంగా పెట్టుకోవడంతో పోరు హోరాహోరీగా సాగడం ఖాయం. కాగా, తొలి టెస్టును 304 పరుగుల తేడాతో గెలిచిన టీమిండియా రెండో టెస్టులో ఇన్నింగ్స్ 53 పరుగుల తేడాతో ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. మరోవైపు భారత్ ఈ మ్యాచ్‌లో స్టార్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా లేకుండానే బరిలోకి దిగనుంది. లంక కూడా తమ కీలక బౌలర్ రంగనా హెరాత్ లేకుండానే పోరుకు సిద్ధమైంది.

బ్యాటింగే బలం..

మరోవైపు టీమిండియా ఈ మ్యాచ్‌లో కూడా బ్యాటింగ్ పైనే నమ్మకం పెట్టుకుంది. తొలి రెండు మ్యాచుల్లో భారీ స్కోర్లు సాధించి మ్యాచ్‌పై పట్టు సాధించింది. చివరి టెస్టులో కూడా భారీ స్కోరుతో ప్రత్యర్థిని ఆత్మరక్షణలో పడేయాలనే లక్ష్యంతో భారత్ ఉంది. ఓపెనర్లతో సహా చివరి వరుస బ్యాట్స్‌మన్ వరకు అద్భుత ఫాంలో ఉండడం టీమిండియాకు కలిసివచ్చే అంశం. ఒంటిచేత్తో మ్యాచ్ ఫలితాన్ని తారుమారు చేసే బ్యాట్స్‌మెన్ కోహ్లికి అందుబాటులో ఉన్నారు. ఓపెనర్లు శిఖర్ ధావన్, కెఎల్.రాహుల్‌లు ఈ మ్యాచ్‌లో కూడా శుభారంభం అందించాలనే పట్టుదలతో కనిపిస్తున్నారు. తొలి మ్యాచ్‌లో ధావన్ కళ్లు చెదిరే సెంచరీ సాధించిన విషయం తెలిసిందే. ఈ మ్యాచ్‌లో కూడా ధావన్ భారీ స్కోరుపై కన్నేశాడు. ఇక, రాహుల్ కూడా ఇదే ఉద్దేశంతో కనిపిస్తున్నాడు. ఈ మ్యాచ్‌లో భారీ స్కోరు సాధించడం ద్వారా జట్టులో స్థానాన్ని శాశ్వతం చేసుకోవాలనే పట్టుదలతో ఉన్నాడు. ఇక, వన్‌డౌన్‌లో వస్తున్న చతేశ్వర్ పుజారాకు ఎదురేలేదు. తొలి రెండు మ్యాచుల్లో కూడా పుజారా కదం తొక్కాడు. ఈసారి కూడా అదే సంప్రదాయాన్ని కొనసాగించేందుకు తహతహలాడుతున్నాడు. లంక బౌలర్లపై ఎదురు దాడి చేస్తూ జట్టుకు అండగా నిలుస్తున్నాడు. చివరి టెస్టులోనూ కోహ్లి పుజారాపై భారీ ఆశలు పెట్టుకున్నాడు. అతను చెలరేగితే ఈసారి కూడా టీమిండియా రికార్డు స్కోరును సాధించడం ఖాయం. మరోవైపు కెప్టెన్ విరాట్ కోహ్లి కూడా భారీ ఇన్నింగ్స్ కోసం సిద్ధమయ్యాడు. ఈ మ్యాచ్‌లో రాణించడం ద్వారా వన్డే సిరీస్‌కు మరింత ఉత్సాహంతో సిద్ధం కావాలనే పట్టుదలతో ఉన్నాడు. ఇప్పటికే ఓ సెంచరీ సాధించిన కోహ్లి మరో పెద్ద ఇన్నింగ్స్ కోసం పరితపిస్తున్నాడు. అజింక్య రహానె కూడా ఇదే ఉద్దేశంతో కనిపిస్తున్నాడు. రెండో టెస్టులో రహానె అద్భుత సెంచరీ సాధించిన విషయం తెలిసిందే. నిలకడైన ఆటకు పెట్టింది పేరుగా చెప్పుకునే రహానె ఈ మ్యాచ్‌లో కూడా జట్టుకు కీలకంగా మారాడు. ఎటువంటి బౌలింగ్ లైనప్‌నైనా చిన్నాభిన్నం చేసే సత్తా రహానె సొంతం. కొంతకాలంగా అతను నిలకడైన ఆటతో ఆకట్టుకుంటున్నాడు. ఈసారి కూడా భారీ ఇన్నింగ్స్ కోసం సిద్ధమయ్యాడు. అతను కూడా విజృంభిస్తే ఈ మ్యాచ్‌లో కూడా లంక బౌలర్లకు కష్టాలు తప్పక పోవచ్చు. ఇక, రవిచంద్రన్ అశ్విన్, వృద్ధిమాన్ సాహా, హార్ధిక్ పాండ్యా, మహ్మద్ షమిలతో భారత బ్యాటింగ్ చాలా బలంగా ఉంది.

కుల్దీప్‌కు ఛాన్స్!

రవీంద్ర జడేజా మ్యాచ్‌కు దూరం కావడంతో అతనికి బదులు యువ బౌలర్ కుల్దీప్ యాదవ్‌కు చోటు దక్కడం ఖాయంగా కనిపిస్తోంది. అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలనే పట్టుదలతో కుల్దీప్ ఉన్నాడు. కిందటిసారి ఆస్ట్రేలియాతో ధర్మశాల వేదికగా జరిగిన టెస్టులో కుల్దీప్ అద్భుత బౌలింగ్‌తో ఆకట్టుకున్న విషయం తెలిసిందే. ఈసారి కూడా మెరుగైన ఆటను కనబరచాలనే ఉద్దేశంతో కనిపిస్తున్నాడు. జడేజా అందుబాటులో లేక పోవడంతో జట్టు బౌలింగ్ భారమంతా సీనియర్ బౌలర్ రవిచంద్రన్ అశ్విన్‌పై పడనుంది. అశ్విన్ తన బాధ్యతను సక్రమంగా నిర్వర్తించేందుకు సిద్ధమయ్యాడు. ఇక, మహ్మద్ షమి, ఉమేశ్ యాదవ్, హార్ధిక్ పాండ్యాలతో ఫాస్ట్ బౌలింగ్ విభాగం బలంగా ఉంది. వీరంతా సమష్టిగా రాణిస్తే సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేయడం భారత్‌కు కష్టమేమి కాదు.

లంకకు సవాలు!

ఇక, ఆతిథ్య శ్రీలంక జట్టుకు చివరి టెస్టు మ్యాచ్ సవాలుగా మారింది. ఇప్పటికే సిరీస్ కోల్పోయిన లంక జట్టు చివరి మ్యాచ్‌లో మెరుగైన ఆటతో కాస్తయిన పరువును దక్కించుకోవాలనే ఉద్దేశంతో ఉంది. అయితే సీనియర్ ఆటగాడు రంగనా హెరాత్ దూరం కావడం లంకకు పెద్ద ఎదురు దెబ్బగా చెప్పవచ్చు. ఒంటి చేత్తో మ్యాచ్ ఫలితాన్ని తారుమారు చేయగలిగే సత్తా కలిగిన హెరాత్ లేని లోటును పూడ్చడం అంత సులువుకాదు. నువాన్ ప్రదీప్ కూడా మూడో టెస్టుకు అందుబాటులో లేకుండా పోయాడు. ఇది కూడా లంకను కలవర పరిచే అంశమే. అయితే సంచలనాలకు పెట్టింది పేరుగా చెప్పుకునే లంకను తక్కువ అంచనా వేయలేం. ఉపుల్ తరంగ, కుశాల్ మెండిస్, కరుణరత్నె, చండీమల్, తిరిమన్నే, డిక్వెల్లా తదితరులతో లంక బ్యాటింగ్ బలంగానే ఉంది. అయితే అనుభవలేమి ఒక్కటే జట్టుకు ప్రతికూలంగా మారింది. రెండో టెస్టులో కరుణరత్నె, డిక్వెల్లా, కుశాల్ మెండిస్ అసాధారణ పోరాట పటిమను కనబరిచినా విషయం తెలిసిందే. ఈసారి కూడా జట్టు వీరి నుంచి మెరుగైన ఆటను ఆశిస్తోంది. చివరి మ్యాచ్‌లో భారత్‌కు గట్టి పోటీ ఇవ్వడం ద్వారా వన్డే సిరీస్‌కు ఆత్మవిశ్వాసంతో సిద్ధం కావాలనే ఉద్దేశంతో శ్రీలంక ఉంది. అయితే దీనిలో ఎంత వరకు సఫలం అవుతుందో వేచి చూడక తప్పదు.

జట్ల వివరాలు

భారత్ (అంచనా): విరాట్ కోహ్లి (కెప్టెన్), శిఖర్ ధావన్, కెఎల్.రాహుల్, చతేశ్వర్ పుజారా, అజింక్య రహానె, అశ్విన్, వృద్ధిమాన్ సాహా, హార్ధిక్ పాండ్యా, కుల్దీప్ యాదవ్, మహ్మద్ షమి, ఉమేశ్ యాదవ్.

శ్రీలంక (అంచనా): దినేశ్ చండీమల్ (కెప్టెన్), కరుణరత్నె, ఉపుల్ తరంగ, కుశాల్ మెండిస్, అంజెలో మాథ్యూస్, డిక్వెల్లా, దిల్రువన్ పెరీరా, మలింద పుష్పకుమార, లహిరు కుమార, విశ్వ ఫెర్నాండో, లక్షణ్ సందకన్.



వన్డే సిరీస్‌కు ధోనీ, రైనా సిద్ధం!

బెంగళూరు: భారత స్టార్ క్రికెటర్లు మహేంద్ర సింగ్ ధోనీ, సురేశ్ రైనాలు శ్రీలంకతో జరిగే వన్డే సిరీస్‌కు సిద్ధమయ్యారు. ఐదు మ్యాచ్‌ల వన్డే సిరీస్ కోసం ఆదివారం టీమిండియాను ఎంపిక చేయనున్నారు. కాగా, సిరీస్‌లో చోటు దక్కుతుందనే నమ్మకంతో సురేశ్ రైనా ఉన్నాడు. రైనా చివరిసారిగా 2015 అక్టోబరులో వన్డే జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. అయితే శ్రీలంక సిరీస్‌లో తనకు చోటు దక్కడం ఖాయమనే ధీమాతో కనిపిస్తున్నాడు. ఇక, టెస్టు క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన ధోనీ కూడా వన్డే సిరీస్ కోసం ఆతృతతో ఎదురు చూస్తున్నాడు. ప్రస్తుతం అతను బెంగళూరులోని జాతీయ క్రికెట్ అకాడమీలో సాధన చేస్తున్నాడు. ఈ సందర్భంగా ధోనీ ఫిట్‌నెస్ పరీక్షలో ఉత్తీర్ణుడయ్యాడు. ధోనీ, రైనా, కేదార్ జాదవ్‌తో సహా చాలా మంది ఆటగాళ్లు ఇక్కడ నిర్వహించిన శిక్షణ శిబిరంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సహచర క్రికెటర్లతో దిగిన ఫొటోలను టీమిండియా మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ తన ఇన్‌స్టాగ్రాం ద్వారా అభిమానులతో పంచుకున్నాడు. కాగా, శ్రీలంక సిరీస్ కోసం తాను ఎంతో ఆతృతతో ఎదురు చూస్తున్నానని ధోనీ తెలిపాడు. ఇదిలావుండగా, వన్డే సిరీస్‌లో సీనియర్లు రవీంద్ర జడేజా, మహ్మద్ షమి, రవీంద్ర జడేజా, కెప్టెన్ విరాట్ కోహ్లి తదితరులకు విశ్రాంతి ఇవ్వాలనే ఉద్దేశంతో భారత క్రికెట్ బోర్డు ఉంది. దీంతో చాలా మంది యువ ఆటగాళ్లకు లంక సిరీస్‌లో ఆడే అవకాశం దక్కనుంది. కాగా, కెప్టెన్ కోహ్లి మాత్రం వన్డే సిరీస్‌లో ఆడాలనే ఉద్దేశంతో ఉన్నాడు.

రఫెల్ నాదల్‌కు షాక్



మాంట్రియల్ : మాంట్రియల్ మాస్టర్స్ టెన్నిస్ టోర్నమెంట్‌లో టాప్ సీడ్, స్పెయిన్ బుల్ రఫెల్ నాదల్‌కు అనూహ్య ఓటమి ఎదురైంది. కెనడా సంచలనం డెనిస్ షాపొవాల్వొ ప్రిక్వార్టర్ ఫైనల్ పోరులో టాప్ సీడ్ నాదల్‌పై సంచలన విజయం సాధించాడు. నంబర్‌వన్ ర్యాంక్ కోసం తహతహలాడుతున్న నాదల్‌కు ఈ ఓటమి కోలుకోలేని దెబ్బతీసిందనే చెప్పాలి. హోరాహోరీగా సాగిన పోరులో 16 ఏళ్ల షాపొవాల్వొ 3–6, 6–4, 7–6 తేడాతో టాప్ సీడ్ నాదల్‌పై సంచలన విజయం సాధించాడు. తొలి సెట్‌లో ఓటమి పాలైన కెనడా టీనేజర్ తర్వాత చెలరేగి ఆడాడు. వరుసగా రెండు సెట్లు గెలిచి నాదల్‌ను మట్టి కరిపించాడు. షాపొవాల్వొ ధాటికి నాదల్ వద్ద సమాధానమే లేకుండా పోయింది. చూడచక్కని షాట్లతో చెలరేగిన షాపొవాల్వొ సంచలన విజయంతో క్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లాడు. అంతకుముందు రెండో రౌండ్‌లో షాపొవాల్వొ యూఎస్ ఓపెన్ మాజీ ఛాంపియన్ డెల్‌పొట్రోను కూడా ఓడించాడు. మరోవైపు స్విట్జర్లాండ్ దిగ్గజం, రెండో సీడ్ రోజర్ ఫెదరర్ క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నాడు. ప్రిక్వార్టర్ ఫైనల్లో ఫెదరర్ 4–6, 6–4, 6–2 స్పెయిన్ ఆటగాడు డేవిడ్ ఫెర్రర్‌ను ఓడించాడు.

గుజరాత్ ఘన విజయం

అహ్మదాబాద్: ప్రొ కబడ్డీ ఐదో సీజన్‌లో భాగంగా శుక్రవారం అహ్మదాబాద్‌లో జరిగిన తొలి మ్యాచ్‌లో గుజరాత్ ఫార్చ్యూన్ జెయింట్స్ జట్టు విజయం సాధించింది. ఏక పక్షంగా సాగిన పోరులో గుజరాత్ 39 – 21 తేడాతో యు ముంబాను చిత్తు చేసింది. ప్రారంభం నుంచే గుజరాత్ చెలరేగి ఆడింది. గుజరాత్ దూకుడైన ఆటతో ముంబా చేతులెత్తేసింది. సొంతగడ్డపై ఆడిన తొలి మ్యాచ్‌లోనే గుజరాత్ పైచేయి సాధించింది. రోహిత్ గుల్లా, సచిన్ అద్భుత ఆటతో ఆకట్టుకున్నారు. వీరిద్దరికి తోడు అబోజర్ మిఘాని, సుకేష్ హెగ్డే కూడా రాణించారు. చెలరేగి ఆడిన రోహిత్ 9 పాయింట్లతో టాప్ రైడర్‌గా నిలిచాడు. సచిన్ కూడా 8 పాయింట్లు సాధించి తనవంతు సహకారం అందించాడు. అబోజర్ ఐదు, సుకేష్ నాలుగు పాయింట్లు సాధించి జట్టు విజయంలో ముఖ్య భూమికను పోషించారు. ముంబా జట్టులో అనూప్, కుల్దీప్, సబ్‌స్టిట్యూట్ ఆటగాడు కషిలింగ్ నాలుగేసి పాయింట్లు సాధించినా ఫలితం లేకుండా పోయింది.



Printed and published by K Sreenivas Reddy, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037, R.R.Dist., TELANGANA and Published from H.No.12-1-493/VA, Giriprasad Bhavan,Opp:Rajiv Swagruha Offices Complex, Bandlaguda Main Road, Nagole, R.R. Dist. and owned by M/s. Moveon Media Private Limited, **Editor: K. Sreenivas Reddy,** RNI Regn. No.TELTEL/2012/42234, Phone No/Fax:040-27655666, e-mail : editor@manatelangana.org.